


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

లీగల్ నోటీసులకు భయపడబోం

కేంద్ర మంత్రి బండి సంజయ్

భూ కేటాయింపు అక్రమాలపై అమోయ్ కుమార్‌ను ప్రశ్నించిన ఇడి

లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 323 | గురువారం | 24-10-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ‘పరిపక్వత–విజ్ఞత’ చూపిద్దాం

సరిహద్దు వివాదంపై భారత్–చైనా చర్చల పునరుద్ధరణ

ద్వైపాక్షిక సంభాషణలో మోదీ–జిన్‌పింగ్ అంగీకారం

త్వరలో ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశం

‘బ్రిక్స్ సదస్సు’ వేదికగా కజన్‌లో నేతల భేటీ



**కజన్ :** భారత్ – చైనా మధ్య సరిహద్దు వివాదంపై స్తంభించిన చర్చలు త్వరలో తిరిగి ప్రారంభమవుతాయి. ‘బ్రిక్స్’ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇద్దరూ బుధవారంనాడు విడిగా ముఖాముఖీ ద్వైపాక్షిక సమావేశం జరిపారు. తూర్పు లఢఖ్ సరిహద్దు సమస్యపై అపరిష్కృతంగా ఉన్న చర్చలను పునరుద్ధరించాలని వారు అంగీకరించారు. సమస్య పరిష్కారానికి పరిపక్వత, విజ్ఞత ప్రదర్శించాలని ఉద్ఘాటించారు. సరిహద్దు సమస్య పరిష్కారానికి చర్చల్లో కీలకపాత్ర నిర్వహించే ప్రత్యేక ప్రతినిధులకు నాయకులిద్దరూ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులు త్వరలో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తారు. దాదాపు ఐదేళ్ళ తర్వాత మోదీ–జిన్‌పింగ్ మధ్య జరిగిన మొదటి ద్వైపాక్షిక సంభాషణల్లో ఈ అంగీకారం కుదిరింది. పరిపక్వత,విజ్ఞత ప్రదర్శించడం ద్వారా పరస్పర గౌరవంతో భారత్– చైనా రెండు దేశాలూ శాంతియుతమైన, స్థిరమైన సంబంధాలు కలిగి ఉండగలవని వారిద్దరూ ఉద్ఘాటించి పరస్పరం అంగీకారం తెలియజేశారు. రెండు దేశాలమధ్యా శాంతికి విఘాతం కలిగిస్తున్న విభేదాలు, వైరుధ్యాలను, వివాదాలను సక్రమంగా అర్థం చేసుకుని పరిష్కరించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా మోదీ పదేపదే జిన్‌పింగ్‌కు చెప్పారు. ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ఒక పోస్టింగ్ కూడా పెట్టారు. ‘‘భారత్–చైనా సంబంధాలు రెండు దేశాల ప్రజలకూ చాలా ముఖ్యం. ప్రాంతీయ, ప్రపంచ శాంతికి, స్థిరత్వానికి కూడా చాలా అవసరం. పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం, సున్నితత్వం వంటివన్నీ రెండు దేశాల ద్వైపాక్షిక తరువాయి 2లో



## ఏకాభిప్రాయంతో ఉగ్రవాదంపై పోరాడదాం

‘బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు’లో భారత ప్రధాని మోదీ

కజన్ : ఉగ్రవాదంపై పోరాటానికి ఏకాభిప్రాయంతో దృష్టి కేంద్రీకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు ఇచ్చారు. ‘బ్రిక్స్’ (బ్రెజిల్, రష్యా, భారత్,చైనా, దక్షిణాఫ్రికా) 16వ శిఖరాగ్ర సదస్సు రెండోరోజు బుధవారంనాడు నరేంద్రమోదీ ప్రసంగించారు. అదేవిధంగా సైబర్ సెక్యూరిటీ, కృత్రిమమేథ సాంకేతికతను సురక్షిత పద్ధతులలో అమలు చేసేందుకు విధించే ప్రపంచ నియంత్రణలపై కూడా ‘బ్రిక్స్’ దేశాలు ఐక్యంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రష్యాలోని తాతరన్ (తాతారియా) రిపబ్లిక్ ప్రధాన నగరం కజన్‌లో ఈనెల 22న ప్రారంభమైన ‘బ్రిక్స్’ 16వ సదస్సు 24 వరకూ జరుగుతుంది. ఉగ్రవాద సవాలుతో వ్యవహరించేటప్పుడు ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదన్నారు. ఉగ్రవాదంపై చేసే పోరాటంలో, దానికి మద్దతు ఇవ్వడంలో ఏకాభిప్రాయ లక్ష్యంతో దృష్టి కేంద్రీకరించాలని బ్రిక్స్ సభ్యదేశాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. యువతరాన్ని ఉగ్రవాదంవైపు మళ్ళించేందుకు జరిగే ప్రయత్నాలు అడ్డుకునేందుకు ‘క్రియాశీల చర్యలు’ తీసుకోవాల్సిన అవసరాన్ని మోదీ గట్టిగా నొక్కి చెప్పారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌ల తరువాయి 2లో

# అంబుజా వద్దు

● సిమెంట్ పరిశ్రమ వల్ల ప్రాణాంతక వ్యాధులు వస్తాయని ప్రజలు తీవ్ర ఆందోళన ● నల్లదుస్తులు, ప్లకార్డులతో అఖిలపక్ష నేతల ధర్నా ● సబ్‌కోర్టు నిర్మాణం వద్ద ఫ్యాక్టరీ చేపట్టొద్దని డిమాండ్ ● యాదాద్రి జిల్లా రామన్నపేటలో ఆందోళనలు, నిరసనల మధ్య ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ ● జెసి కాన్వాయ్ అడ్డగింత





ప్రజాపక్షం/ రామన్నపేట

యాదాద్రి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమపై బుధవారం జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఆందోళనలు, నిరసనల మధ్య ముగిసింది. అంబుజా సిమెంట్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి జెసి బెన్‌శాలోమ్ అధ్యక్షత వహించగా కాలుష్య నియంత్రణ మండలి ఉమ్మడి జిల్లా అధికారి సంగీత హాజరయ్యారు. సిమెంట్ పరిశ్రమ వల్ల ప్రాణాంతక వ్యాధులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ గోబ్యాక్, అంబుజా వద్దురా రామన్నపేట ముద్దురా అంటూ రామన్నపేట, సిరిపురం, కొమ్మాయిగూడెం గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులు, రైతులు, చేతివృత్తిదారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణం వద్ద నల్ల దుస్తులు, ప్లకార్డులను పట్టుకొని ధర్నా చేశారు. జెసి ధర్నా వద్దకు చేరుకొని మీ అభిప్రాయాలను సభ ప్రాంగణంలో తెలియచేయాలని తెలపడంతో ధర్నా విరమింప చేసి ఒక్కొక్కరుగా వెళ్లి రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించవద్దని ముక్తకంఠంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం పూర్తయ్యేంతవరకు అంబుజా గోబ్యాక్ అంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. డ్రైపోర్టు పేరుతో రైతులను మోసం చేసి 350 ఎకరాల పచ్చని వ్యవసాయ భూములను కొనుగోలు చేశారని, ఇప్పుడు కాలుష్య ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడమేంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కాలుష్యకారక సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే చేతి, కుల వృత్తులు, వ్యవసాయం తదితర పనులు పూర్తిగా దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సబ్ కోర్టు తరువాయి 2లో



## ఫ్యాక్టరీతో మూసీనది కాలుష్యం

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్‌రెడ్డి తరువాయి 2లో



## హైడ్రాపై ‘స్టే’కు హైకోర్టు నిరాకరణ

చర్యలు చట్ట నిబంధనల మేరకు ఉండాలని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ రివర్ బెడ్లో నిర్మాణాల కూల్చివేత చర్యలు, రిజర్వాయర్ల రక్షణకు ఏర్పాటైన హైడ్రా చర్యలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం బాధితులకు నోటీసులు ఇచ్చాకే తదుపరి చర్యలు ఉండాలని ఆదేశించింది. ఈ విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నందున మధ్యంతర స్టే ఆదేశాలు అవసరం లేదని తెలిపింది. హైడ్రా, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు వేయాలని ఆదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు తరువాయి 12లో







# బోధనా రుసుం చెల్లించాలి

విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి : కలెక్టరేట్ల ముందు ఎఐఎస్ఎఫ్ ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యార్థుల స్కాలర్ షిఫ్‌లతో పాటు బోధన రుసుంలను వెంటనే విడుదల చేయాలనిఅఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిఫ్‌ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తరువాయి 2లో

# నూక బియ్యానికి అధిక డిమాండ్

మలేషియన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్

అవకాశాలను పరిశీలించి తప్పక ఎగుమతి చేస్తాం : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్




మలేషియాలో నుక బియ్యం (బ్రోకెన్ రైస్)కు అత్యధికంగా డిమాండ్ ఉందని, ఎగుమతికి సంబంధించి ఆవకాశాలను పరిశీలించాల్సిందిగా మలేషియాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్ వివరించగా, ఇందుకు గల అవకాశాలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తరణవకాశాలు, ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వహణ, సాగులో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు, ఆయిల్ పామ్ ఉత్పాదక తరువాయి 2లో




జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

మతం పేరుతో ఓట్లు రాబట్టుకునే పనిలో బిజెపి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని ‘ధ్వజం’

# వికాసం కాదు.. వినాశనం

ప్రజాపక్షం/భీమదేవరపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెప్పేది వికాసం, చేసేది వినాశనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. మతం పేరుతో ఓట్లు ఎలా సంపాదించుకోవాలో కింది స్థాయి నుండి పైస్థాయి నాయకత్వం వరకు బిజెపి ఒకటే ఆలోచిస్తుందన్నారు. బిజెపికి ప్రియమైన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ చేరిందని, ఆ రాష్ట్రానికి మాత్రమే నిధులు అందుతాయని, రాష్ట్ర పునర్విభజన చట్టంలో చేర్చిన అంశాలకు నిధులు ఇవ్వడంలేదని ఆరోపించారు. జిఎస్‌టి లాంటివి రాష్ట్రాలు ఎక్కువగా చెల్లిస్తే కేంద్రం తిరిగి తక్కువగా ఇస్తుందని, ఇప్పటికే జిఎస్‌టిని చాలా రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. పంటలకు ధరలు నిర్ణయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కార్మిక చట్టాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలు చేస్తే అణిచివేయడం ఎక్కువైందని, ఇటీవల ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని అన్నారు. వరవరరావుకు బెయిల్ వచ్చినా బయటకు రావడం లేదని, కోర్టులు, వ్యవస్థలన్నిటినీ స్వాధీనం చేసుకుందని అన్నారు. మిత్రులను కలుపుకోవడంలో కాంగ్రెస్ విఫలమవుతుందని, తెలంగాణలో కాంగ్రెస్ తరువాయి 2లో



## నాకు 35 ఏళ్ల రాజకీయ అనుభవం

17 ఏళ్ల వయస్సు నుంచే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నా...

వయనాడ్‌లో నామినేషన్ వేసిన ప్రియాంకాగాంధీ

కాల్‌పెట్ట వద్ద భారీ ర్యాలీ

**వయనాడ్ :** కేరళలోని వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవంబరు 13వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా వయనాడ్ నుంచి నామినేషన్ వేశారు. దీంతో ఆమె ప్రత్యక్ష ఎన్నికల్లోకి అరంగేట్రం చేసినట్లయింది. ప్రియాంకాగాంధీకి యుడిఎఫ్ నాయకులు, కార్యకర్తలు సహా వేలాది మంది మంది ఘనస్వాగతం పలికారు. నామినేషన్ వేయడానికి ముందు కాల్‌పెట్ట వద్ద కొత్త బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కాల్‌పెట్ట వద్ద ర్యాలీకి హాజరైన అశేష జనవాళినుద్దేశించి ప్రియాంక మాట్లాడారు. తనకు 17 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు 1989 నుంచి ఎన్నికల ప్రచారంలో ఉన్నానని చెప్పారు. అందులో తనకు 35 ఏళ్ల అనుభవం ఉందన్నారు. తన తల్లి సోనియాగాంధీ, సోదరుడు రాహుల్‌గాంధీ, ఇతర పార్టీ సహచరుల కోసం ప్రచారం చేస్తూనే ఉన్నానని తెలిపారు. కానీ నాకోసం ప్రచారంలో పాల్గొనడం ఇదే తొలిసారి అని అన్నారు. బిజెపి నుంచి వయనాడ్ నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న నవ్య హరిదాస్ రెండు రోజుల క్రితం తరువాయి 2లో

దస్త్రాలు పరిశీలించకుండానే

# అఫిడవిట్ ఎలా ఇస్తారు?

చీఫ్ ఇంజినీర్‌పై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్ తీరుపై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఎన్ని సార్లు సందర్శించారని కమిషన్ ప్రశ్నించగా, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు ప్రమాదం జరగకముందు పరిశీలించానని అజయ్ బదులిచారు. దాంతో సుందిళ్ల బ్యారేజీని ఎందుకు పరిశీలించలేదు? తొలిసారి వరద వచ్చాక 3 బ్యారేజీలను సందర్శించారా? అని కమిషన్ ప్రశ్నించింది. సమస్యలు ఉన్నాయని నివేదిక రాకపోవడంతో సందర్శించలేదని ఆయన జవాబిచ్చారు. అయితే క్వాలిటీ కంట్రోల్ సిఈ స్థాయిలో ఉంటూ రికార్డులను సరిచూసుకోకుండానే అఫిడవిట్ ఎలా సమర్పిస్తారని కమిషన్ నిలదీసింది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణకు ఏర్పాటైన పి.సి.ఘోష్ కమిషన్ బుధవారం విచారణ జరిపింది. ఈ విచారణకు కాళేశ్వరం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్‌సి నాగేందర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్‌పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు సంధించింది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్ లో స్టేట్ అండ్ సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని, రామగుండం ఈఎన్‌సి చేతిలోనే మూడు బ్యారేజీలు కొనసాగాయని కాళేశ్వరం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తరువాయి 2లో

# ఒక్కో పార్టీకీ 85 సీట్లు..

‘మహా’లో విపక్ష ఎంవిఎ కూటమి నిర్ణయం!



**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష ‘మహా వికాస్ అఘాడీ’ కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ కూటమిలోని ప్రధాన పక్షాలైన శివసేన (యుబిటి), కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీచేయాలని నిర్ణయించాయి. 288 సీట్లకు గానూ మిగిలిన 33 స్థానాల్లో కూటమిలోని మూడు పార్టీలు, చిన్న పార్టీలు పోటీ చేసేలా చర్చలు సాగుతున్నాయి. మొత్తంగా 270 సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరగా.. మిగతా 18 స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ సహా ఇతర భాగస్వామ్యపక్షాలకు ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నట్లు కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే వెల్లడించారు. ఈ మేరకు ఆయన శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్, ఇతర నేతలతో కలిసి ముంబయిలో మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 సీట్లు ఉండగా.. 270 సీట్లపై సామరస్యపూర్వకంగా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించారు. అయితే, సీట్ల పంపకాలపై తుది ఒప్పందానికి సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతున్నట్లు చెప్పారు. దీనిపై సమాజ్‌వాదీ పార్టీతో పాటు కూటమిలోని ఇతర పార్టీలతో చర్చలు జరిపి.. గురువారం నాటికి అంతా పూర్తి చేస్తామని తెలిపారు. తామంతా మహా వికాస్ అఘాడీ కూటమిగా పోటీ చేస్తున్నామని.. ఎన్నికల్లో ‘మహాయుతి కూటమి’పై విజయం సాధించి తరువాయి 2లో

# పాశ్చాత్య ఆధిపత్యానికి కళ్లెం వేయడమే ధ్యేయం




## 'బ్రిక్స్' సమావేశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్




**కజాన్:** ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న పాశ్చాత్య దేశాల ఆధిపత్యానికి కళ్లెం వేయడమే లక్ష్యమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. 'బ్రిక్స్' కూటమి శిఖరాగ్ర సమావేశానికి రష్యా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నాటి కార్యక్రమాన్ని ప్రారంభించిన పుతిన్ మాట్లాడుతూ, ప్రపంచ ఐక్యతను కోరుతున్నామని అన్నారు. పాశ్చాత్య దేశాల ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలన్నీ ఒకటి కావాలని పిలుపునిచ్చారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో ప్రారంభమైన ఈ బ్రిక్స్ కూటమిని తర్వాత విస్తరించి, ఇరాన్, ఈజిప్టు, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, టర్కీ, అజర్‌బైజాన్, మలేసియా దేశాలకు కూడా సభ్యత్వమిచ్చారు. ఇంకా అనేక దేశాలు తమతో చేరాలని ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయని పుతిన్ అన్నారు. కాగా, భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తోసహా మొత్తం 36 దేశాలకు చెందిన నేతలు హాజరైన ఈ సమావేశాన్ని రష్యా నిర్వహించిన అతిపెద్ద విదేశీ వ్యవహారాల శిఖరాగ్ర సమావేశంగా పుతిన్ అభివర్ణించారు. ఎన్నో సమస్యలు ప్రపంచాన్ని వేధిస్తున్నాయని, వాటి నుంచి బయటపడేందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు.

రష్యాతో తమ దేశానికి ఉన్న చిరకాల మైత్రీ సంబంధాలను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రస్తావించినట్టు సమాచారం. బ్రిక్స్ సమావేశం ప్రారంభానికి ముందు పుతిన్‌తో జిన్‌పింగ్ సమావేశమయ్యారు. వీరిద్దరూ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించినట్టు తెలుస్తోంది. కాగా, జిన్‌పింగ్‌ను ఉటంకిస్తూ చైనా మీడియా విడుదల చేసిన వార్తా కథనాలను అనుసరించి, ఇరువురు నేతలు పరస్పర సహకారం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఉక్రేన్‌పై రష్యా అనవసరంగా దాడి చేస్తున్నదని పేర్కొంటూ అమెరికా, యూరోపియన్ దేశాలు ఆంక్షలు విధించినప్పుడు కూడా చైనా తన మిత్ర ధరాన్ని వీడలేదని జిన్‌పింగ్ అన్నారు. ఉక్రేన్‌పై సైనిక చర్య విషయంలో రష్యా వాదనకు తమ పూర్తి మద్దతు ఉందని ఆయన స్పష్టం చేశారు.

# హిజ్బొల్లా మరో కీలక నేత హతం

## ఇజ్రాయెల్ ప్రకటన... ధ్రువీకరించని బీరూట్ వర్గాలు



**బీరూట్:** హిజ్బొల్లాకు చెందిన మరో కీలక నేతను హతమార్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే, బీరూట్ వర్గాలు మాత్రం ఈ వార్తను ఇంకా ధ్రువీకరించలేదు. ఇజ్రాయెల్ సైనికాధికారుల ప్రకటనను అనుసరించి, హిజ్బొల్లా వ్యవస్థాపకుల్లో ఒకరు, ఆ సంస్థ సూపర్ కమాండర్ హసన్ నస్రల్లా స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉన్న షహీమ్ సఫియెద్దీన్ తాజా దాడుల్లో మరణించాడు. గత నెల జరిపిన వైమానిక దాడుల్లో నస్రల్లా మరణించగా, అతని స్థానంలో హిజ్బొల్లాను సఫియెద్దీన్ ముందుకు నడిపిస్తాడన్న వార్త బలంగా ప్రచారంలో ఉంది. అయితే, సఫియెద్దీన్‌తోపాటు మరో 25 మంది హిజ్బొల్లా అగ్ర నేతలను హతమార్చినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. అయితే, అతనిని ఎప్పుడు, ఎక్కడ మట్టుబెట్టారన్న వివరాలు వెల్లడించలేదు. కాగా, గతవారం గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హమాస్ అగ్రనేత యాహ్యా సిన్వర్ మరణించాడు. అటు హమాస్, ఇటు హిజ్బొల్లా కూడా కీలక నేతలను పోగొట్టుకుందని, ఈ నేపథ్యంలో దాడులను నిలిపివేయాలని ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్‌కు సూచించినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. అమెరికా విదేశంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ప్రస్తుతం ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్నారు. హమాస్ కీలక నేత సిన్వర్ మృతితో అనుకున్న లక్ష్యాలను ఇజ్రాయెల్ చేరిందని, కాబట్టి గాజాలో యుద్ధాన్ని ముగించాలని ఆయన సూచిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుతో కూడా ఆయన సమావేశమయ్యారు. అధికారికంగా ఈ భేటీ వివరాలు తెలియకపోయినా, విశ్వసనీయ వర్గాల సమాచారాన్ని అనుసరించి వీరి సమావేశం స్నేహపూరిత వాతావరణంలో కొనసాగింది. ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. కాల్పుల విరమణ, గాజాలో మానవతా సాయం అందచేత వంటి అంశాలు చర్చకు వచ్చాయా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

## నూక బియ్యానికి అధిక డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

తదితర ఆంశాలపై శాస్త్రీయ అధ్యాయానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్, ఉద్యానశాఖ, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషాలతో కూడిన బృందం మలేషియా పర్యటిస్తున్నారు. పర్యాటనలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం బిజిబిజిగా గడిపారు.ఇందులో భాగంగా ముందుగా మలేషియా ప్లాంషన్ కమోడిటీస్ మంత్రి జోహరి అబ్దుల్ ఘనితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వము ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రస్తుత పరిస్థితి , రానున్న రోజుల్లో ఆయిల్ పామ్ పరిశ్రమ అభివృద్ధికి గల అవకాశాలను వివరించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆయిల్ పామ్ సాగులో అగ్రగామి దేశాలలో ఒకటిగా ఉన్న మలేషియా నుంచి సహకారం అందించాల్సిందిగా కోరారు. మలేషియా మంత్రి స్పందిస్తూ 143 కోట్ల జనాభా గల దేశానికి ఆహారం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రపంచ దేశాలు అన్నీ ఇందుకు భారత దేశం అవలంబిస్తున్న విధివిధానాలను చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పామ్‌ఆయిల్ వృద్ధికి తాము అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని, త్వరలోనే తమ అధికారిక బృందం తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తారని హామీ చ్చారు. మధ్యాహ్నంమ్యాట్రేడ్ చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్‌తో భేటీఅయినమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియాతో వ్యవసాయపరంగా గల వ్యాపార అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్ మాట్లాడుతూ ఇండియాతో వ్యాపారాభివృద్ధికి తమదేశం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది, వ్యాపార పరంగానే కాక ఇండియాతో తమకు సామాజికంగా, చారిత్రకంగా కూడా బంధము ఉన్నదని తెలిపారు. నుక బియ్యం (బ్రోకెన్ రైస్) కు తమ దేశంలో అత్యంత డిమాండ్ ఉందని ఆయన వివరించారు. దీంతో ఎగుమతికి గల అవకాశాలను పరిశీలిస్తామన్న మంత్రి ఆ వెంటనే హక్కా ఎండి చంద్రశేఖర్ రెడ్డిని టెలిఫోన్ లో సంప్రదించి రాష్ట్రంలో బ్రోకెన్ రైస్ ఎగుమతి సంబంధించిన అంశాలను పరిశీలించాలని సూచించారు. నుక బియ్యం ఎగుమతి వల్ల రాష్ట్రంలోని వరి రైతులకు అదనపు ప్రయోజనం కలిగితే, వచ్చే యాసంగి కల్లా ఎగుమతి చెయ్యడానికి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సాయంత్రం పర్యటనలో భాగంగా మలేషియా పామ్ ఆయిల్ బోర్డును సందర్శించి, పామ్ ఆయిల్ రంగంలో వాళ్ళ అనుభవాలను మలేషియా పామ్ ఆయిల్ బోర్డు ఎంపిఓబి చైర్మన్ డా. అహ్మద్ పర్వేజ్ గులామ్ ఖాదీర్ పర్యటన బృందంతో పంచుకున్నారు. మలేషియా పామ్ ఆయిల్ బోర్డు ఆయిల్ పామ్ సాగులో ఒక నూతన ఒరవడిని సృష్టించిందని, అంతేగాక ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే ప్రాంతాలలో పంట విస్తరణకు కావాల్సిన సాంకేతిక సహాయం అందిస్తుందని మంత్రి తుమ్మలకు వివరించారు.

# సామ్రాజ్యవాద బ్రిటన్‌పై నా నిరసన ఆగదు

## ఆస్ట్రేలియా సెనెటర్ లిడియా థోర్ప్



**కాన్‌బెరా:** సామ్రాజ్యవాద బ్రిటన్‌కు వ్యతిరేంగా తన నిరసన ఆగదని ఆస్ట్రేలియా సెనెటర్ లిడియా థోర్ప్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఆబిసి)కి బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ కింగ్ చార్లెస్ రాకను వ్యతిరేకించడంలో తప్పులేదని వ్యాఖ్యానించింది. ఆస్ట్రేలియా పార్లమెంటు సమావేశాల సందర్భంగా చార్లెస్ ప్రసంగిస్తున్నప్పుడు 'ఇది మీ దేశం కాదు... మీరు మా రాజు కాదు' అంటూ లిడియా బిగ్గరగా కేకలు వేసిన విషయం తెలిసిందే. చార్లెస్ వద్దకు దూసుకెళ్లి, ఆస్ట్రేలియా మూలవాసులకు బ్రిటిషన్ వలస పాలన కారణంగా జరిగిన నష్టాన్ని తెలియచెప్పడానికి ప్రయత్నించి ఆమెను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. ఆ ఘటనను ప్రస్తావిస్తూ, తాను ఎలాంటి పొరపాటు చేయలేదని లిడియా అన్నారు. ఆస్ట్రేలియా మూలవాసులు ఎంతో మంది ప్రాణాలను హరించిన బ్రిటిష్ రాచరికాన్ని ఎందుకు సహించాలని ఆమె ప్రశ్నించారు. ఆస్ట్రేలియా వలస పాలన నుంచి బయటపడినప్పటికీ, ఇప్పటికీ సార్వభౌమాధికార దేశంగా అవతరించకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు. ఇప్పటికీ బ్రిటిష్ రాజే ఆస్ట్రేలియా సర్వాధిరిగా కొనసాగడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. తమ దేశ మూలాలను పెకలించి వేయడానికి ప్రయత్నించిన చార్లెస్‌కు నిరసన తెలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లిడియా పేర్కొంది. ఇలావుంటే, ఆస్ట్రేలియా పర్యటనను ముగించుకున్న చార్లెస్ సమోవా బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన కామన్వెల్త్ దేశాధినేతల సమావేశంలో పాల్గొంటారు.

## వాట్సాప్, గూగుల్ డ్రైవ్‌పై హాంకాంగ్ నిషేధం

**హాంకాంగ్:** భద్రతాపరమైన ప్రమాదాల దృష్ట్యా చాలా ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ కార్యాలయ కంప్యూటర్లలో వాట్సాప్, విచాట్, గూగుడ్రైవ్ వంటి ప్రసిద్ధ సోషల్ యాప్స్‌ను వినియోగించడాన్ని హాంకాంగ్ ప్రభుత్వం నిషేధించింది. డిజిటల్ మాలసీ కార్యాలయం నుంచి విడుదలైన తాజా ఐటి భద్రతా మార్గదర్శకాలను అనుసరించి, ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాల్లో పని చేసే సమయంలోనూ వాట్సాప్ వంటి యాప్స్‌ను ఉపయోగిస్తున్నారని, దీనితో పని కుంటుపడుతున్నదని విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. ఈ కారణంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, వ్యక్తిగత కంప్యూటర్లలో వాటి వాడకాన్ని కొనసాగించుకోవచ్చని తెలిపింది. సోషల్ మీడియా యాప్స్ కారణంగా ఇటీవల పెరుగుతున్న డేటా లీకేజ్ అంశాన్ని కూడా హాంకాంగ్ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. సైబర్ సెక్యూరిటీ అధికారులు కూడా ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హ్యాకింగ్, డేటా లీక్ వంటి సమస్య తీవ్రతరమవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ కార్యాలయాల నుంచి అత్యంత విలువైన సమాచారాన్ని కొల్లగొట్టే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. అందుకే, కార్యాలయ కంప్యూటర్లలో వాటిని వినియోగించకపోవడమే మేలని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనలపై హాంకాంగ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

## అఫిడవిట్ ఎలా ఇస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ఈఎన్‌సి నాగేందర్ కమిషన్‌కు వివరించారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా? గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? పరిమితికి మించి నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. రామగుండం ఈఎన్‌సి నిబంధనలు పాటించలేదని కమిషన్ ముందు నాగేందర్ చెప్పారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లనే మూడు బ్యారేజీలు డ్యామేజ్ అయ్యాయా అని కమిషన్ ప్రశ్నించగా, నాగేందర్ మాట్లాడుతూ 2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకమైన సిబ్బంది లేరని, 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ టీమ్ ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సికి రిపోర్ట్లు ఇచ్చామని తెలిపారు. ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ ఇచ్చిన రిపోర్ట్స్ పై ఎలాంటి యాక్షన్ రామగుండం ఈఎన్‌సి తీసుకోలేదన్నారు. సిడబ్ల్యుసి మాన్యువల్ నిబంధనలు ఫాలో చేశారా అని కమిషన్ అడిగిన ప్రశ్నలకు పాటించలేదని నాగేందర్ సమాధానం ఇచ్చారు. మూడు బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేశారా అని కమిషన్ ప్రశ్నించగా నాగేందర్ సమాధానమిస్తూ 2019 నుంచి మూడు బ్యారేజీలలో పరిమితి నీళ్లను నిలువ చేశామన్నారు.

## ఒక్కో పార్టీకి 85 సీట్లు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. సీట్ల సర్దుబాటులో జరుగుతోన్న జాప్యం పట్ల చిన్న పార్టీలు గుర్రుగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, సిపిఐ, సిపిఐ(ఎం), పిడబ్ల్యుపిలు కూటమిలో ఉన్నాయి. 12 సీట్లు ఆశిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ఐదు చోట్ల అభ్యర్థులను ప్రకటించింది.

**సిఎం షిండేపై పోటీ ఎవరంటే?**

మరోవైపు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు శివసేన (యుబిటి) అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. మొత్తం 65మందితో జాబితాను విడుదల చేసింది. ముంబయిలోని వర్లి నుంచి మాజీ సిఎం ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే పోటీ చేయనున్నారు. మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ శిందే నియోజకవర్గమైన కోప్రి పాచ్‌పఖడి సీటులో ఆయన రాజకీయ గురువు ఆనంద్ దిఘే సోదరుడి కుమారుడైన కేదార్ దిఘేను ఉద్ధవ్ ఠాక్రే బరిలో దించారు. ప్రస్తుతం కేదార్ దిఘే థానే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉద్ధవ్ అనుయాయుడు, మాజీ ఎంపీ రాజన్ విచారేకు థానే అసెంబ్లీ సీటును కేటాయించారు. అవిభాజ్య శివసేన తరఫున 2009 నుంచి ఏక్‌నాథ్ శిందే కోప్రి పాచ్‌పఖడీ సీటు నుంచి వరుసగా గెలుస్తూ వచ్చారు. 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిపై 89వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. సిఎం షిండే అక్టోబర్ 28న నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

## ఉగ్రవాదంపై పోరాడదాం

(మొదటి పేజీ తరువాయి)

సమక్షంలో మోదీ పైవిధంగా ప్రతిపాదన చేశారు. ఉగ్రవాదాన్ని ప్రతిఘటించేందుకు, ఉగ్రవాదులకు పెట్టుబడులు సమకూర్చకుండా అడ్డుకునే విషయంలోనూ ఏకదృష్టితో, ఏకాభిప్రాయంతో అందరూ దృఢంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. ఉగ్రవాదంపై జరిగే పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదనీ, ఇది చాలా తీవ్రమైన విషయమని, క్రియాశీల చర్యలు అవసరమని ఉద్ఘాటించారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాదులకు సంబంధించి ఐక్యరాజ్యసమితిలో చేసిన అనేక ప్రతిపాదనలను చైనా అడ్డుకున్న పూర్వరంగంలో మోదీ చేసిన ప్రతిపాదన ప్రాముఖ్యత సంతరించుకుంది. ''అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర సదస్సు అంశంఐక్యరాజ్యసమితిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నందువల్ల ఈ విషయంపై బ్రిక్స్ దేశాలన్నీ తప్పనిసరిగా కలిసి పనిచేయాలి'' అని మోదీ ప్రతిపాదించారు. 'బ్రిక్స్' వేదికను విస్తరించాల్సిన ఆవశ్యకతను కూడా ఆయన ప్రస్తావించారు. కొత్త దేశాలను 'బ్రిక్స్' కూటమిలో భాగస్వాములుగా ఆహ్వానం పలికేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో నిర్ణయాలను ఏకాభిప్రాయంతో తీసుకోవాలని, 'బ్రిక్స్' వ్యవస్థాపక సభ్యదేశాల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు. గత ఏడాది జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన 'బ్రిక్స్' సదస్సు మార్గదర్శక సూత్రాలు, ప్రామాణికతలు, కొలమానాలు, కార్యవిధాన పద్ధతులను సభ్యదేశాలు, భాగస్వామ్యదేశాలతో కలిసి రూపొందించాలని అన్నారు. నిర్ణీత కాలపరిధిలో పనులు పూర్తిచేయాలన్న సుముఖతతో బ్రిక్స్ సంస్థ పనిచేస్తోందన్నారు. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి, బహుముఖంగా సేవలందించే అభివృద్ధి బ్యాంకులు, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి ప్రపంచ సంస్థలలో సంస్కరణలను ఉమ్మడిగా, ఐక్యంగా గళమెత్తి ప్రస్తావించాలన్నారు. ప్రపంచ సంస్థలలో భాగస్వాములుగా ఉంటూ వాటిని సంస్కరించాలని కోరుకోవడానికి బదులుగా వాటిస్థానంలో ప్రత్యామ్నాయంగా ఈ సంస్థ పనిచేస్తుందనే ఆలోచనలు లేకుండా చాలా జాగ్రత్తగా బ్రిక్స్ కార్యకలాపాలను ముందుకు తీసుకువెళ్ళాలని సభ్యదేశాలకు, కొత్తగా బ్రిక్స్‌లో సభ్యత్వం తీసుకునే దేశాల ప్రతినిధులకు హితవు చెప్పారు.

**అభివృద్ధి చెందుతున్న దేశాల గళంగా బ్రిక్స్ ఎదగాలి : జిన్‌పింగ్**

'బ్రిక్స్' లో భాగస్వామ్యం కావాలనుకునే దేశాలపట్ల ఈ సంస్థ ఎంతో సానుకూలంగా స్పందిస్తుందని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రిక్స్‌లో చేరాలనుకునే కొత్త దేశాలకు ఆహ్వానం పలికారు. ఐదు వ్యవస్థాపక సభ్యదేశాలతోపాటు మరో తొమ్మిది దేశాలు కూడా కొత్తగా బ్రిక్స్‌లో చేరాయి. మరికొన్ని దేశాలను కూడా ఆహ్వానితులుగా ఈ సదస్సుకు పిలిచారు. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు అదనంగా బ్రిక్స్‌లో చేరాయి. ఈ నిర్ణయం బ్రిక్స్ అభివృద్ధి ప్రక్రియలో మకొ కొత్త పరిణామమని జిన్‌పింగ్ అన్నారు. ప్రపంచస్థాయి సంస్థలలో అభివృద్ధి చెందుతున్నదేశాల గళంగా ప్రాతినిధ్యం వహించేస్థాయికి బ్రిక్స్ విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ సంస్థలలో సంస్కరణలు తీసుకురావడంలో బ్రిక్స్ అగ్రశ్రేణి శక్తిగా ఉండాలని, గ్లోబల్ సౌత్‌కు సంఘీభావం, సహకారం అందించడంలో ఒక ప్రధాన వేదికగా బహుముఖ యంత్రాంగాన్ని నిర్మించుకోవాలని బ్రిక్స్ సభ్యదేశాలకు జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. యుద్ధభూమిని విస్తరించకూడదు, యుద్ధవ్యాప్తి జరగకూడదు, ఏ దేశమూ రెచ్చగొట్టే కవ్వించే చర్యలకు పాల్పడకూడదు అనే మూడు సూత్రాలను ప్రముఖంగా తీసుకుని ఉక్రేన్ యుద్ధ సంక్షోభాన్ని వీలైనంత త్వరలో నివారించేందుకు కలిసి పనిచేసేవిధంగా శాంతికోసం, ఉమ్మడి భద్రత సాధించేందుకు సభ్యదేశాలు 'బ్రిక్స్' సంస్థను తీర్చిదిద్దాలని జిన్‌పింగ్ కోరారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితులలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలో సంస్కరణలు తేవాల్సిన అత్యవసరం ఉందని ఆయన అన్నారు. బ్రిక్స్ తరపున ఒక కొత్త అభివృద్ధి బ్యాంకును (న్యూ డవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ బ్రిక్స్)పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఐదేళ్ళలో చైనా 10 దేశాలలో లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. 1000 మంది విద్యా పాలనాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు శిక్షణా అవకాశాలు చైనా కల్పిస్తుందన్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన అభివృద్ధికి, నవీన ఆవిష్కరణలకు మార్గదర్శక వేదికగా బ్రిక్స్ రూపుదాల్చాలని జిన్‌పింగ్ అన్నారు.

## 'పరిపక్వత– విజ్ఞత' చూపిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలను ముందుకు నడిపిస్తాయి'' అని మోదీ పేర్కొన్నారు.

**ఇక తదుపరి చర్చల ప్రక్రియ ప్రారంభం**

కాగా భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ మీడియాతో మాట్లాడుతూ, భారత్ – చైనా సరిహద్దు సమస్యపై చర్చల్లో పాల్గొనే ప్రత్యేక ప్రతినిధులు ఇద్దరూ సమస్య పరిష్కారంలో కీలక పాత్ర వహిస్తారన్నారు. ఇక తదుపరి చర్యల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. సరిహద్దులో శాంతి, సుస్థిరతల సాధనలో కూడా ఈ ఇద్దరు ప్రతినిధులే కీలకపాత్ర ధారులన్నారు. ఈ చర్చలను పునరుద్ధరించాలని, తమ కృషిని కొనసాగించాలనీ రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులకు మోదీ–జిన్‌పింగ్ ఆదేశాలు ఇచ్చారని మిస్త్రీ చెప్పారు. ఒక తేదీ చూసుకుని ఈ ప్రత్యేక ప్రతినిధుల మధ్య చర్చలు ప్రారంభమవుతాయన్నారు. వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో నాయకులు ఇద్దరూ ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించారని ఆయన చెప్పారు. రెండు దేశాలమధ్యా సుస్థిర సంబంధాలు ఉండాలన్న దృష్టితో నాయకులిద్దరూ ఆలోచించారన్నారు. ప్రాంతీయ సుస్థిరత, ప్రపంచ శాంతిపైన, ప్రగతిపైన ఈ చర్చలు సానుకూల ప్రభావం చూపించగలవన్నారు. 2020లో సరిహద్దుల్లో తలెత్తిన ఘర్షణ తర్వాత రెండు దేశాల సైన్యాలు హద్దులకు వెనక్కు జరగాలని, సమస్య పరిష్కరించుకోవాలని ఇటీవలికాలంలో జరిగిన ఒప్పందాన్ని ఆహ్వానిస్తున్నామని ఆయన అన్నారు.

## బోధనా రుసుం చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం పలు కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, వరంగల్‌లో నిర్వహించిన ధర్నాలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్, కరీంనగర్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి పాల్గొన్నారు. కాగా హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు కలెక్టరేట్‌లోకి దూసుకువెళ్లెందుకు యత్నించారు .దీంతో అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున చేరుకున్న పోలీసులు ఎఐఎస్ఎఫ్ నాయకులను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అంతకుముందు ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, ఓయూ అధ్యక్షులు లెనిన్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో గత మూడేళ్లుగా విద్యార్థులు, వారి తల్లిందండ్రులతో పాటు సకాలంలో జీతాలు రాక కళాశాలల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజుల కోసం చివరికి డిగ్రీ కళాశాల యాజమన్యాలు కాలేజీలను మూసి నిరసన తెలిపినా ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి చెల్లిస్తామన్న నాటి పిసిసి అధ్యక్షులు నేటి ముఖ్యమంత్రి ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఫీజులను మాత్రం విడుదల చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు టోకెన్ ఇచ్చినవే కాకుండా పెండింగ్ లో ఉన్న బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులను నిరసనను ప్రభుత్వం ఎదుర్కొక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు అరె కంటి భగత్, కాంపల్లి కళ్యాణ్, అశ్విన్, ఉదయ్ ,పవన్, జ్ఞానేశ్వర్, ప్రవీణ్, వినయ్ లు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ అనుభవం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రియాంక కంటే తనకు ఎక్కువగా అనుభవం ఉందని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ప్రియాంక స్పందించారు. కాగా, ప్రియాంక మాట్లాడుతున్న సమయంలో వేదికపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ప్రతిపక్షత నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కర్నాటక సిఎం సిద్ధరామయ్య, ఇతర పార్టీ సీనియర్ నేతలు ఆశీనులయ్యారు. ప్రియాంక మాట్లాడుతూ కొద్దినెలల క్రితం వయనాడ్‌లో కొండచరియలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందేనని, ఆ ప్రకృతి విపత్తులో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు ఇళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ''నా కళ్లతో ఆ వినాశనాన్ని చూశాను. కుటుంబాలను కోల్పోయిన పిల్లల్ని చూశాను. పిల్లల్ని కోల్పోయిన తల్లుల్ని కలిశాను. సర్వస్వం కోల్పోయిన కుటుంబాలతో మాట్లాడాను. ఇంత కష్టంలోనూ ఒకరికొకరు సహకరించుకోవడం నన్ను ఆశ్చర్యపర్చింది. ఇలాంటి వ్యక్తుల మధ్య నేను భాగం కావడం గొప్ప గౌరవం'' అని అన్నారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ప్రియాంక గెలిస్తే వయనాడ్ ప్రజల తరఫున పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించడానికి ఇద్దరు ఎంపిలు ఉంటారని అన్నారు. తాను వయనాడ్‌కు అనధికారిక ఎంపిని అని, తన సోదరి కుటుంబ కోసం అన్నింటినీ త్యాగం చేసి, ఇప్పుడు తన శక్తినంతా వయనాడ్ ప్రజల సమస్యలను చూసేందుకు వెచ్చిస్తుందని అన్నారు. మీ అందరిని ఒక కుటుంబలా భావిస్తోందని, మీరు కూడా అలానే చూసుకోవాలని నేను ఆశిస్తున్నానని అని రాహుల్ గాంధీ అన్నారు. అయితే వయనాడ్‌కు మాత్రమే ఇద్దరు ఎంపిలు ఉంటారని, ఒకరు అధికారికంగా కాగా, మరొకర అనధికారంగా ఉంటారన్నారు. ఈ ఇద్దరు కూడా లోక్‌సభ ప్రజా సమస్యలను లేవనెత్తుతారని ప్రియాంక విజయంపై ధీమా వ్యక్తం చేశారు. వయనాడ్‌కు అనధికారిక ఎంపి అయిన తాను ఇక్కడికి వచ్చి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలో జోక్యం చేసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఇదిలా ఉండగా, ర్యాలీలో మాట్లాడిన అనంతరం ప్రియాంకాగాంధీ కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆమె వెంట తల్లి సోనియాగాంధీ, ఖర్గే,
ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## ఫ్యాక్టరీతో మూసీనది కాలుష్యం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పడితే రామన్నపేట మండలంలోని మూగజీవాలకు గడ్డి దొరకదని చెప్పారు. అవసరమైతే మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే రామన్నపేట మండలం కకావికలమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించాలని చూస్తున్నారని ఆరోపించారు. నాడు కెసిఆర్ సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తుంటే అడ్డంపడిన కోదండరాం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపైన కోదండరాం, హరగోపాల్ ఎందుకు తమ గొంతు విప్పడం లేదని ప్రశ్నించారు.సిమెంట్ ఫ్యాక్టరీతో మూసీ నది కాలుష్యమవుతుందని, నల్లగొండకు మూసీ ద్వారా తాగునీరు ఇస్తామని చెప్పి,రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఎలా నిర్మిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. మోదీకి బిటీమ్‌గా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, తెలంగాణ రాష్ట్రంలో మోదీ,రేవంత్ మిలాఖత్ స్పష్టం అవుతోందని ఆరోపించారు. రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## వికాసం కాదు.. వినాశనం

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలోకి రావడానికి సిపిఐ పొత్తు ప్రధాన కారణమన్నారరు. హర్యానాలో కాంగ్రెస్ వైపు ఉన్నప్పటికీ మిత్ర పక్షాలను కలుపుకోకపోవడంతో ఓటమి చెందాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. బిజెపికి జనాల్లోకి రావడానికి మతం తప్ప మరో మార్గం లేదని, మతం మీద నిజంగా ప్రేమ ఉంటే హిందూ ముస్లిం గొడవపడితే హిందువులకు నష్టం జరగదని అన్నారు. ఇతర మత వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా శిక్షించాలని అన్నారు. హైదరబాద్ నగరం ప్రశాంతతకు మారుపేరు గత 30సంవత్సరాల క్రితం అల్లర్లు జరిగిఉండవచ్చు, నేడు అంతా ప్రశాంతంగా ఉందన్నారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని.రాజ్యాంగంలో ఎక్కడ జమిలి ఎన్నికల ప్రస్తావన లేదన్నారు. సిపిఐ పార్టీ జమిలి ఎన్నికలకు వ్యతిరేకం అని స్పష్టంచేసారు. హైదరాబాద్‌లోని హైడ్రా, మూసి నది పరివాహకం అంశంలో ప్రభుత్వ తీరు సరిగా లేదని అన్నారు. ముందుగా పేదలను గుర్తించి వారికి సరైన ఆవాసం ఏర్పాటు చేసిన తర్వాతనే ఖాళీ చేయించాలన్నారు. చాలామంది ఈ పరివాహకంలో స్థలాలు కొనుగోలు చేసి వచ్చారని, వారిని గుర్తించి ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుందన్నారు. జిఓ 58,59 ప్రకారం ఇండ్లు క్రమబద్ధీకరణ చేసి స్థలాలు కేటాయిస్తే సమస్య కొంత వరకు పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నాయకులు ఊట్కూరి రాములు, మంచాల తిరుపతి, రమాదేవి, ఆదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాదాన్ని పరిశీలించిన కూనంనేని**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రానికి వెళ్లే మూల వద్ద బుధవారం మట్టి లోడు టిప్పరు బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న పలువురు కిందపడగా గాయాలపాలయ్యారు. టిప్పర్ ప్రమాదాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు పరిశీలించారు. అతివేగం, ఓవర్‌లోడ్‌తో రవాణా చేస్తున్న మట్టి టిప్పర్లు కట్టడిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. ఎల్కతుర్తి, మెదక్ రామయంపేట వరకు జరుగుతున్న రోడ్డు పనులు జాప్యం లేకుండా చూడాలని అన్నారు.

## అంబుజా వద్దు

(మొదటి పేజీ తరువాయి)

మంజూరైందని పరిశ్రమ అతిసమీపంలోనే కోర్టుకు కేటాయించిన భూమి ఉందని త్వరలోనే కోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జెసి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వివిధ మండలాల నుంచి వచ్చే కక్షిదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అందుకు ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వకూడదని , అవసరమైతే హైకోర్టులో పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు.

**వేదిక ముందు అఖిలపక్షాల ధర్నా**

ప్రజాభిప్రాయ సేకరణ కంటే ముందు వేదిక వద్ద అఖిపక్ష నాయకులు, రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు, చేతబూని అంబుజా గోబ్యాక్ అంటు నినాదాలు చేశారు. దీంతో సభా ప్రాంగణమంతా మారుమోగడంతో గందరగోళంగా మారింది. నిరసన సభకు వివిధ గ్రామాల నుంచి స్వచ్ఛందంగా ట్రాక్టర్లపై మహిళలు, ద్విచక్ర వాహనాలపై యువకులు, రైతులు సుమారు 3వేల మంది హాజరయ్యారు. ఈ మేరకు జెసి బెన్‌షాలోమ్ ఆందోళనకారుల వద్దకు చేరుకొని ఈ సభలో ప్రజల అభిప్రాయం తీసుకుంటామని అందరి ఆమోదం మేరకే ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతి ఇస్తామని చెప్పడంతో నిరసనను నిలిపివేశారు. ప్రాంగణంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వారు మంచినీరు, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ మా పిల్లల భవిష్యత్తు నాశనం చేసి ఈ ఫ్యాక్టరీ కనీస నీరు కూడా తాగమని నిరసన తెలిపి వెనుదరిగారు.

**జెసి కాన్వాయ్‌ను అడ్డుకున్న ప్రజలు**

ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన ప్రజలంతా ముక్తకంఠంతో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని అభిప్రాయం తెలిపారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన జెసి తమ అభిప్రాయం ప్రకటించకుండా వేదిక నుంచి వెళ్తుండగా ప్రజలు జెసి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, చౌటుప్పల్ ఎసిపి మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ లాల్‌బహదూర్, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య, అఖిలపక్ష నాయకులు ఎండి.జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కల్లూరి మల్లేశం, జినుకల ప్రభాకర్, పూస బాలకిషన్, గంగుల రాజిరెడ్డి, నంద్యాల భిక్షంరెడ్డి, జల్లెల పెంటయ్య, ఊట్కూరి నరసింహ, ఎండి.రేహాన్, మారేపల్లి మల్లారెడ్డి, వనం చంద్రశేఖర్, గోదాసు శిరీష, గాదె శోభారాణి, గుత్తా నర్సిరెడ్డి, వేమవరపు సుధీర్‌బాబు, రాపోలు నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, కందుల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్



## గడ్డితో పైకప్పు

కళా రంగం

బ్రిటన్‌లో కొన్ని శతాబ్దాలపాటు ఇళ్లతోపాటు రంగస్థలాలు లేదా కళా ప్రదర్శ నశాలల పైకప్పు కోసం గడ్డి లేదా తుంగ వాడేవారు. అయితే, 1666, సెప్టెంబర్ 2న చోటు చేసుకున్న మహా అగ్నిప్రమాదం జరిగిన తర్వాత పైకప్పు లకు గడ్డి వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అప్పటి అగ్నిప్రమాదంలో లండన్ నగరం దాదాపు 85 శాతం పూర్తిగా లేదా పాక్షికంగా దగ్ధమైంది. మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది మూడు రోజులు అవిశ్రాం తంగా పోరాడాల్సి వచ్చింది. కనీసం 13000 ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. అంత కంటే 53 సంవత్సరాల పూర్వం, 1613లో కూడా లండన్ నగరంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ ఘటనలో ఒక వ్యక్తి మాత్రమే మృతి చెందాడని అధి కారిక రికార్డుల్లో నమోదైంది. ఆతర్వాత మరోసారి భారీ అగ్నిప్రమాదం జరగడం, లండన్ మొత్తం మంటల్లో చిక్కుకో వడంతో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదు. రూఫ్‌గా గడ్డి లేదా తుంగను వాడకూడదని అప్పుడే శాసనం చేశారు. అయితే, షేక్స్‌పియర్స్ గ్లోబ్ థియేటర్‌కు మాత్రం ఈ నిబంధన నుంచి మినహా యింపు లభించింది. సంప్రదాయ విధానంలో థియేటర్‌ను కొనసాగించాలన్న అభిప్రాయంతో, ఈ ఒక్క థియేటర్‌కు మాత్రమే గడ్డి రూఫ్‌ను అనుమతించారు. అయితే, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అనేక రకాలైన ముదు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# భిన్న నృత్యరీతుల సామ్రాజ్ఞి గిరిజ



సాధారణంగా ఎవరైనా నృత్యకళారులు ఒకటి లేదా రెండు నృత్య రీతులను అభ్యసిస్తారు. కానీ, అందరూ 'గిరిజా టీచర్', 'గిరిజా చెయి (సోదరి' అని పిలిచే గిరిజా చంద్రన్ భిన్న నృత్యరీతుల్లో ప్రావీణ్యం సంపాదించింది. కేరళకు చెందిన శివశంకర్ పిళ్లై, మాలతీ అమ్మాళ్ దంపతులకు 1951లో జన్మించిన గిరిజ, ఏడుగురు తోబుట్టువుల్లో ఒకరు. శివశంకర్ కన్యాకుమారిలోని ఒక మారుమూల గ్రామంలో, లైబ్రరీని ఏర్పాటు చేసి, విద్యాదానం చేసిన సంస్కృత పండితుడు. 1950 దశకంలో నాడార్లు, గౌండర్లు, తేవర్లు తదితరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల ప్రభావం శివశంకర్ కుటుంబంపై కూడా పడింది. ఫలితంగా ఆయన కుటుంబంతోసహా త్రివేంద్రం (తిరువనంతపురం) చేరుకున్నారు. గిరిజన అమ్మమ్మ సిపి భారత అమ్మాళ్ కూడా సంస్కృత పండితురాలే. ఆమె తాత త్రివేంద్రం కథాకళి క్లబ్ తొలి అధ్యక్షుడు. ఆయన పలు నాటకాలు రచించారు. దీనితో గిరిజకు చిన్నతనం నుంచే అటు సాహిత్యం, ఇటు కళలపట్ల అవగాహన ఏర్పడింది. తండ్రి ప్రోత్సహం కూడా జత కలవడంతో గిరిజ నృత్యాభ్యాసం పట్ల మొగ్గు చూపింది. నృత్యాన్ని ఆమె ఎన్నడూ కాలక్షేపంగా తీసుకోలేదు. అందులోనే జీవితాన్ని వెతుక్కుంది. నృత్య కళాకారిణిగా మారాలని, ఆ కళనే కెరీర్‌గా మార్చుకోవాని నిర్ణయించుకుంది. కేఅలలోని గురు కళాక్షేత్రంలో, తన సోదరితో కలిసి సంప్రదాయ నృత్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించింది. ఆమె సోదరి మూడు పర్యాయాలు విశ్వవిద్యాలయ ప్రదర్శనల్లో పాల్గొని, ప్రతిష్ఠాత్మకమైన 'కళాతిలకం' అవార్డును వరుసగా మూడు పర్యాయాలు గెల్చుకుంది. సోదరి స్ఫూర్తితో గిరిజ కూడా నాట్యంలో రాణించింది. కథాకళితోపాటు భరతనాట్యం కూడా నేర్చుకుంది. ఒకప్పుడు వెండితెరను ఏలిన నృత్యకళాకారిణిలు లలిత, రాగిణి, పద్మినికి శిక్షణనిచ్చిన ప్రముఖ కొరియోగ్రాఫర్ రామయ్య పిళ్లై వద్ద గిరిజ డాన్స్ నేర్చుకుంది. ఆయన కఠినమైన సంప్రదాయ నృత్యరీతులను మాత్రమే నేర్పేవారు. ఫలితంగా గిరిజ కూడా ఆయన వద్ద సంప్రదాయ నృత్యాన్నే నేర్చుకుంది. అనంతరం ఆమె కూచిపూడి నృత్యాన్ని కూడా నేర్చింది. కేరళలో అంతగా పరిచయం లేని విభిన్న నృత్య రీతులను ఆమె ప్రదర్శించడమేగాక, కళావేదికను నెలకొల్పి, ఎంతో మందికి శిక్షణనిస్తున్నది. వేర్వేరు నృత్య రీతుల్లో, వారివారి అభిరుచులకు తగినట్టు మెళకువలు నేర్పి, ఉత్తమ నృత్యగురువుగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించింది.



ఇటీవల, నిశాగంధి ఆడిటోరియంలో జరిగిన కళాక్షేత్ర 50వ వార్షికోత్సవానికి ఆమె వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు చాలా మంది హాజరయ్యారు. అంతర్జాతీయ వేదికలపై ఎన్నో ప్రదర్శనలిచ్చి, ప్రపంచ వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు ఆర్జించిన గోపికా వర్మ, నీనా ప్రసాద్, మెథిల్ దేవిక తదితరులు ఆమె వద్ద నాట్యంలో పాఠాలు నేర్చుకున్నవారే. ఎంతో మందికి మార్గదర్శకం చేస్తున్న గిరిజ కృషికి వేనవేల వందనాలు.

# పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- కంప్యూటర్‌లో CPU అంటే ఏమిటి?
  సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్
- భారతదేశంలో జాతీయ పక్షి ఏమిటి?
  నెమలి
- ఎలాటి గ్రహాన్ని ఎరుపు గ్రహం అని పిలుస్తారు?
  మార్స్
- ప్రముఖ శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ ఏ సూత్రాన్ని ప్రతిపాదించారు?
  ఆపేక్షా సిద్ధాంతం
- భూమి మీద ఆకుపచ్చ వర్ణం కలిగిన మొక్కలు ఏ పిగ్మెంట్ వల్ల వస్తుంది?
  క్లోరోఫిల్
- సూర్యుడి చుట్టూ భూమి చక్రం తిరిగే సమయం ఎంత?
  365 రోజులు
- పేరియాడిక్ టేబుల్‌ను ఎవరు రూపొందించారు?
  డిమిత్రి మెండలీవ్
- హిమాయిత్తంగా ద్రవంతో నిల్వ ఉండే లోహం ఏది?
  పారాదశం (మెర్క్యూరి)
- ప్రాణవాయువు (ఆక్సిజన్) విడుదల చేసే ప్రక్రియను ఏమంటారు?
  ప్రకాశసంశ్లేషణ
- మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?
  చర్మం
- విద్యుత్ ప్రవాహం లోపల సరఫరా అయ్యే కణాలు ఏవి?
  ఎలక్ట్రాన్లు
- ప్రకృతి వాయువుల మిశ్రమాన్ని వాడి వచ్చే శక్తి మూలం ఏది?
  సౌర శక్తి
- కంప్యూటర్ల తండ్రిగా ఎవరిని పిలుస్తారు?
  చార్లెస్ బాబేజ
- భారతదేశం యొక్క రాజధాని ఏది?
  న్యూఢిల్లీ
- ఏ గ్రహాన్ని ఎరుపు గ్రహం అని పిలుస్తారు?
  మార్స్
- ఎనిమిదో నెల ఏది?
  ఆగష్టు
- ఆపిల్‌ను కలిపిన ఘటనా కథతో ప్రముఖ శాస్త్రవేత్త ఎవరు?
  ఐజాక్ న్యూటన్
- ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?
  నైల్ నది
- చెరకు పంట నుండి తయారు చేసే తీపి పదార్థం ఏది?
  చక్కెర
- భారతదేశపు రాజధాని ఏమిటి?
  న్యూఢిల్లీ
- సూర్యుడు ఉదయించే దిశ ఏది?
  తూర్పు
- భారతదేశపు మొదటి ప్రధాని ఎవరు?
  జవహర్‌లాల్ నెహ్రూ
- ప్రపంచంలో అతి పొడవైన వంతెన ఏది?
  డ్యాన్యాంగ్–కున్షాన్ గ్రాండ్ వంతెన (చైనా)
- ఐఫిల్‌టవర్ ఏ దేశంలో ఉంది?
  ఫ్రాన్స్
- ఫ్రాన్స్ రాజధాని నగరం ఏది?
  పారిస్.

# బహుళ నృత్య సంప్రదాయాలు..



కేరళ రాష్ట్రంలో శతాబ్దాలుగా బహుళ నృత్య సంప్రదాయాలు విరాజిల్లుతున్నాయి. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ ఈ ప్రత్యేక కనిపించదు. కథాకళి, మోహినియాట్టం వంటి శాస్త్రీయ నృత్య రూపాల నుండి ఒట్టంతుల్లాల్ వంటి నాటక నృత్యాల వరకు, తెయ్యం వంటి జానపద సంప్రదాయాల వరకు, ఇవన్నీ ఒకే రాష్ట్రంలో అభివృద్ధి చెందాయి. ఒకవైపు మీరు మూజికుళం, ఇరింజల కుడలోని మారుమూల ప్రాంతాలలో వర్ధిల్లుతున్న కూడియాట్టం అనేవి ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన సంస్కృత నాటక సంప్రదాయంగా కొనసాగుతున్నాయి. అదే సమయంలో, ఆధునిక సమస్యలను పరిష్కరించే బలమైన రాజకీయ అజెండాలతో థియేటర్ సమూహాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఉద్భవించిన నృత్య రూపాలతో పాటు, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ నుండి వరుసగా భరతనాట్యం, కూచిపూడి వంటి ఇతర ప్రదర్శన కళలు సంవత్సరాలుగా ప్రజాదరణ పొందాయి. ఎన్నో నృత్య రీతులు అలరిస్తున్నప్పటికీ, అవన్నీ ఆయా ప్రాంతాలకే ఎక్కువగా పరిమితమయ్యేవి. సుమారు అర్థ శతాబ్ద క్రితం వరకూ కేరళ కళామండలం, కొన్ని ఇతర సంస్థలు మాత్రమే ఉండేవి. కానీ, క్రమంగా వివిధ నృత్య రీతులకు ఆదరణ పెరిగింది. నృత్యకళాకారుల సంఖ్య కూడా పెరిగిది. నృత్య సంస్థలు,నృత్య గురువురుల సంస్కృతి క్రమంగా వేళ్లూనుకుంది. గతంలో మాదిరి కాకుండా, ఇప్పుడు సంప్రదాయ కళలను ప్రోత్సహించడానికి కృషి జరుగుతోంది. అనాదరణ కారణంగా రాష్ట్రం విడిచిపెట్టి ఎంతోమంది కళాకారులు ఇరత ప్రంతాలకు వలస వెళ్లే పరిస్థితుల నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా కేరళను వెతుక్కుంటూ వచ్చే వాతావరణం ఏర్పడింది. ఇప్పుడు కేరళలో రకరకాల నృత్యరీతులు పరిఢవిల్లుతున్నాయి. అందుకు గిరిజా చంద్రన్ వంటి నాట్య గురువురువులు చేస్తున్న కృషి అభినందనీయం.

# తొలి రంగస్థల కళాకారుడు థెస్పిస్

'థియేటర్' అంటే ఇప్పటి పరిభాషలో సినిమా ప్రదర్శన శాలగా పేర్కొంటున్నారుగానీ, నిజానికి ఈ పదానికి 'రంగస్థలం' అని అర్థం. గ్రీకు భాషలో 'థియోమై' నుంచి ఈ పదం ఉద్భవించింది. థియోమై అంటే గ్రీకు భాషలో 'వీక్షించు' అనే అర్థం ఉంది. ప్రపంచంలో చారిత్రక ఆధారాలు ఉన్న లేదా చరిత్రలో నమోదైన మొట్టమొదటి థియేటర్ ఆర్టిస్టుగా ఇకార్డియాకు చెందిన థెస్పిస్ పేరును చరిత్రకారులు పేర్కొంటారు. క్రీస్తు పూర్వం 534, 535 ప్రాంతంలో అతను ఏథెన్స్‌లోని 'అగోరా' (మార్కెట్ స్థలం లేదా సంత'లో తొలి ప్రదర్శన ఇచ్చాడు. చక్కతో చేసిన బండిపై కూర్చొని అతను అందుబాటులో ఉన్న కథలను, గేయాలను రాగయుక్తంగా పాడి వినిపించాడు. పాత్రల మధ్య తేడా తెలియడానికి రకరకాల ముసుగులను ఉపయోగించేవాడు. గ్రీస్‌లోని చాలా ప్రాంతాల్లో పర్యటించి, ప్రదర్శనలు ఇచ్చినట్టు చెప్తారు. ఏథెన్స్‌లోని దయనోసియాలో అద్భుతమైన విషాదాంత రచనను ప్రదర్శించినప్పుడు అతనికి అధికారులు బహుమతి రూపంలో మేకను అందచేశారు. అతని ప్రదర్శన 'ట్రగోడియా' (మేక పాట)గా ప్రసిద్ధి చెందింది. ఆంగ్లంలో 'ట్రాజిడీ' (విషాదం) అనే పదానికి 'టగోడియా'నే మూలం. కాగా, అత్యంత పురాతనమైన థియేటర్స్‌లో 'ఒడియన్' ఒకటి. హెరోడియస్ అటికస్‌లోని ఈ థియేటర్ శిథిలాలు ఇప్పటికీ ఉన్నాయి.



థెస్పిస్ ఊహా శిల్పం



పురాతన 'ఒడియన్' థియేటర్

# కదంతొక్కిన విద్యార్థిలోకం

## ఫీజులు విడుదల చేయకుంటే చదువులు కొనసాగేదెలా?

## బకాయిలు, రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

## ఎఐఎస్‌ఎఫ్ కలెక్టరేట్ల ముట్టడి.. ఉద్రిక్తత



ఖమ్మం...



హనుమకొండ...

ప్రజాపక్షం/ఖమ్మం : విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన జరిపి కలెక్టరేట్ ముట్టడించారు. విద్యార్థులు కలెక్టరేట్‌లోనికి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నంచగా, పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ కనబరుస్తోందని విమర్శించారు. గత మూడేళ్లుగా బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుంటే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్, సహాయకార్యదర్శులు ఎస్‌కె నాగుల్ మీరా, మధు,శివ నాయక్, జిల్లా నాయకులు మనోజ్, రాజేష్, ప్రతాత్, గోపి, రోహిత్, గోపి,సాయి, నరేష్, అయ్యప్ప నరేష్, వెంకటేష్, ఉపేంధర్, రవి, గణేష్ పాల్గొన్నారు.

### రీయింబర్‌మెంట్స్ పథకానికి కాంగ్రెస్సే తూట్లు పొడుస్తోంది

**వరంగల్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లని, ఫీజు బకాయిల విడుదలపై అనాడు సిఎం రేవంత్‌రెడ్డి చెప్పింది ఏమిటని, నేడు చేస్తున్న జాప్యం ఏమిటని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఎ స్టాలిన్ ప్రశ్నించారు. బుధవారం ఎఐఎస్‌ఎఫ్ వరంగల్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో కలెక్టరేట్ నిర్వహించారు. ఏకశిలా పార్క్ నుంచి విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌లో వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించి ధర్నా చేశారు. కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తి విద్య కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు వివిధ ఎంట్రన్స్‌లలో ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలలో డబ్బులు చెల్లించి టిసి, ఇతర సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను ఆపేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థ సారథి, ల్యాదల్లా శరత్, నాయకులు అభిరామ్, రాకేష్, శ్రీధర్, శివకుమార్, సంతోష్, రాజు, ఖలీల్, ప్రభాస్, సోను పాల్గొన్నారు.

### విద్యార్థులతో సర్కారు చెలగాటం

**కరీంనగర్ :** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మిలిటెంట్ పోరాటాలు చేస్తామని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఈసందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం రావడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారం ఉంద న్న విషయం రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. ఫీజు బకాయిలను 27 లోపు విడుదల చేయకపోతే సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, కేశబోయిన రాము, కనకం సాగర్, లద్దునూరి విష్ణు, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, కౌశిక్, ఛత్రపతి, వినయ్, శ్రావణ్, ఈశ్వర్, రిషి తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీతో కదం తొక్కుతూ హన్మకొండ కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్‌గౌడ్, బోయిన సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం మైనారిటీ విద్యార్థుల పట్ల, విద్య రంగా అభివృద్ధి పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జక్కుల భాను ప్రసాద్, నాయకులు శ్రీపతి వినయ్, కుంటి వేణు, శ్రీనివాస్, సురేష్, ఎస్.మనోజ్, ఎం. సంపత్, వి.అఖిల్, యు.వినయ్, వి.నరేష్, పి.సాయి కాంత్, ఎం.గణేష్, సిహెచ్ సాయి చంద్, కె.చరణ్, పిబన్నీ, ఎస్.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి:** ఎఐఎస్‌ఎఫ్ యాదాద్రి జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో కలెక్టరేట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ యాదా ద్రి జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, సహాయకార్యదర్శి మారపాక లోకేష్, రాంపక చందు, సాయిచరణ్, ఉదయ్ కిరణ్ సుమన్, విల్సన్, రజిత, ప్రవళిక, సోనీ, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**నల్లగొండ :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాల నుండి విద్యార్థులు ర్యాలీతో నల్లగొండ కలెక్టరేట్ ముట్టడించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ శోభన్ నాయక్, జిల్లాకోశాధికారి గాదెపాక సూర్యతేజ, జిల్లా కార్యవర్గ సభ్యులు సురిగి వినయ్, ఇస్కిలా మహేందర్, చాపల విప్లవ్, ఎర్ర వినయ్, వట్టెపు శివకుమార్, కాంపల్లి భాను,రూపవత్ విష్ణు రామావత్ శ్రీకాంత్, ధనవత్ మనోజ్, లావుడి శ్రీధర్, బొమ్మకంటి శివప్రసాద్, బోగారి రవితేజ, అరుణ్, వీరేష్, శ్రీపాదం, దశరథ్, సిద్దు, మాధవి, అంజలి, అనూష, లక్ష్మి, ప్రియా, స్వాతి, రేష్మ, సోనియా, శ్రీజ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ముట్టడించారు. ఎఐఎస్‌ఎష్ రాష్ట్ర సహాయకార్యదర్శి సి.రాజు, జిల్లా అ ధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ లక్ష్మణ్, మధు, రాజేష్, నాగేంద్ర, చిన్న, యుగంధర్ వంశీ పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాగం లోకేష్, వెలుగు శ్రావణ్ డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముట్టడించారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాగం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్ :** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ ఎదుట కళాశాల విద్యార్థులతో ఎఐఎస్‌ఎఫ్ నాయకత్వంలో ధర్నా చేశారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఇంచార్జ్ రమేష్, అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

**మెదక్ :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ మెదక్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి దినాకర్‌తో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి ఎఐఎస్‌ఎఫ్ నేతలు, కార్యకర్తలు ఛలో కలెక్టరేట్‌కు తరలివెళ్ళారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, అరుణ్, వినోద్, వెంకటేష్, అకాష్ నాయక్, శివ, తేజ, నితీష్, శ్రావణి, లలిత, బాను, ఉపేందర్, బన్నీ, కార్తీక్, భాను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి...



వనపర్తి...



మెదక్...



మహబూబ్‌నగర్



హైదరాబాద్...



షాద్‌నగర్...



వరంగల్...



కరీంనగర్...



మహబూబాబాద్..



నల్లగొండ...

# ఒడిశాపై 'దానా' తుపాన్ పడగ!

**గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ బీభత్సం**

**14జిల్లాలకు చెందిన 10లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రభుత్వం**



**కోల్‌కతా:** దానా తుపాను ఒడిశా తీరంవైపు దూసుకొస్తున్న కారణంగా ఒడిశా రాష్ట్రంలోని దాదాపు సగం జనాభాకు ముప్పు పొంచి ఉంది. దీంతో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. 14 జిల్లాలలోని 10లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 'భారీ తరలింపు ప్రణాళికను' శరవేగంగా అమలు చేయడానికి కాలంతో పోటీపడుతోంది. తుపాను శుక్రవారం తెల్లవారు జామున భితర్కనిక నేషనల్ పార్క్‌ధమ్రా విమానాశ్రమానికి మధ్య సుమారు 70కి.మీ దూరంలో తొలిసారిగా తీరం చేరనున్నదని భారత వాతావరణశాఖ(ఐఎండి) బుధవారం తెలిపింది. ఈ తీరం చేరే ప్రక్రియ గురువారం రాత్రి నుంచి ప్రారంభమై శుక్రవారం ఉదయం వరకూ కొనసాగుతుందని ఐఎండి తెలియజేసింది. తుపాను గంటకు సుమారు120కి.మీ.ల గరిష్టవేగంతో సముద్రంలో ప్రయాణించి తొలిసారి తీరాన్ని తాకనుందని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మొహపాత్ర చెప్పారు. నిదానంగా జరిగే ఈ ప్రక్రియకు దాదాపు 5నుంచి 6గంటల సమయం పడుతుందన్నారు.గురువారం (అక్టోబరు24)రాత్రి నుంచి శుక్రవారం (అక్టోబరు 25) ఉదయం వరకు బలమైన గాలులు, భారీ వర్షాల నడుమ తుపాను ఉప్పెన తీరాన్ని తాకనుందని ఆయన తెలియజేశారు. తాజా ఐఎండి బులెటిన్ వెల్లడించిన ప్రకారం తుపాను వాయువ్య దిశగా 13కి.మీ.ల వేగంతో కదిలి ఒడిశాలోని ఆగ్నేయ పారాదీప్‌లో 490కి.మీ.ల వద్ద, ఒడిశా రాష్ట్రం ధమ్రాలోని దక్షిణ ఆగ్నేయం వద్ద 520కి.మీ, పశ్చిమబెంగాల్‌లోని దక్షిణఆగ్నేయం సాగర్ దీవి వద్ద కేంద్రీకృతం అవుతుందన్నారు. కేంద్రపారలోని లోతట్టు ప్రాంతాలు, భద్రక్, బాలాసోర్ జిల్లాలలోని లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే అవకాశం ఉన్నందున ఈ ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిఫారసు చేయడం జరిగిందన్నారు. కాగా, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్), ఒడిశా డిజాస్టర్‌ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఒడిఆర్ఎఎఫ్), అగ్నిమాపక సర్వీసుల నుంచి 288 రెస్క్యూ బృందాలను ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేశారు. ఎన్‌డిఆర్ఎఫ్ నుంచి అదనంగా సిబ్బందిని రప్పించాలని ప్రభుత్వం కోరింది. 14జిల్లాలకు తుపాను ముప్పు ఉందని ప్రభుత్వం గుర్తించింది. తీర ప్రాంతాలకు భారీ గాలులతో కూడిన తీవ్రస్థాయిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. అంగుల్, పూరీ, నయాగరా, ఖోర్దా, కటక్,జగత్సింగ్‌పూర్, కేంద్రపారా,జాజ్‌పూర్,భద్రక్, బాలాసోర్, కియోంఝార్, ధెన్కనల్, గంజామ్ జిల్లాలలో కూడా తీవ్రస్థాయిలో భారీవర్షాలతో కూడిన తుపాను ప్భావం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసి ఆ దిశగా చర్యలు చేపడుతోంది. 14జిల్లాల వ్యాప్తంగా తుపాన్ ప్రభావం తీవ్రస్థాయిలో ఉండి హానికలిగించే ప్రదేశాలు(గ్రామాలు) 3,000వరకు ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది.

దానా తుపాను తీరాన్ని తాకనున్న సందర్భంగా దాదాపు 10లక్షల 60వేల 336 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను ప్రారంభించిందని రాష్ట్ర రెవెన్యూ, ప్రకృతి విపత్తుల మేనేజ్‌మెంట్ మంత్రి సురేశ్ పూజారి చెప్పారు. దాదాపు 6,000 రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేసి ముంపు ప్రభావిత ప్రజలను అందులోకి తరలించి వారికి ఆహారం, పిల్లలకు పాలు, వైద్యపరమైన సదుపాయం, సురక్షిత మంచినీటి సౌకర్యం, మహిళలకు రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు.

# వక్ఫ్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్, ప్రతిపక్షాల మధ్య ఆరోపణల యుద్ధం

**సమావేశం వివరాలను మీడియాకు వెల్లడించడం 'దురదృష్టకరమని' డిఎంకె, ఆప్ సభ్యుల ఆక్షేపణ**

**హింసపై మాట్లాడితే తప్పేముందని చైర్మన్ జగదాంబికాపాల్ సమాధానం**



**న్యూఢిల్లీ:** వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికాపాల్, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ గ్లాస్‌బాటిల్‌ను పగులగొట్టి, తనవైపునకు విసిరేసిన సంఘటనను జగదాంబికా పాల్ బహిరంగంగా ప్రజలకు వెల్లడించడం పార్లమెంటరీ కమిటీ నిబంధనలను అతిక్రమించడమేనని ప్రతిపక్ష పార్టీలైన ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సభ్యులు మంగళవారం ఆరోపించడదాన్ని వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కొట్టిపారేశారు. తాను కమిటీ ప్రొసీడింగ్స్‌ను ప్రజలకు బహిర్గతం చేయలేదని, సమావేశంలో టిఎంసి సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ హింసకు పాల్పడిన సంఘటనపై మాత్రమే ప్రజలకు తెలియజేశానని ప్రతిపక్ష పార్టీలకు సమాధానం ఇచ్చారు. కళ్యాణ్ బెనర్జీ మంగళవారం నాటి కమిటీ సమావేశంలో హింసకు పాల్పడ్డాడని చైర్మన్ జగదాంబికాపాల్ మీడియాతో మాట్లాడటం 'దురదృష్టకరం' అని డిఎంకె సభ్యుడు ఎ.రాజా, ఆప్ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. పార్లమెంటరీ కమిటీ చైర్మన్, అనుభవజ్ఞుడైన బిజెపి సభ్యుడు కూడా అయిన జగదాంబికాపాల్ కమి టీ సమావేశాలను చాలా హడావుడిగా నిర్వహించడం శోచనీయమని రాజా ఆరోపించారు.'సందేహాలను లేవనెత్తుతుంటే న్యాయానికి సేవ చేయడం సాధ్యం కాదనేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం' అని ఆయన అన్నారు. డిఎంకె ఎంపి ఎ.రాజా సామాజిక మాధ్యమం 'ఎక్స్'పోస్ట్‌లో మాట్లాడుతూ సమావేశం లో జరిగిన అంశాలను ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ ద్వారా మీడియాకు వెల్లడించడం దురదృష్టకరం అ న్నారు. సమావేశ ప్రొసీడింగ్స్‌ను కాన్ఫిడెన్షియల్‌గా ఉంచకుండా బయటకు వెల్లడించడం ఆక్షేపణీయం అని రాజా వక్ఫ్ (సవరణ)బిల్లు పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్‌ను ఉద్దేశించి ఆరోపణాస్త్రాలు సంధించారు. దీనిపై స్పందించిన జగదాంబికాపాల్ 'పిటిఐ'తో మాట్లాడుతూ 'నేను కమిటీ స మావేశంలో జరిగిన చర్చలను, ప్రొసీడింగ్స్‌ను ఏమీ వెల్లడించలేదు. కమిటీ సభ్యుడు సమావేశం జరుగుతున్న సమయంలో హింసకు పాల్పడిన సంఘటన గురించి మాత్రమే మీడియాకు వెల్లడించాను' అని ప్రతిపక్షాల ఆరోపణలను పాల్ తిప్పికొట్టారు. తాను ఎప్పుడూ పార్లమెంటరీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండేవాడినే అని, సభ గౌరవమర్యాదలకు అత్యంత విలువ ఇచ్చేవాడిని అని వక్ఫ్ (అమెండ్‌మెంట్) బిల్లు పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా ఉన్నటువంటి బిజెపి ఎంపి జగదాంబికా పాల్ ప్రతిపక్షాల ఆరోపణలకు సమాధానం ఇచ్చారు.

# జెఎంఎం అభ్యర్థుల జాబితా విడుదల



**రాంచి :** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) బుధవారం పోటీ చేసే అభ్యర్థుల ఒకటి, రెండవ జాబితాను విడుదల చేసింది. రాజ్యసభ ఎంపి మహువా మాఝీ రాంచి నుంచి బరిలోకి దిగనున్నారు. మాఝీ 2022లో రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకు ముందు జార్ఖండ్ మహిళా కమిషన్ చైర్మన్‌గా సేవలందించారు. జెఎంఎం మహిళా విభాగానికి అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. 2014, 2019లో కూడా రాంచి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. కాగా, జెఎంఎం తొలి జాబితాలో 35 మంది అభ్యర్థులను ప్రకటించింది. బర్‌హైత్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ , ఆయన భార్య కల్పనా సోరెన్ గాండేయ్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. జార్ఖండ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 13, నవంబర్ 20 తేదీల్లో రెండు విడతలుగా జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

### రూ. 72 లక్షల నగదు పట్టివేత

ఎన్నికల సందర్భంగా వాహన తనిఖీల్లో భాగంగా ధన్‌బాద్ జిల్లాలో ఓ కారును తనిఖీ చేస్తుండగా రూ. 71.97 లక్షల నగదు జార్ఖండ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహుదా పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ధనబాద్ – బొకారో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నగదు పట్టుబడినట్లు ధన్‌బాద్ డిప్యూటీ కమిషనర్ మాధ్వి మిశ్రా తెలిపారు. బొకారో జిల్లా నుంచి వస్తున్న కారులో నగదు లభ్యమైందన్నారు. నగదుకు సంబంధి పత్రాలను ఆదాయపు పన్నుశాఖ బృందం పరిశీలిస్తుందన్నారు. మరొక చోట కూడా ఓ బైక్ నుంచి రూ. 1.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

# ఎన్‌సిపి అభ్యర్థుల తొలి జాబితా విడుదల



**ముంబయి :** త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్న నేపథ్యంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) 38 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది. పార్టీ అధినేత అజిత్ పవార్ అతడి కుటుంబానికి కంచుకోట అయిన బారామతి స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రకటించింది. బిజెపి, శివసేన ఎన్‌సిపిలతో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తోంది. కాగా శివసేన పార్టీ 45 మంది అభ్యర్థులతో మంగళవారం తొలి జాబితాను విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కోప్రిపచ్‌పఖాడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నట్లుగా పేర్కొంది. అయితే ప్రతిపక్ష 'మహావికాస్ అఘాడీ' కూటమిలో సీట్ల పంపకంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది. అయితే శివసేన, ఎన్‌సిపి చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్‌సిపి ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# భార్యపై భర్త అత్యాచారం చేయొచ్చా?

**సుప్రీం తుది విచారణ వచ్చేనెల 10వ తేదీకి వాయిదా**

**న్యూఢిల్లీ :** మైనార్టీ దాటిన భార్యపై భర్త అత్యాచారం చేయడాన్ని నేరంగా పరిగణించకుండా భర్తలకు చట్టపరమైన రక్షణ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్‌పై సుప్రీంకోర్టు తిరిగి నవంబరు 10వ తేదీన విచారణ చేస్తుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ కేసును వచ్చేనెలకు వాయిదా వేసింది. వివాహం జరిగినంతమాత్రాన భాగస్వామి లైంగిక సమ్మతి అవసరం లేదని ఈ బంధం చెప్పకపోయినప్పటికీ, భార్యపై భర్త అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలా? వద్దా? అనే విషయాన్ని వివిధ కోణాలలో క్షుణ్ణంగా పరిశీలించి విశ్లేషించవలసిన అవసరం ఉందన్నదే కేంద్ర ప్రభుత్వం వైఖరి అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ఒకవేళ నిజంగా దీనిని నేరంగా పరిగణిస్తే భార్యాభర్తలమధ్య రోజువారీ సంబంధాలలో, వివాహ వ్యవస్థలో చాలా తీవ్రమైన పరిణామాలు, ఒడిదొడుకులు సంభవిస్తాయని కేంద్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. దేశంలో లక్షలాదిమంది స్త్రీలతో ఈ కేసు ముడిపడి ఉన్నందువల్ల ఈ కేసు చాలా అత్యవసరంగా విచారణ జరగాల్సి ఉందని ఒక కక్ష్యిదారు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కరుణా నందీ అన్నారు. ఈ కేసులో వాదనలకు హాజరైన న్యాయవాదులు తాము వ్యక్తిగతంగా ఎవరికి వారు వాదించడానికి వీలుగా తగిన సమయం ఇవ్వాలని కోరడంతో ధర్మాసనం అందుకు సమ్మతించింది. ఈ కేసుపై ఈనెల 17వ తేదీన తుది విచారణ ప్రారంభమైంది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరపున తుషార్ మెహతా ధర్మాసనం ఎదుట వాదనలు హాజరవుతుండగా, మహారాష్ట్ర తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ, ఒక మహిళ తరపున న్యాయవాది ఇందిరా జైసింగ్ కూడా వాదనలకు హాజరవుతున్నారు. వీరందరూ తమ తమ వాదనలు వినిపించడానికి ఒకొక్కరోజు సమయం పడుతుంది. ఈ కేసు ఎంతో సున్నితమైనందువల్ల సవివరంగా దీనిపై వాదనలు జరగాల్సిన అవసరం ఉందని ఒక కక్ష్యిదారు తరపున కేసుకు హాజరైన సీనియర్ అడ్వకేట్ గోపాల్ శంకరనారాయణన్ ధర్మాసనాన్ని కోరారు. నవంబరు 10వ తేదీన తాను ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేస్తున్నందువల్ల ఈ వారంలో గనుక వాదనలు పూర్తికాకపోతే ఈ కేసు పరిష్కారం కష్టసాధ్యమై చాలా జాప్యం జరుగుతుందని కూడా న్యాయవాదులకు జస్టిస్ చంద్రచూడ్ ముందే సమాచారం తెలియజేశారు. ఈ కేసులో వాదనలను బలవంతంగా ముగింపజేయడం సాధ్యంకాదు గనుక తన తర్వాత భవిష్యత్‌లో కూడా ఈ కేసు విచారణ కొనసాగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో తాను విచారపడుతున్నానని ఈ సందర్భంగా న్యాయవాది శంకరనారాయణన్ అన్నారు. సుప్రీంకోర్టుకు ఈనెల 26 నుండి దీపావళి సెలవులు ప్రారంభమవుతాయి. తిరిగి నవంబరు నాలుగో తేదీన సుప్రీం కోర్టు పనిచేయడం ప్రారంభిస్తుంది.

## కేరళలో ఉద్యోగులు, పెన్షనర్లకు డిఎ, డిఆర్ పెంపు

**తిరువనతంపురం :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, టీచర్లకు కేరళ ప్ర భుత్వం శుభవార్త అంది ంచింది. డిఎ ఒక వాయిదాను విడుదల చేస్తామ ని వామ పక్ష సర్కార్ పే ర్కొంది. దీంతో రాష్ట్ర వా ర్షిక వ్యయం దాదాపు రూ. 2 వేల కోట్లు పెరగనుంది. అదే విధంగా పె న్ష నర్లకు కూడా ఒక డి ఆర్ వాయిదాను మంజూరు చేస్తున్నట్ల రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి కెఎన్ బాలగోపాల్ ప్రకటించారు. డిఎం, డిఆర్ పెంపు వల్ల యుజిసి, ఎఐసిటిఇ, మెడికల్ సర్వీసులు సహా అన్ని రంగాల వారికి లబ్ధి చేకూరుకుందని మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు.ఇప్పటికే ఏప్రిల్‌లోనే డిఎ,డిఆర్ఒక వాయిదాను మంజూరు చేశారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు ఏడాదికి రెండుసార్లు డిఎ, డిఆర్ సమకూర్చాలని ఆర్థిక ఏడాది ప్రారంభంలోనే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ శాసనసభలో ప్రకటించారు. కొవిడ్ సమయంలో అనేక ఆర్థికపరమైన సవాళ్లు ఎదురైనప్పటికీ కేరళలో మెరుగైన వేతన సవరణ చేశామని మంత్రి బాలగోపాల్ చెప్పారు.

# జమ్ము ఎన్నికల్లో ఓటమిపై కాంగ్రెస్ కీలక సమావేశం 'షురూ'

**26స్థానాలలో అభ్యర్థుల ఓటమి వెనక కారణాలపై సమీక్ష**

**త్వరలోనే అధిష్టానానికి సమగ్రనివేదికను అందజేయనున్నట్లు పార్టీ అధికార ప్రతినిధి వెల్లడి**

**గురువారం సమావేశంలో సుదీర్ఘ చర్చ**

**జమ్ము :** జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పరాజయంపై జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ కమిటీ (జెకెసిసి) క్రమశిక్షణ సంఘం ఒక కీలక సమావేశాన్ని నిర్వహించింది. బుధవారం నిర్వహించిన ఈ సమావేశం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందుగానే కాంగ్రెస్‌పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)తో కూటమిగా ఏర్పడింది. 51స్థానాలలో ఎన్‌సి పో టీ చేసింది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ 32మంది అభ్యర్థులను బరిలోకి దింపింది. జమ్ము రీజియన్ అసెంబ్లీ స్థానాల నుంచే కాం గ్రెస్ పార్టీ ఎక్కువ మందిని బరిలోకి దించింది. కాగా ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ ఆరు అసెంబ్లీ స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. పొత్తులో భాగంగా ఎన్‌సితో సర్దుబాటు చేసుకున్న మిగతా 26 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓటమి చవిచూశారు. అయితే జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కారణాలను అన్వేషించేందుకు జెకెసిసి క్రమశిక్షణ సంఘం బుధవారం నాడు ఒక కీలక సమావేశం నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక అధికార ప్రతినిధి వెల్లడించిన సమాచారం ప్రకారం...మాజీ మంత్రి ముల రామ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశం పార్టీలో అక్కడి నాయకుల మధ్య అంతర్గత విభేదాలు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పరాజయానికి కారణాలయ్యాయా? అనే విషయమై లోతుగా చ ర్చించింది. ఎన్నికలలో పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన ఒక సమగ్ర నివేదికను రూపొందించి కాంగ్రెస్‌పార్టీ అధిష్టానానికి త్వరలోనే అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెప్పారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ పరాజయానికి ఎదురైన ముఖ్య కారణాలపై ఫీడ్‌బ్యాక్‌తో ఒక సమగ్ర నివేదికను రూపొందించి కాంగ్రెస్ అధిష్టానానికి అతి త్వరలోనే అందజేస్తామని, ఈ సవాళ్లను ఏ విధంగా అధిగమించాలన్న విషయమై కూడా నివేదికలో తెలియజేస్తామని ఆయన తెలిపారు. అ యితే గురువారం కూడా సమావేశం జరుగనున్నదని, చర్చల అనంతరం కమిటీ ఒక సమగ్ర నివేదికను త యారు చేసి పార్టీ అధ్యక్షుడికి అందజేస్తామని ఆయన చెప్పారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ ఆ దిశగానే ముందుకు వెళ్తుందని కమిటీకి చెందిన మరొక సభ్యుడు తెలియజేశారు. ఈ ప్రక్రియ పార్టీలో ఎదురయ్యే సవాళ్ల అధిగమించేందుకు తోడ్పడుతుందని, తదనుగుణంగా కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలను రూపొందించుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు త్రిలోక్ సింగ్, బజ్వా, ఠాకూర్ బల్బీర్ సింగ్, సురేందర్ సింగ్ చాన్ని, షానవాజ్ చౌదరి, ఫియాజ్ అహ్మద్ మీర్, డాక్టర్ ఆదిల్ ఫరూఖ్ మీర్ (లాస్జన్) తదితరులు పాల్గొన్నారు.

## భవనం కూలిన ఘటనలో ఏడుకు చేరిన మృతులు



**బెంగళూరు :** కర్ణాటకలో బెంగళూరులో నిర్మాణం లో ఉన్న భ వనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు పెరిగింది. సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బ ంది మరో ఆరు మృతదేహాలను వె లికితీసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు గాయ పడ్డారని పోలీసులు తెలిపా రు. శిథిలాల కింద చిక్కుకున్న వారి జాడ కోసం డాగ్ స్క్వాడ్‌ను రం గంలోకి దించినట్లు చెప్పారు. బెంగళూరులోని పలు ప్రాంతాల్లో సోమవా రం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామువరకు అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వానల ధాటికి బాబూసాపాళ్య ప్రాంతంలో ని ర్మాణ దశలో ఉన్న ఆరు అంతస్తుల భవనం మంగళవారం సాయంత్రం కూలిపోయింది. ప్రమాద సమయంలో 20 మందికి పైగా కార్మికులు అందులో ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలతో రంగం లోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఒక కార్మికుడు మరణించగా, అతని మృతదేహాన్ని సహాయ బృందాలు వెలికి తీశాయి. బుధవారం ఉదయానికి మరో ఆరు మృతదేహాలను వెలికి తీసినట్లు తూర్పు బెంగళూరు డిసిపి దేవరాజ తెలిపారు. ఇప్పటివరకు 13 మందిని రక్షించినట్లు పేర్కొన్నారు.

## 25న ఓయులో జాబ్-మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ నెల 25న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా జరగనుంది. కంపెనీలోని 30 లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ, మాస్టర్స్ పూర్తి చేసిన 29 నుండి 45 సంవత్సరాల వయసు గల మహిళలకు మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద హాజరు కావాలని తెలిపింది. మరిన్ని వివరాలకు ఎంప్లాయిమెంట్ అధికారి జోషిని (మోబైల్ :8340037123) సంప్రదించాలని కోరారు.

## మృతుల కుటుంబాలకు చాడ వెంకటరెడ్డి పరామర్శ

**ప్రజాపక్షంప్రతినిధి/హుస్నాబాద్:** ఇటీవల వివిధ కారణల వల్ల చనిపోయిన సిపిఐ నాయకుల కుటుంబాలను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి పరామర్శించారు. హుస్నాబాద్ మండల మహ్మదాపూర్ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు, సిద్దిపేట జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు పిట్టల రాములు గుండె పోటుతో చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి రాములు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు సిపిఐ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసిచ్చారు. అదే విధంగా మారుపాక పెద్ద కనకయ్య కుటుంబ సభ్యులను కలిసి తమ చిత్ర పటానికి పూల మాల వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చాడ వెంట సిపిఐ నాయకులు గడిపె మల్లేశ్, సంజీవరెడ్డి, పిట్టల బాలయ్య, మాజీ ఎంపిటిసీ పిట్టల సుధాకర్, మాజీ సర్పంచు కనకలక్ష్మి , బొయిని అశోక్, చాడ శ్రీధర్ , గూడె లక్ష్మి , ఎల్లయ్య, మొగిలయ్య పాల్గొన్నారు.

## శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు

**ఎపి కేబినెట్ కీలక నిర్ణయాలు**

**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఎపి మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జిఎస్‌టి ఛార్జీల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సిఎం చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలనిమంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సిఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రా హ్మణులకు చోటు కల్పించేందుకు, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు కేబినెట్ ఆమోదంతెలిపింది.విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందినశారదాపీఠానికి జగన్‌ప్రభుత్వంఅప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాల నే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వైసిపి ప్రభుత్వ హ యాంలో అప్పటి సిఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వ రూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవ లస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూ మిని ఎకరంరూ.లక్ష చొప్పున ఇచ్చేశారు. గత ప్రభుత్వ హ యాం లో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీ యే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయిం పును రద్దు చేయాలని నిర్ణయించింది. సవరణలు చేసి చట్టాన్ని బలహీనం చేశారు

# పాక్‌తో సయోధ్యే పరిష్కారం..ముఫ్తీ



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం, రక్తపాతంపై పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిడిపి) చీఫ్ మెహబూబా ముఫ్తీ పాత పల్లవే అందుకున్నారు. ఉగ్రవాదం, రక్తపాతానికి తెరపడాలంటే భారత్, పాక్ మధ్య సయోధ్య ఒక్కటే ఏకైక మార్గమని అన్నారు. అక్టోబర్ 20న గందేర్‌బల్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ షానవాజ్ దర్ నివాసానికి మెహబూబా ముఫ్తీ బుధవారంనాడు వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఇరుదేశాల శత్రుత్వం మధ్య జమ్ముకశ్మీర్ ప్రజలు చిక్కుకుపోయారని అన్నారు. ''రెండు దేశాల శత్రుత్వం మధ్య జమ్మూకశ్మీర్ ప్రజలు చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. వారి ప్రాణాలు, ఆస్తులు, ప్రతీదీ కోల్పోతూ బాధితులుగా మారుతున్నారు. మన పేద కార్మికులు సైతం బాధితులవుతున్నారు. డాక్టర్ షానవాజ్ కూడా ఈ తరహా బాధితుడే'' అని మెహబూబా ముఫ్తీ అన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి చేసినట్టుగానే ఇరుదేశాలు (భారత్–పాక్) కలిసి కూర్చుని సయోధ్య సాధించడం ఒక్కటే మార్గమని, అలాకాకుంటే ఇలాంటి దాడులు కొనసాగుతూనే ఉంటాయని మాజీ సిఎం అన్నారు. రెండు దేశాల మధ్య యుద్ధం కొనసాగినంత కాలం జమ్ముకశ్మీర్ ప్రజలు బాధితులుగానే మిగిలిపోతారన్నారు. ముఫ్తీ మాత్రమే కాదు...జమ్ముకశ్మీర్‌లోని ప్రతి ఒక్కరూ ఈ యుద్ధానికి తెరపడాలని కోరుకుంటున్నారని అన్నారు. రెండు దేశాలు మాట్లాడుకుని జమ్మూకశ్మీర్‌ను రక్తపాతం చెర నుంచి విడిపించాలని సూచించారు. దీనికి ముందు, డాక్టర్ షానవాజ్ దర్ కుటుంబ సభ్యులను జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సైతం పరామర్శించారు. గందేర్‌బల్‌లోని టన్నెల్ నిర్మాణ కార్మికులపై గత ఆదివారం నాడు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో నలుగురు, డాక్టర్ షానవాజ్ తీవ్రమైన గాయాలతో చికిత్సపొందుతూ మరణించారు.

## సవరణలు చేసి చట్టాన్ని బలహీనం చేశారు : కేంద్రంపై సుప్రీం అసహనం



**న్యూఢిల్లీ:** శీతాకాలం సమీపిస్తుంటే చాలు.. ఉత్తర భారతం మరీ ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత దిగజారుతుంది. ఎప్పటిలాగే దీనిపై చర్చలు, విమర్శలు జరుగుతుంటాయి. తర్వాత దీని గురించి అంతా మర్చిపోతుంటారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో కేంద్రాన్ని ఉద్దేశించి సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. 'పంట వ్య ర్థాలు తగలబెట్టడం' సమస్యపై కఠిన చట్టాలు రూపొందించకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. సవరణలతో పర్యావరణ చట్టాలను ఎలాంటి ప్రభావం చూపనివాటిగా మార్చారంటూ వ్యాఖ్యానించింది. అలాగే వ్యర్థాలను తగలబెట్టేవారిపై కఠిన చర్యలకు సంబంధించి కొత్త నిబంధనలను 10 రోజుల్లో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇటీవల గాలి కాలుష్యాన్ని అరికట్టడంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ విఫలం కావడంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. ''పంట వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కనీసం ఒక్క కమిటీ కూడా వేయలేదు. ఏటా ఈ సమస్యను చూస్తుంటే సీఏక్యూఎం చట్టం అమలుకావడం లేదని తెలుస్తోంది. కమిటీలు ఏర్పాటుచేశారా? చట్ట ప్రకారం ఏం చర్యలు తీసుకున్నారో కనీసం ఒక్కటైనా చూపించండి. ఢిల్లీ ఎన్‌సీఆర్ రాష్ట్రాలకు గతంలో చెప్పినవన్నీ గాల్లో మాటలుగానే మిగిలినట్లు కనిపిస్తోంది'' అని సీఏక్యూఎంను సుప్రీం ధర్మాసనం నిలదీసింది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
గురువారం, అక్టోబరు 24

# చీనీ–ఇండి : చిరు ఆరంభం

ఆసియాలోనే కాదు, ప్రపంచంలోనే అతి పెద్ద దేశాలైన భారత్–చైనాల మధ్య వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసి) వెంట డెమ్‌చోక్–డెస్పాంగ్ రీజియన్‌లో గస్తీ సందర్భంలో ఇరుదేశాల సైనికుల ఘర్షణ తో నాలుగేళ్ల క్రితం స్తంభించిన ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు చిన్న ఆరంభం జరగటం ఈ ప్రాంతంలో శాంతి–సుస్థిరలను కాంక్షించే ఎవరైనా హర్షిస్తారు, ఆహ్వానిస్తారు. రష్యా–ఉక్రేన్ యుద్ధంతో, గాజాపై ఇజ్రాయిల్ విధ్వంసక బాంబుదాడులతో పశ్చిమాసియాపై యుద్ధ మేఘాల తో ఉద్రిక్తపూరితమవుతున్న అంతర్జాతీయ వైమనస్య పరిస్థితుల్లో భారత్–చైనా మధ్య సయోధ్యకు విశేష ప్రాముఖ్యత ఉంది. భారత్–చైనా సరిహద్దు వివాదం 1962 లో యుద్ధానికి సైతం దారితీయటం గుర్తు చేసుకోదగింది. బ్రిటిష్ వలస పాలకులు నాలుగువేల మైళ్ల కుపైగా ఉన్న సరిహద్దు ను అధికారికంగా ఖరారు చేయకుండా 1947లో మనదేశం నుండి వెళ్లిపోయారు. చైనాలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో 1948లో విప్లవం విజయవంతమై చైనా ప్రజారిపబ్లిక్ అవతరించింది. చీనీ–ఇండి నినాదాలతో రెండు నవ స్వతంత్ర రాజ్యాల మధ్య స్నేహం వెల్లివిరిసినా సరిహద్దు వివాదం పరిష్కారానికి ప్రయత్నం జరగలేదు. వాస్తవాధీన రేఖను మాత్రమే గౌరవి స్తూ వచ్చారు. అయితే ఈ రేఖ పట్ల ఎవరి అంచనాలు, అధీనాలు వారివి. ఇదే మైత్రి భగ్నమై యుద్ధానికి హేతువైంది. అప్పుడు ఘనీభవించిన సంబంధాలు 26సంవత్సరాల అనంతరం 1989 జనవరిలో నాటి భారత ప్రధాని రాజీవ్‌గాంధి చైనా సందర్శనతో, చైనా నవ సైద్ధాంతిక సారథి డెంగ్ సియావో పింగ్‌తో చర్చలతో పునఃప్రారంభమైనాయి. సరిహద్దు వివాదం పరిష్కారానికై సంయుక్త కార్యాచరణ బృందం ఏర్పరిచారు. ఆ తర్వాత ప్రభుత్వాల మధ్య సంబంధాలు వృద్ధిచెంది ప్రతి ఏటా ఇరుదేశాల నేతల పరస్పర పర్యటనలు మొదలై వాణిజ్య, సాంస్కృతిక ఆదాన ప్రదానాలు కొత్త సౌభ్రాత్వ ఏర్పరిచాయి. టిబెట్ సమస్యపట్ల అపోహలు, అపార్థాలు, పాకిస్థాన్‌తో చైనా సంబంధాలు భారత్‌కు చికాకుగా మారటం, అరుణాచల్ ప్రదేశ్‌పై క్లెయిములు తదితర కారణాలతో ఇరుపక్షాల్లో రాజకీయ సంకల్పం, చొరవ లుప్తమైంది. ఉభయ దేశాల సంబంధాలు నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించిన చందనమైనాయి. సరిహద్దు వివాదం పరిష్కార ప్రయత్నం అటకెక్కింది.

చైనాలో క్సి జిన్‌పింగ్ నాయకత్వంలోకి రావటం, భారత్‌లో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి భారత్–చైనా సంబంధాలు పరుగులు పెట్టాయనవచ్చు. 2014–19 కాలంలో 18సార్లు నాయకులిరువురి ముఖాముఖీ చర్చలు, ఊహాన్, మామల్లాపురంలో రెండు రిట్రీట్ సమావేశాలు ఆ ఆశలు నింపాయి. రెండోవైపున మనదేశానికి చైనా రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయింది. అయితే 2020 ఏప్రిల్‌లో చైనా ఆకస్మికంగా లధాక్‌లో ఎల్‌ఏసిని అతిక్రమించింది. కీలకమైన ప్రాంతాల్లోకి సైన్యం చొరబడి తిష్టవేసింది. ఇందుకు ఎల్‌ఏసి గూర్చి వారి తప్పుడు భావన కారణం కావచ్చు, మరేదైనా కావచ్చు. 2020 జూన్‌లో గాల్వాన్‌లో ఇరు దేశాల గస్తీదళాలు కుమ్ములాడుకున్నాయి. 20మంది భారత సైనికులు మరణించారు. చైనా సైనికుల మరణాలు వెల్లడికాలేదు. దాంతో సంబంధాలు మళ్లీ బంద్ అయినాయి. వాణిజ్యం జరుగుతోంది గాని నేతలమధ్య మాటల్లేవు – బహుళపక్ష సమావేశాల్లో మొక్కుబడిగా కరచాలనాలు తప్ప. కొత్త అతిక్రమణలు లేకపోయినా, 2020 ఏప్రిల్‌కు పూర్వం ఉన్న స్థానాలకు సైన్యాలను ఉపసంహరించుకోవాలన్నది భారత్ డిమాండ్. మన భూభాగం ఇంచికూడా చైనా ఆక్రమణలో లేదన్నారు ప్రధాని మోదీ. పార్లమెంటులో చర్చకు అనుమతించలేదు. అయితే వివాదమెక్కడ? ఎల్‌ఏసి గూర్చిన భావనలో తేడా కావొచ్చు. కొన్ని నెలల తదుపరి సైనిక కమాండర్‌ల స్థాయిలో వివాద పరిష్కార చర్చలు మొదలైనాయి. పలు దఫాల చర్చల అనంతరం కొన్ని స్థావరాల నుంచి చైనా సైన్యాలు ఉపసంహరించుకున్నాయి. అయితే మరో పది గస్తీ పాయింట్లపై వివాదం కొనసాగుతోంది. తూర్పు లధాక్‌లో చైనా గస్తీ సైన్యాల ఉపసంహరణపై చైనాతో ఒప్పందం జరిగినట్లు సోమవారం భారత విదేశాంగశాఖ కార్యదర్శి ప్రకటించాక, మంగళవారం చైనా ధృవీకరించింది. కొన్ని మాసాలుగా దౌత్య, మిలటరీ ఛానల్స్‌లో, జాతీయ భద్రత సలహాదారుల మధ్య సంప్రదింపుల ఫలితమే ఇది. ఎల్‌ఏసి వెంట 2020 ఏప్రిల్ పూర్వపు పరిస్థితి పునరుద్ధరణకు ఇది అవకాశాలు తెరుస్తున్నది. రష్యాలో కజాన్ పట్టణంలో బ్రిక్స్ సమావేశం మంగళవారం ప్రారంభం అవుతుండగా ఈ ఉద్రిక్తోపశమన ప్రకటన వెలువడింది. మోదీ–జిన్‌పింగ్ ముఖాముఖీ చర్చలకు బాటవేసింది. అయితే జరగాల్సింది చాలా వుంది. అందుకవసరమైన సుహృద్భావాన్ని ఆశించుదాం!

# పశ్చిమాసియాలో కల్లోలం ; భారత్ యు టర్న్



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

ఉక్రెయిన్–రష్యా మధ్య సంఘర్షణ కొనసాగుతూనే ఉంది. ఫలితం గా నాటో విస్తరిస్తోంది. సంఘర్షణ లు, యుద్ధాలు నిరోధించేందుకు, శాంతపరచేందుకు ప్రస్తుత ప్రపంచవ్యవస్థ పూర్తిగా విఫలమైంది. అనేక అంశాల సమ్మేళనంతో దీర్ఘకాలంగా రాజకీయ అస్థిరత, అమెరికా, నాటో సామ్రాజ్యవాద జోక్యం మరింత ముమ్మరమైంది. సిరియా, యెమెన్, ఇరాక్ తదితర దేశాలలో మానవ సంక్షోభం పశ్చిమరాజ్యాల జోక్యం కారణంగా పెరిగింది. ప్రాంతీయ రాజ్యాలు సౌదీ అరేబియా, టర్కీ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఇటీవల పాలస్తీనా, ఇరాన్, లెబనాన్, గల్ఫ్ దేశాలపైన ఇజ్రాయిల్ దాడులు పెరిగిపోయాయి. ప్రపంచంలో శాంతి పెళుసుగా తయారైంది. అమెరికా, నాటో అధ్వర్యంలో ప్రపంచదేశాలు అనేక ప్రాంతాలలో వ్యూహాత్మకంగా మారిపోతున్నాయి.

ప్రపంచంలో అనేక చోట్ల ఘర్షణలు ఉద్రిక్తంగా తయారయ్యాయి. అమెరికా, తదితర పశ్చిమరాజ్యాలు ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో ఘర్షణలు పెరిగిపోవడానికి దోహదం చేస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలు, వనరులు ప్రాంతీయ ఆధిపత్యాన్ని కల్పించాయి. ఇరాన్‌లాంటి దేశాలలోనూ ఆధిపత్యం చెలాయిస్తున్నారు. 20వ శతాబ్దం మధ్యకాలంనుంచి అమెరికా విదేశాంగ విధానం ఈ ప్రాంతంలో పలుకుబడిని పెంచుకునేందుకు ప్రాధాన్యత నిచ్చారు. చిన్నచిన్న దేశాలలో జోక్యం సమస్యల పరిష్కారంకంటే ఉద్రిక్తతలను పెంచడానికి అవకాశం ఇచ్చింది. ఐఎస్ఐఎస్ వంటి తీవ్రవాద గ్రూపులు పెరగడానికి సామ్రాజ్యవాద దేశాలు దోహదం చేశాయి. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య దీర్ఘకాలంగా ఘర్షణలు, దాడులు సాగుతున్నాయి. ఈజిప్టు, సౌదీ అరేబియా వంటి అనేక దేశాలలో నిరంకుశత్వ రాజ్యాలు ఏర్పడ్డాయి. గత మూడు దశాబ్దాలుగా పశ్చిమాసియాలో శాంతి అత్యంత పెళుసుగా ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దలేని పరిస్థితిలో ఐక్యరాజ్యసమితి ఉంది. ఇజ్రాయిల్, పాలస్తీనా సమస్యను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం వహించడానికి ఐరాస ప్రయత్నించింది. సిరియాలో అంతర్యుద్ధం, యెమెన్‌లో సంఘర్షణ పరిష్కారం కాకుండా ఐరాస భద్రతా మండలిలో అమెరికా వీటో అధికారాన్ని ఉపయోగించుకుంటున్నది. సిరియాలో అస్థిరతను, కాల్పుల విరమణను సాధించి శాంతిని నెలకొల్పే అవకాశం ఐరాసకు లేదు. అమెరికా, ఇతర పశ్చిమరాజ్యాల వైమానిక దాడులతో విధ్వంసాన్ని సృష్టిస్తాయి. సంఘర్షణలకు మూలకారణాన్ని ఐరాస పరిష్కరించడంలో విఫలమైంది.

గాజాపైన దాడిని తక్షణం నిలిపివేయాలని అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసిజె) తీర్పుచెప్పింది. అమెరికా, ఇతర కీలకరాజ్యాలు సంఘర్షణలు, యుద్ధాలు జరగకుండా నిరోధించి శాంతిని నెలకొల్పేందుకు ముందుకు రావడంలేదు. అమెరికా, కాల్పులు విరమించాలని నామ మాత్రంగానే ఇజ్రాయిల్‌ను కోరుతోంది. అనేక దశాబ్దాలుగా ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై దాడులు జరిపి వేలాది మందిని హతంచేస్తూ వస్తోంది. జాతులమధ్య విభజనను దశాబ్దాలుగా నిర్వహిస్తూనే ఉంది. 2023లో దక్షిణాఫ్రికాను ఇజ్రాయిల్ జాతివివక్ష రాజ్యమని విమర్శిస్తోంది. దౌత్యపరంగా, సాంఘికపరంగా ఇజ్రాయిల్‌కు అమెరికా అన్ని విధాలుగా అండగా ఉంటోంది. అత్యధిక ప్రపంచ దేశాలు ఐరాసలో గాజాపై కాల్పుల విరమణ జరగాలని చేసిన తీర్మానాలకు మద్దతు తెలిపాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ అనేక దేశాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. గాజాపై దాడులను నిలిపివేయాలని ఐరాసలో అనేక తీర్మానాలను వివిధ దేశాలు నిర్ణయించాయి. వాషింగ్టన్ ఇజ్రాయిల్‌పై ఆంక్షలను నిరంతరం అడ్డుకుంటూనే ఉన్నది.

అనేకమంది విశ్లేషకులు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానిస్తున్నారు. నిబంధనల ఆధారమైన ప్రపంచవ్యవస్థను, ఐక్యరాజ్యసమితి చట్టాన్ని అంతర్జాతీయ చట్టాన్ని అమెరికా, ఇజ్రాయిల్, నాటోలు కలిసి బహుళత్వాన్ని నాశనం చేస్తున్నాయి. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత సూత్రాలను, ప్రపంచ పరిపాలనను గౌరవించడంలేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఉమ్మడి భద్రత భావనను నెలకొల్పాయి. సార్వభౌమత్వాన్ని గౌరవించాయి. అనంతరకాలంలో చట్టాన్ని వ్యవస్థ ఫ్రేమ్‌వర్క్‌ను శక్తిమంతమైన దేశాలు ప్రత్యేకించి అమెరికా దాని మిత్రదేశాలు ఏకపక్షంగా ఎంపికచేస్తున్న దేశాలలో జోక్యం చేసుకుంటున్నాయి. బహుళత్వ వ్యవస్థలను నాశనం చేసేందుకు అమెరికా కీలకమైన పాత్ర వహించింది. ఐరాస భద్రతామండలిలో అత్యధికసార్లు వీటోను ఉపయోగించి అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తోంది. సైనిక కార్యాచరణను దేశ సార్వభౌమత్వ సూత్రాల ను ఉల్లంఘిస్తూ ఐక్యరాజ్యసమితి చాప్టర్‌లో పేర్కొన్న శాంతి సూత్రాలను సైతం ఖాతరు చేయడంలేదు. పాలస్తీనాను ఆక్రమించిన ప్రాంతాలలో శాశ్వత ఆక్రమణలను కొనసాగించేందుకు ఇజ్రాయిల్ ప్రయత్నిస్తున్నది. ఈ చర్యలను అమెరికా దాని మిత్రదేశాలు సమ్మతిస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అమెరికా చర్యలను ఖండిస్తూ ఐరాస తీర్మానాలు చేసింది. ఇజ్రాయిల్‌పైన గణనీయంగా ఎటువంటి ఒత్తిడులు జరగకుండా అమెరికా అడ్డుపడుతోంది. 2011లో లిబియాలో అమెరికా జోక్యం చేసుకుని ఐరాస ఫ్రేమ్‌వర్క్‌ను దిగజార్చింది.

ప్రపంచ వేదికపైన శాంతి, సమానత్వం, న్యాయం నెలకొల్పాలని భారతదేశం ప్రముఖంగా ప్రతిపాదించింది. వలసవాద వ్యతిరేకత, స్వీయ రక్షణ, ప్రపంచ వ్యవస్థలో మరింత సమానత్వం కావాలని చేసిన పోరాటంలో అలీన ఉద్యమం కీలకపాత్ర వహించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య సార్వభౌమత్వం, పరస్పరశాంతి, సంఘీభావం కోరుతూ అనేక దశాబ్దాలు భారతదేశం విదేశాంగ విధానాన్ని పాటించింది. విశిష్ట హోదాను కలిగిన భారతదేశం ప్రపంచంలో దక్షిణ ప్రాంతంలో స్వతంత్ర ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య నాయకత్వాన్ని సమర్థించింది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలో దక్షిణాఫ్రికాలో జాతివివక్ష వ్యతిరేక సూత్రీకరణ భావనకు కట్టుబడిఉంది. విముక్తి ఉద్యమాలకు అండగా నిలిచింది. అయితే ఇప్పుడు పాలస్తీనాకు మాటమాత్రంగా మద్దతు తెలిపింది. గతంలో కాల్పుల విరమణకు, ఆయుధాల ధ్వంసం, వలసపాలనలో మగ్గుతున్న ప్రజల హక్కులకు మద్దతు, అన్ని విధాలుగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకతను తెలుపుతూ భారతదేశం తమ విదేశాంగ విధానాన్ని పాటించింది.

2014లో బీజేపీ నాయకులు నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విదేశాంగ విధానాన్ని సమూలంగా మార్చింది. ప్రత్యేకించి అమెరికా, ఇజ్రాయిల్ పట్లసంబంధం విషయంలో అంతకుముందు ఉన్న విధానంలో తీవ్రంగా మార్పులు చేసింది. అమెరికా, ఇజ్రాయిల్ పట్ల మోదీ ప్రభుత్వం పూర్తి అనుకూలతను పాటిస్తున్నది. గతంలో పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడేందుకు భారతదేశం సంపూర్ణంగా సహకరించింది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను గతంలో సుదీర్ఘ కాలంగా ఖండిస్తూనే వచ్చింది. మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్ ప్రభుత్వంతో సైనికసహకారం సహా సన్నిహితంగా వ్యవహరిస్తోంది. దాదాపు సంవత్సరానికిపైగా గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించకుండా మోదీ ప్రభుత్వం మౌనం వహిస్తోంది. ప్రపంచ భౌగోళిక రాజకీయాలలో తాము కీలకపాత్ర వహిస్తున్నామని నరేంద్ర మోదీ, బిజెపిలు చెప్పుకుంటున్నాయి. అయితే ప్రపంచ దేశాలలో సంఘర్షణలను నిలువరించేందుకు ప్రయత్నించడంలో భారత్ ఘోరంగా విఫలమైంది. చిన్నవి, పెద్దవి అయిన అన్ని దేశాలు ఒకే ప్రమాణం కలిగి ఉండాలని, నియమ నిబంధనల ఆధారంగా అంతర్జాతీయ వ్యవస్థ నెలకొనాలని, న్యాయమైన, శాంతియుతమైన ప్రపంచ సమాజం నెలకొల్పేందుకు ఆధిపత్యంగల దేశాలు, ఇతర దేశాలు కలిసికట్టుగా పనిచేయవలసిన ఆవశ్యకత ఎంతైనాఉంది.

> **సంవత్సరానికిపైగా గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించకుండా మోదీ ప్రభుత్వం మౌనం వహిస్తోంది. ప్రపంచ భౌగోళిక రాజకీయాలలో తాము కీలకపాత్ర వహిస్తున్నామని నరేంద్రమోదీ, బిజెపిలు చెప్పకుంటున్నాయి. అయితే ప్రపంచ దేశాలలో సంఘర్షణలను నిలువరించేందుకు ప్రయత్నించడంలో భారత్ ఘోరంగా విఫలమైంది. చిన్నవి, పెద్దవి అయిన అన్ని దేశాలు ఒకే ప్రమాణం కలిగి ఉండాలని, నియమ నిబంధనల ఆధారంగా అంతర్జాతీయ వ్యవస్థ నెలకొనాలని, మరింత న్యాయమైన, శాంతియుతమైన ప్రపంచ సమాజం నెలకొల్పేందుకు ఆధిపత్యంకల దేశాలు, ఇతర దేశాలు కలిసికట్టుగా పనిచేయవలసిన ఆవశ్యకత ఎంతైనాఉంది.**



# రాజకీయాల్లో...గోవు కీలకపాత్ర



రామ్ పునియాని

దేశ రాజకీయాల్లో గోవును దాదాపు మూడు దశాబ్దాలుగా భావోద్వేగ సమస్యగా ఉపయోగించుకుంటున్నారు. అంతే కాదు, గోవు పవిత్రమైందిగా ప్రచారం సాగిస్తున్నారు. అనేకమంది గోవు కు తల్లి హోదా ఇస్తున్నారు. మన సమాజాన్ని విభజించడానికి గోవును, హిందు జాతీ య రాజకీయాల్లో గోవును కత్తిమొనగా ఉపయోగించుకుంటున్నారు. హిందు సిద్ధాంతకర్త సావర్కర్ హిందుత్వను హిందూ మతంగానే కాదు, మొత్తం హిందూతత్వంగా తెరపైకి తీసుకువచ్చారు. ఈ అంశాన్ని ప్రధానంగా తీసుకొని ఆర్‌ఎస్‌ఎస్ తన రాజకీయాలను రూపొందించుకుని హిందు రాష్ట్రను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు శతాబ్ది కాలంగా అవిశ్రాంతంగా హిందు రాష్ట్ర ఏర్పాటుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తోంది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయాలను భావోద్వేగ సమస్యలుగా సృష్టిస్తూ, దేశంలో రాజకీయ రంగంలో ఆధిపత్యం సాధించింది. అవిశ్రాంతంగా పనిచేస్తూ 2024 అక్టోబరు నాటికి మరింత ప్రముఖంగా తెరపైకి వచ్చింది.

మహారాష్ట్రలో బీజేపీ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతూ (కేవలం దేశంలో పుట్టిన, ఎక్కువగా మాట్లాడుకునే దేశీయమైనదనిగా పరిగణించే) గోవును రాజ్యమాత గోమాతగా ప్రకటించారు. మహారాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న సందర్భంగా ఈ నినాదాన్ని ఇస్తున్నారు. మహారాష్ట్రలో ఎక్కువమంది బీజేపీ గెలిచే అవకాశాలు లేవని భావిస్తున్నారు. ఇటీవల లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రజల మధ్య విభజన తెచ్చేందుకు గోమాత నినాదాన్ని తీసుకువచ్చారు.

హిందు జాతీయ సిద్ధాంతకర్త సావర్కర్ గోవును వధించడం వ్యతిరేకించరాదని చెప్పారని ఇటీవల కర్నాటక మంత్రి ఒకరు చెప్పారు. "బెంగుళూరులో గాంధీ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దినేశ్‌గుండూరావు మాట్లాడుతూ, సావర్కర్ మీట్‌ను మాత్రమే కాదు, బీఫ్‌ను తినేవారని, బహిరంగంగా ఈ విషయాన్ని ప్రచారం చేశారు" అని తెలిపారు. కాంగ్రెస్ మంత్రి దినేశ్ గుండూరావు ఇంకా ఇలా చెప్పారు. "సావర్కర్ బ్రాహ్మణుడైనప్పటికీ, సంప్రదాయమైన ఆహార నియమాలను పాటించలేదని, ఆయన ఆధునికుడైన బ్రాహ్మణుడు బీఫ్ తినేవాడు, శాకాహారికాదని అన్నారు. గోవును వధించినప్పటికీ వ్యతిరేకించలేదు. వాస్తవంగా ఆయన ఆధునికుడు. "సావర్కర్ మీట్ తింటారని అందరికీ బాగా తెలుసు. లండన్‌లో గాంధీ సావర్కర్‌ను కలిశారు. దక్షిణాఫ్రికాలో గాంధీ కార్యకలాపాలకు సావర్కర్ మద్దతు తెలిపారు. అప్పుడుకూడా సావర్కర్‌ను గాంధీ కలిశారు. అప్పుడు సావర్కర్ డిన్నర్‌ను తయారు చేస్తున్నారు. ఆయన రొయ్యలను వేయించి గాంధీకి వాటిని ఇచ్చారు. అయితే గాంధీ తాను సంపూర్ణ శాకాహారినని చెప్పారు.

గోవును పూజించనవసరంలేదని కూడా సావర్కర్ చెప్పారు. రచయిత వైభవ్ పురందరె ఇలా పేర్కొన్నారు. గోవు కేవలం ఎద్దుకు మాత్రమే తల్లి అన్నారు. అయితే బీఫ్‌ను తిన్నట్లు రికార్డు లేదని, అయితే బీఫ్‌ను తినడాన్ని ఆయన వ్యతిరేకించలేదని రచయిత తెలిపారు. అయితే నిజంగా తనను హిందుత్వ పిత అన్నారని బెంగుళూరులో జరిగిన పుస్తక మహోత్సవంలో అన్నారు. పురందరె ఇంకా ఇలా అన్నారు. గోరక్షణ విషయాన్ని సావర్కర్ సంక్లిష్టం చేశారు. హిందువులను ఎగతాళి చేసేందుకు కావాలని గోవులను చంపడం సమస్య అయ్యేదని సావర్కర్ చెప్పారని అన్నారు. తినడానికి గోవును చంపినా ఇబ్బందిలేదని సావర్కర్ అన్నారని రచయిత అన్నారు. వేదకాలంలో గోవులను యజ్ఞాలలో బలి ఇచ్చేవారని, ఇది పవిత్రమని రచించారు. స్వామి వివేకానంద తాను రచించిన పుస్తకాలలో పవిత్రమైన క్రతువులలో గోవును బలి ఇచ్చేవారని, తినడం కూడా నిషేధంకాదని పేర్కొన్నారు. ప్రాచీన కర్మకాండ క్రతువులలో బీఫ్ తినని వ్యక్తి మంచి హిందువుకాదని భావించేవారని నేను చెపితే మీరు ఆశ్చర్యపోతారని వివేకానందుడు రాశారు. కొన్ని పవిత్ర సందర్భాలలో తప్పనిసరిగా గోవును బలిఇచ్చి తినాల్సి వచ్చేదని వివేకానందుడు పేర్కొన్నారు. అమెరికాలో (1900 ఫిబ్రవరి 2న) కాలిఫోర్నియా షేక్స్‌పియర్ క్లబ్‌లో వివేకానందుడు మాట్లాడుతూ ఈ విషయాలు ప్రస్తావించారు.)

స్వామి వివేకానంద స్థాపించిన రామకృష్ణ మిషన్ స్పాన్సర్‌చేసిన ఇతరపరిశోధనా గ్రంథాలలోనూ ఈ అంశాలను బలపరిచారు. అందులో ఒక పుస్తకంలో ఇలా ఉంది; వేద కాలంనాటి బ్రాహ్మణులతో సహా ఆర్యులు చేపలు, మాంసం చివరకి బీఫ్ కూడా తినేవారు. ముఖ్య అతిథి భోజనానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా బీఫ్‌ను వడ్డించేవారు. వేదకాలంనాటి ఆర్యులు బీఫ్ తిననప్పటికీ పాలిచ్చే గోవులను బలిఇచ్చేవారు కాదు. ఎద్దులు, పెద్దవైన గోవులు, వాటి బిడ్డలను కూడా వధించేవారు. అంబేద్కర్ అధ్యయనాలలోనూ ఇలాంటి అంశాలనే పేర్కొన్నారు. ప్రాచీనకాలంనాటి చరిత్రకారులు ప్రొఫెసర్ డి.ఎన్.ఝా తన పరిశోధనా రచనలలోనూ గో పవిత్రత అనేది కల్పనే నన్నారు. గోమాత అని హోదాను కల్పించడంపై బౌద్ధం, బ్రాహ్మణిజం మధ్య పోరాటం జరిగింది. భారతదేశంలో బుద్ధిజం దాదాపు అంతరించిపోయిన తర్వాత బౌద్ధంపై బ్రాహ్మణిజం దాడులు చేపట్టింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ముస్లిం, హిందు మత రాజకీయాలు ఉద్భవించాయి. తమను తాము బలపేతం చేసుకునేందుకు రాజకీయ ధోరణులను అనుసరించి పంది మాంసాన్ని, బీఫ్‌ను వినియోగించారు.

మత హింసను ప్రేరేపించేందుకు ఫోర్క్‌ను మసీదులలోను, బీఫ్‌ను దేవాలయాలలోను వేసేవారు. హింసను ప్రేరేపించేందుకే కావాలని ఆలయాలో బీఫ్‌ను వేసేవారు. అఖ్‌లఖ్ నుంచి జునాయిడ్ వరకు గోవధను నిషేధించినట్లు వెలుగుచూడడంతో రఖ్‌బర్ ఖాన్‌ను చంపి వేశారు. ఆకాలంలో ముస్లింలు, హిందువుల మధ్య గొడవలు గరిష్టస్థాయికి చేరాయి. మహారాష్ట్ర ప్రభుత్వం దేశీయ గోవులను మాత్రమే రాజమాతగా పిలుస్తున్నది. ఇతర గోవులను అలా పిలవడంలేదు.

భారతదేశం నుంచి బీఫ్‌ను ఎగుమతి చేయడం క్రమంగా గరిష్టస్థాయికి చేరింది. రచయిత విజయ్ త్రివేది (వాజ్‌పేయి మీద) రచించిన పుస్తకంలో వాజ్‌పేయి అమెరికా వెళ్లిన సందర్భంలో (పేజీ:236) బీఫ్‌ను తిన్నారని పేర్కొన్నారు. అయితే భారతదేశ గోవును తాను తినలేదుకదా అంటూ వాజ్‌పేయి నవ్వారని, ఇంక సమస్య ఎక్కడుందని ప్రశ్నించినట్లు త్రివేది తన పుస్తకంలో పేర్కొన్నారు.

# 'ఐరాస'ది మేకపోతు గాంభీర్యమేనా!



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

2వ ప్రపంచయుద్ధం నేర్పిన గుణపాఠాలను పునాదులుగా చేసుకొని 26జూన్, 1945 రోజున 51 దేశాలు తీసుకున్న నిర్ణయంతో 24, అక్టోబర్ 1945 రోజున ఐక్యరాజ్యసమితి (ఐరాస) స్థాపించబడే ఒక సంస్థ అనివార్యంగా ఏర్పడింది. 'యునైటెడ్ నేషన్స్' అనే పదాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ రూపొందించారు. అమెరికాలోకి న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన ఐరాసలో నేడు 193 (రెండు పరిశీలన దేశాలుగా ఉండగా) దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా గుర్తింపు పొందని నార్థ్ సైప్రస్, సొమాలిల్యాండ్, అబ్ఖాజియా లాంటి రాజ్యాలకు ఐరాస సభ్యత్వం ఇవ్వలేదు. వాటికన్ సిటీ, పాలస్తీనాలు సభ్యత్వాన్ని పొందలేదు. గత 78 సంవత్సరాలుగా ప్రపంచ దేశాల మధ్య విభేదాలను పరిష్కరిం చే తటస్థ వేదిక రూపంలో మధ్యవర్తిత్వం వహిస్తూ, పలు వివాదాల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తూ, మానవాళికి కరోనా మహమ్మారి లాంటి ప్రకృతి విపత్తు జరిగినపుడు ప్రజలను చైతన్య పరిచే ఐక్యరాజ్యసమితి 'ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు' చేసుకుని శతాబ్ది ఉత్సవాల స్థాయికి ఎదగడానికి ఉవ్విళ్లూరుతూ విశ్వజనావళికి సేవలు అందించడం సంతోషదాయకం.

**ఐరాస పేపర్ టైగర్‌గా మారిందా !**

ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ప్రతియేటా 24 అక్టోబర్ న సభ్యదేశాలు ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుట జరుగుతోంది. ప్రపంచ మానవాళిని విపత్తులు, పలు యుద్ధాలు, వాతావరణ ప్రతికూల మార్పులు కల్లోల పరుస్తున్న వేళ, దేశాలన్ని ఆర్థిక, సామాజిక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న అకాలంలో ఐరాస 79వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవలసి వస్తున్నది. అత్యవసర సమయాల్లో సత్వరమే స్పంది స్తూ, ప్రపంచ దేశాలకు తగు పరిష్కారాలను సూచిస్తూ, ప్రపంచ శాంతి స్థాపన యజ్ఞంలో తన వంతు బాధ్యతలను నిర్వహిస్తున్న ఐరాస సేవలు ప్రశంసనీయమని కొనియాడబడుతున్నప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్– రష్యా, ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధాలకు మధ్యవర్తిత్వం సఫలం కాకపోవడం, పేపర్ టైగర్‌గా మారడంతో ఐరాస ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలు వింటున్నాం.

**ఐరాస ప్రధాన అంగాలు:**

ఐరాస అధికార భాషలుగా అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్ మరియు స్పానిష్లు గుర్తించబడ్డాయి. ఐరాసలో ముఖ్యమైన 6 విభాగాలలో జనరల్ అసెంబ్లీ, సెక్యూరిటీ కౌన్సిల్, ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్, సెక్రటేరియట్, ట్రస్టీషిప్ కౌన్సిల్లు (క్రియాశీలంగా లేదు) వస్తాయి. ఐరాస ప్రధాన విధులలో అంతర్జాతీయ శాంతి మరియు భద్రతల స్థాపన, దేశాల మధ్య స్నేహబంధాలను నెలకొల్పడం జరుగుతున్నది. దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మానవీయ సమస్యలకు పరిష్కారాలు చూపుతూ, మానవహక్కులను కాపాడుతూ మౌళిక స్వేచ్ఛను కల్పించడం జరుతున్నది.

విపత్తులు, యుద్ధాలు విజృంభించిన వేళ ప్రజలను జాగృత పరచడం, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగోళాన్ని పరిరక్షించడం లాంటి అతి ముఖ్యమైన అంశాలలో ప్రపంచ దేశాలను చైతన్య పరచడం జరుగుతున్నది. దేశాల మధ్య సమానత్వం, నమ్మకాలను గౌరవించ డం, దేశ అంతర్గత సమస్యలకు దూరంగా ఉండడం, సరిహద్దు వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం లాంటి సూత్రాల ఆధారంగా ఐరాస పని చేస్తున్నది. ఐరాసకు అవసరమైన నిధులను సభ్యదేశాలే అందిస్తాయి. ఐరాస లో ముఖ్య ఏజెన్సీలుగా యునిసెఫ్, ఐయల్ఓ, యఫ్ఎఓ, డబ్ల్యూహెచ్ఓ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ లాంటి 15 ఏజెన్సీలు తమతమ విధులను నిర్వహిస్తున్నాయి.

**భారత్‌కు భద్రతామండలిలో చోటు అందని ద్రాక్షేనా !**

అంతర్జాతీయ శాంతి స్థాపనలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న యుఎన్ఓ భద్రతా మండలి(సెక్యూరిటీ కౌన్సిల్)లో ఐదు అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనాలు శాశ్వత సభ్యులుగా వీటో పవర్‌ను కలిగి ఉంటాయి. భద్రతా మండలిలో మరో 10 దేశాలకు 2 సంవత్సరాల వ్యవధితో తాత్కాలిక వీటోలేని సభ్యత్వాన్ని కల్పిస్తారు. ఇండియా తాత్కాలిక సభ్యత్వ దేశంగా సేవలందించడం జరిగింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ముఖ్య పరిపాలనాధికారిగా (సిఎఓ) సేవలందిస్తున్న ఐరాస నిర్దేశిత నియమాలను తీవ్రంగా ఉల్లంఘించిన దేశాన్ని భద్రతా మండలి సిఫార్సుతో జనరల్ అసెంబ్లీ ఆ దేశ సభ్యత్వాన్ని రద్దు కూడా చేయవచ్చు. ప్రపంచ దేశాల్లో ఒక ప్రధానమైన 145 కోట్ల జనాభాతో కూడిన దేశంగా భారత్‌కు భద్రతామండలిలో చోటు దక్కకపోవడం, చైనా లాంటి దేశాలు అడ్డుపుల్లలు వేయడం విస్మయాన్ని కలిగిస్తున్నది.

**అనేక మైలురాళ్లు, అడ్డంకులు దాటుకుంటూ..**

ఆవిర్భావం నుంచి నేటివరకు ఐరాస నిర్వహించిన పాత్ర ప్రశంసనీయంగా ఉంటూనే కొన్ని సందర్భాలలో నిరాశనే మిగిల్చిందని చరిత్ర చెబుతోంది. అనేక ఆటంకాలు, సవాళ్ల నడుమ తన ఉనికిని చాటుకుంటూ, ప్రపంచదేశాలలో శాంతి స్థాపన దిశగా అడుగులు వేస్తున్నది. ఐరాస చరిత్రలో ఎన్ని మైలురాళ్ళు దాటినా, కొన్ని విషమ పరిస్థితులలో తగు న్యాయం చేయలేక పోయిందనే విమర్శలను మూటకట్టుకుంది. కోవిడ్19 ప్రారంభదశలో ఐరాస డబ్ల్యూహెచ్ఓ సరైన సమయంలో స్పందించలేక పోయిందని, వూహాన్ (చైనా) కరోనా పుట్టుకను గుర్తించినప్పటికీ, చైనాను కాపాడే విధంగా, ప్రపంచ దేశాలను సకాలంలో జాగృత పరచలేకపోయిందనే విమర్శలను ఎదుర్కొనడం మనకు ఇంకా గుర్తుంది. అమెరికా–ఇరాక్‌ల మధ్య వివాదం, సూడాన్‌లో అకాల మరణాలను అరికట్టడం, నేటి రెండు యుద్ధాలకు ముగింపు పలకడం లాంటి సందర్భాల్లో ఐరాస విఫలమైందని తెలుస్తున్నది. ఐరాస ఎదుర్కొంటున్న సవాళ్ళలో పేదరికం, అనారోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం, దేశాల మధ్య సంఘర్షణలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, హింస, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, ఆయుధ సంపత్తి విస్తరణ లాంటివి ముఖ్యమైనవి గుర్తించబడినవి. నేడు జరుగుతున్న యుద్ధాలతో పాటు అమెరికా–చైనాల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం ఐరాస లక్ష్యాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణులతో ఐరాస కార్యదక్షత అయోమయంలో పడుతున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆయుధాలతో అగ్రరాజ్య స్థాయి సాధ్యపడదని, విశ్వమానవాళికి సుఖ సంతోషాలు పంచగలగడమే పెద్దరికం అవుతుందని అగ్ర దేశాలు గుర్తించాలి. ప్రపంచశాంతి స్థాపనలో ఐరాస పెద్దన్నవలె నిలబడి, దేశాల మధ్య విభేదాల ను చెరిపి, అవసరమైతే కొరడా ఝుళిపి, సహకార భావనను పెంచి, ప్రపంచ కుగ్రామాన్ని సుందర నివాస ప్రదేశంగా నిర్మించాలని ఆశిద్దాం. ఐరాసను గౌరవిద్దాం, ప్రపంచశాంతికి పునాదులు వేద్దాం.

**(24 అక్టోబర్ 75వ ఐరాస ఆవిర్భావ దినోత్సవం)**




# సింగరేణి విశ్రాంత కార్మికుల హామీ నెరవేర్చాలి

లేఖ

సింగరేణి విశ్రాంత కార్మికులు యాజమాన్యంకు చెల్లించిన 40,000 రూపాయలకు గాను కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మేడికేర్ స్కీం (సిపిఆర్ ఎం ఎస్)ద్వారా భార్యభర్తలిద్దరికి కలిపి ఎనిమిది లక్షల రూపాయల విలువ గల ఇన్‌పేషంట్ వైద్య సౌకర్యం ఒప్పందం చేసుకున్న కార్పొరేట్ ఆసుపత్రులలో స్వీకరిస్తున్నారు. అధికారులకు వారి బేసిక్ వేతనం నాలుగు శాతం రికవరీ వలన విశ్రాంత అధికారులు 25,00,000 రూపాయల వైద్యం పొందుతున్నారు.

నేటి కార్పొరేట్ వైద్య ఖర్చులు పెరగడం వలన ఎనిమిది లక్ష ల రూపాయలు సరిపోవడం లేదని ఎన్నోసార్లు, విశ్రాంత ఉద్యోగులు సింగరేణి యాజమాన్యంకు, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకోవడం జరిగింది. ఈ నెల ఏడవ తేదీన ప్రజాభవన్‌లో కోల్ బెల్ట్ ఎంఎల్‌ఏలు, ఎం.పిలు, కార్మిక సంఘ నాయకుల సమక్షంలో జరిగిన సమావేశంలో సింగరేణి కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్,ప్రకటించారు. ఇదే సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల విన్నపాలను పరిశీలించిన ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క విశ్రాంత ఉద్యోగులకు సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్ పరిమితిని ఎనిమిది లక్షల నుంచి పది లక్షల రూపాయలకు పెంచుతామని ప్రకటించడంతో ఊరట లభించింది. ఇట్టి ప్రకటన రాజకీయ హామీగా మిగలకుండా సత్వరమే సింగరేణి యాజమాన్యం సిపిఆర్ఎస్ మెడికల్ కార్డు పరిమితి ఎనిమిది లక్షల రూపాయలనుంచి పది లక్షల రూపాయలకు పెంచేందుకు ఉత్తర్వులు జారీ చేసి అమలు పరచాలని విశ్రాంత ఉద్యోగులు వేడుకుంటున్నారు.

ఆళవందార్ వేణు మాధవ్



## గ్రామాల్లో రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

జిల్లా కలెక్టర్ హనుమంతు కే జండగె

**ప్రజాపక్షం/యాదాద్రి:** గ్రామాల్లో పేద ప్రజలకు, వృద్ధులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు హనుమంతుకే జండగే అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం బుధవారం భువన గిరిలోని హోటల్ నిర్వహించారు. గ్రామాలలో, పట్టణాలలో రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని విస్తృతంగా పెంచి మరిన్ని సేవలు గ్రామీణులకు అందించా ల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రెడ్ క్రాస్ భువనగిరి జిల్లా శాఖ రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో రాష్ట్రంలో ముందు ఉండడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు తమ పూర్తి సహకార అందిస్తానని కలెక్టర్ వివ రించారు. రెడ్ క్రాస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, సీఈవో ప్రొఫెసర్ ఏ.శ్రీరా ములు మాట్లాడుతూ యువత ముందుకొచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనా లని కోరారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలపై రాచకొండ ట్రాఫిక్ ఏఎస్ఐ సోమనాథ్ వీడియో చిత్రాల ద్వారా, సిఆర్‌పి పై డాక్టర్ విజయకుమార్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీ నరసింహ రెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర జన రల్ సెక్రెటరీ ప్రొఫెసర్ ఏ.శ్రీరాములు, జిల్లా వైస్ చైర్మన్ రెడ్డి బాలాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.మహేందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి డి.అంజయ్య, డివిజన్ అధ్యక్షులు సద్ది వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్లు అంజయ్య, కే.ప్రభాకర్ రెడ్డి, పి.శ్రీనివాస్ రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు 35 శాతం రాజకీయ రిజర్వేషన్లు కావాలి

రాష్ట్ర, జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి : సృజన



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** మహిళలకు 35 శాతం రాజకీయ రిజ ర్వేషన్లు కావాలని పోరాడుతున్న పాలక వర్గాల మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడితే మహిళల హక్కులు సాధించబడతాయని, నవంబర్‌లో జరగ నున్న రాష్ట్ర మహిళ సమాఖ్య మహాసభలతో పాటు డిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా జాతీయ మహిళ సమాఖ్యమహాసభలను విజయవంతం చేయా లని సిపిఐ మహిళ సమైక్య రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంలోని దొడ్డా నర్సయ్య భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డిల్లీలో జరగనున్న ఆల్ ఇండి యా సమాఖ్య మహాసభలను విజయవంతం చేయాలని, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి తిరిగి సభ్యత్వ నమోదు చేయాలని ఆమె పిలుపుని చ్చారు. ఎ.లక్ష్మి, దేవరం మల్లీశ్వరి, అలివేలు, రెమిడాల జయసుధ, ఎస్‌కె మహ్మదబేగం, పార్వతి, యల్లావుల ఉమా తదితరులు పాల్గొన్నారు.

## బాణామతి వస్తుందనే నెపంతో ఇంటి నుండి వెళ్లగొట్టిన కుటుంబ సభ్యులు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** బాణామతి వస్తుం దనే నేపంతోనే కుమారుడు, కోడళ్లు, మను మండ్లు ఇంటి నుండి వృద్ధులను వెల్లగొట్టిన సంఘటన ఆత్మకూర్(ఎస్) మండలం కంద గట్ల గ్రామంలో చోటు చేసుకుంది. బుధ వారం ఈ విషయమై జిల్లా కేంద్రంలోని ఆర్ డిఓ కార్యాలయంలో వృద్ధులు అర్రూరు నర సయ్య, భార్య అనసూర్యలు ఆర్‌డిఓ వేణుమాధవరావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు బాణామతి వస్తుందనే నేపంతో తన కుటుంబ సభ్యులు తాము ఇంట్లో ఉండవద్దని మంగళవారం రాత్రి గృహనిర్భందం చేసి భౌతికదాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని కూడా కుమా రుడే సేద్యం చేసుకుంటున్నాడని గత మూడేళ్లుగా ఏలాంటి ధాన్యం ఇవ్వ కుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పెద్దమనుషుల సక్షమంలో సీజన్‌కి ఐదు వేల రూపాయలు, పుట్టేడు వడ్లు ఇవ్వాలని నిర్ణయించినప్పటికి ఇవ్వకుండా బౌధికంగా దాడి చేసి మానసి కంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నా కుమారుడు, కోడలు, మనుమండ్లపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## మార్క్సిజం అంబేద్కర్ ఆలోచనా విధానం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** మతోన్మాద దోపిడీ విధానాలకు ప్రత్యా మ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమని ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బిఎన్ రెడ్డి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఓంకార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీతి నిజాయితీ విలువలకు ఆదర్శాలకు నిలువెత్తు రూపం కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అని అన్నారు. ఆయన ఆశయ సాధ నకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మార్క్సిజం దోపిడిని వ్యతిరే కింస్తే అంబేద్కర్ ఆలోచన విధానం నీతి నిజాయితికి విలువలకు నిలువు టద్దం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి నజీర్, వసుకుల మట్టయ్య, వెంకన్న, పోతుగంటి కాశీ, ఏపూరి సోమన్న, మోర పాక ఉగ్ర య్య, కోటయ్య, వైభవ్, కిరణ్, వెంకట్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పత్తి కొనుగోలుదారులపై ఆకస్మిక దాడులు



**ప్రజాపక్షం/ నల్లగొండః** అసిస్టెంట్ కంట్రోలర్ కె.సిద్ధార్థకుమార్ ఆదేశాల మేరకు పత్తి రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి, చండూరు మునుగోడు ప్రాంతాల్లో ప్రైవేట్ పత్తి కొనుగోలుదారులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఒకచోట వెరిఫికేషన్ చేయని కాంటబాట్లను వాడడంతో ఆ వ్యాపారస్తునీ పై కేసు నమోదు చేశారు. మరో మిగతా ముగ్గురు వ్యాపార స్తులు వెరిఫికేషన్ సర్టిఫికెట్ కలిగియుండని కారణాన వారి మీద కూడా కేసు నమోదు చేశారు. ధృవీకరించని బరువులు తూకం వేసే యంత్రాన్ని ఉపయోగించినందుకు ధృవీకరణ ధృవీకరణ పత్రాన్ని కలిగి ఉండనం దుకు నాలుగు కేసులు నమోదు చేయబడ్డాయి. వ్యాపారస్తులు తూకంలో ఎటువంటి తేడాలు చేసినట్లయితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన జరి మానాలు విధించబడతాయని పేర్కొన్నారు.

# కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చు

కలెక్టర్ సి. నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ:** అంకితభావం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవ చ్చని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం సమీపంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొం దిన మహిళ అభ్యర్థుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. జీవితంలో ఎవరిపై ఆధారప డకుండా స్వశక్తితో జీవించాలని, అయితే ఏ రంగంలోనైనా పోటీ సాధారణమని, ప్రత్యేకించి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా వ్యాపార రంగంలో స్థిరపడాలనుకుని శిక్షణ పొందిన మహిళ అభ్యర్థులు అంకితభావంతో, కష్టపడి పని చేస్తే తప్పనిసరిగా రాణిస్తారని అన్నారు. ముఖ్యంగా వ్యాపారమనేది నమ్మకం, నాణ్యత , సమయం పై ఆధారపడి ఉంటుందని, వ్యాపార రంగంలో రాణించేందుకు పోటీ ని ఎదుర్కోవాలని, అలాగే నష్ట భయం ఉంటుం దని, పెట్టుబడి పెట్టడం ఒకటే మార్గం కాదని, పెట్టుబడి తో పాటు, కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన అభ్యర్థులు లక్ష్యం పెద్దగా ఏర్పాటు చేసుకోవాలని, అలాగే వ్యాపారంలో వ్యాపారం ప్రారంభించిన వెంటనే ఎక్కువ లాభాలు రావా లని ఆశపడకుండా, దశలవారీగా అంచెలం చెలు గా పైకి ఎదగాలని, అవకాశాల కోసం వెతుక్కుంటూ ముందుకు వెళ్లాలని సూచిం చారు. ఈ సందర్భంగా ఆయన టైలరింగ్ ఎంబ్రాయిడరీలలో శిక్షణ పొందిన 88 మంది మహిళ అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజే శారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఈ. రఘుపతి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు సుమారు 5000 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల టైలరింగ్ ఎంబ్రాయిడరీలో 88 మంది మహిళా అభ్య ర్థులు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ విడత శిక్షణలో భాగంగా పురుష అభ్యర్థులకు సీసీటీవీలో 13 రోజుల శిక్షణ , ఏసీ మరమ్మతు లపై 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నల్గొండ శిక్షణ కేంద్రంలో సొంతంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామీ ణాభివృద్ధి సంస్థ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పత్తి రైతు మద్దతు ధరను పొందాలి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** పత్తి రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7,521 కన్నా తక్కువగా అమ్ముకోవాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండలం పరిధిలోని చౌడంప ల్లిలో గల వరలక్ష్మి కాటన్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి పత్తి కొనుగోళ్లపై ఆరా తీశారు. ఇప్పటివరకు కాటన్ మిల్లుకు వచ్చిన పత్తి, ప్రస్తుతం మిల్లులో ఉన్న పత్తి, తేమశాతం తనిఖీ చేశారు. మిల్లుకు పత్తి తెచ్చిన రైతులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం భారత పత్తి సంస్థ ద్వారా ప్రకటిం చిన కనీస మద్దతు ధర రూ.7,521 వచ్చే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ, మార్కెటింగ్ , సిపిఐ, అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు సుమారు అయిదారు నెలలు కష్టపడి పత్తి పంటను పండిస్తా రని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను పొందేందుకు పత్తి రైతులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావా లని కోరారు. అలాగే పత్తి నాణ్యత తో ఉండాలని, రంగు మారకుండా, వర్షానికి తడవకుండా చూడాలని, పత్తిని రైతులు లూజుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని చెప్పారు. 12 శాతానికి మించి తేమ ఉన్నట్లయితే మద్దతు ధర రాదని, అందువలన రైతులు పత్తిని పొలం నుంచి తెంపిన తర్వాత నేరుగా కాటన్ మిల్లు లకు తీసుకురాకుండా ఆరబెట్టి తీసుకురావాలని చెప్పారు.

# మనియాండ్లగుట్ట మైనింగ్ కాంట్రాక్టు రద్దు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) పట్టణ శాఖ సమావేశం కామ్రేడ్ చొప్పరి వెంకటేశం అధ్యక్ష తన మంగళవారం నిర్వహించారు. ఈ సమావే శానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ వలి గొండ మండలంలోని రెడ్ల రేపాక గ్రామ రెవిన్యూ శివారులో 580 సర్వే నెంబర్ మని యాండ్లగుట్ట విస్తీర్ణం 36 ఎకరాలు ప్రభుత్వ భూమి మైనింగ్ సంబంధించిన కాంట్రాక్టర్లు గుట్టను ప్రభుత్వం దగ్గర లీజింగ్ తీసుకున్న భార్గవ మైనింగ్ కాంట్రాక్ట్‌ను ప్రజలు వ్యతిరేకిస్తు న్నారని అన్నారు. ఆ గుట్టపైన మైనింగ్ రాళ్లు చాలా విలువైనవి హా రాళ్లను తరలించి అక్కడ రాయిని రకరకాలుగా శుభ్రపరచి ఇతర దేశా లకు ఎగుమతి చేస్తున్నారని అన్నారు. విలువైన టువంటి గుట్టను ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉన్నది ఆ గుట్ట పైన అనేకమైన వన్యప్రాణులు జాతీయ పక్షులు నెమలిలలు కూడా ఉన్నాయని, రైతులకు, వ్యవ సాయ కూలీలకు పశువులకు, గొర్లకు ఉపయోగ పడే గుట్ట కాబట్టి అక్కడ కేటాయించిన కాంట్రా క్టును రద్దు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి ప్రభుత్వం సర్వే చేసి చుట్టు హద్దులు పెట్టాలని భూమిలోకి ఇతర ఏ కాంట్రా క్టర్ రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పట్టణ శాఖ కార్యదర్శిగా సుద్దాల సాయికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్య దర్శి పోలేపాక యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మచ్చ లక్ష్మీ నారా యణ, సలాద్రి రవీందర్, బొడిగె సుదర్శన్, పారుపల్లి నరసింహ, గోరయ్య పాల్గొన్నారు.

## పేరుకే సిసిఐ కొనుగోలు కేంద్రాలు

క్వింటా పత్తి కూడా కొనడం లేదు

దళారీల పాలవుతున్న పత్తి : నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా ఎక్కడ కూడా రైతుల నుండి ఒక క్వింటా పత్తి కూడా కొనుగోలు చేయకపోవడంతో దళారీలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలలో క్రయవిక్రయాలు జరగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి,పెట్టుబడులు పెట్టి పత్తి పండిస్తే తేమశాతం పేరుతో నాణ్యత లేదని సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తి కొనుగోలు చేయడం లేదు దీంతో దిక్కులేక రైతులు 5 వేల రూపాయలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిం దన్నారు. గ్రామాలలో పత్తి కొనుగోలు దళారులు కొలతలలో మోసం చేస్తూ రైతు లని నడ్డి విరుస్తున్నారు. ప్రభుంత్వ పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది కానీ క్రయ విక్రయాలు జరగపోవడంతో రైతు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరంలో సరైన సమయంలో వర్షాలు పడక పంట చేతికి వచ్చేసరికి అకాల వర్షాలు వల్ల పంట దిగుబడి ఎకరానికి కేవలం 5 మాత్రమే వస్తున్నది దీంతో తీవ్రంగా రైతు నష్టపోతావున్నారు.ఇప్పటికైనా సిసిఐ కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేసి పద్ధతిలో కల్పించాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# బుద్ధగయ బౌద్ధ పర్యాటకులను బుద్ధవనానికి తీసుకురావాలి

టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/నందికొండ :** ఆచార్య నాగార్జు నుడు నడయాడి, మహాయాన బౌద్ధాన్ని ప్రచ లితం గావించి, మాధ్యమిక బౌద్ధ తార్కిక విధా నాన్ని ప్రచారం చేసిన, నాగార్జునసాగర్ లో అల నాటి బౌద్ధ సంస్కృతిని ఈ తరానికి తెలియ చెప్ప టానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి , బుద్ధగయ సంద ర్శించే బౌద్ధ పర్యాటకుల్ని తీసుకురావాలని స్థానిక ఆనంద్ ఇంటర్నేషనల్ హోటల్ లో ఏర్పాటు చేసిన ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరే టర్ల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకా భివృద్ధి సంస్థ, చైర్మన్, పటేల్ రమేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.అసోసియేషన్ ఆఫ్ బుద్దిస్ట్ టూర్ ఆపరే టర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సమావే శానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారా వుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పర్యా టకం మునుపెన్నడూలేనంతగా ఊపందుకుం దని, బుద్దిస్ట్ సర్క్యూట్ తో పాటు బౌద్ధ పర్యాట కాన్ని ప్రోత్సహించడానికి తాము ప్రత్యేక కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. బుద్ధవనం బుద్దిస్ట్ ఎక్స్పర్ట్ కన్సల్టెంట్ డా. ఈమని శివనాగి రెడ్డి నాగార్జునసాగర్ లోని బుద్ధవనం వీడియో ను ప్రదర్శించిన అనంతరం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బుద్ధవనం ప్రత్యేకతలను వివరించారు. బుద్ధగయలోని ట్రావెల్ ఏజెంట్లు టూర్ ఆపరేటర్ల కోసం త్వరలోనే బుద్ధవనానికి ఒక పరిచయ పర్యటనను ఏర్పాటు చేస్తామని, హాజరైన వారిని బుద్ధవనం సందర్శనకు పటేల్ రమేష్ రెడ్డి ఆహ్వానించారు.

## రోప్‌వే పనుల్లో జాప్యం ఉండొద్దు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** రోప్ వే పాయింట్‌ను పరిశీలించి పనులు జాప్యం జరగకుండా త్వరితగతిన ప్రారంభించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి ఫోర్ట్ రోప్ వే పనులపై అధి కారులతో పరిశీలించి సమీక్షా సమావేశం నిర్వహించారు. రోప్ వే పూర్తయితే భువనగిరి టూరిజం స్పాట్గా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భువన గిరి కలెక్టర్ హనుమంతు జెండగే, మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టూరిజం స్టేట్ జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రామంజుల్ రెడ్డి, భువనగిరి తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని అభివృద్ధి పనుల పై చర్చించారు.

## సమగ్ర కులగణనలో బిసి కులాలు భాగస్వాములవ్వాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** గల్లి నుండి ఢిల్లీ వరకు అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలని జీవో 18 విడుదల చేసిందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం పట్ట ణంలోని బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగ ణనలో బిసిలలోని అన్ని కులాలు భాగస్వాములై తమ కుటుంబ స్థితిగతులను నమోదు చేసుకోవాలని కుల సంఘ నాయకులు అందరూ పట్టణ గ్రామస్థా యిలో అన్ని కులాల వారికి అవగాహన కల్పించాల న్నారు. ఈ కులగణంలో బిసిల ఖచ్చితమైన జనాభా లెక్కలు తేలినప్పుడు మాత్రమే బిసిలకు అన్ని రంగాల్లో సమాన వాటా దక్కుతుందని బిసిల ఖచ్చి తమైన జనాభా లెక్కలు తేలుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టో పెట్టిన విధంగా రెండు నెలల్లో సమగ్ర కులగడ్డ చేపట్టి బిసి రిజర్వేష న్లను 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీను నిలబెట్టుకోవాలని అన్నారు. ఎనిమిది శాతం కూడా లేని అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వే షన్ ఇచ్చి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు చక్రహరి రామరాజు మాట్లాడుతూ జీవో 29 ద్వారా బిసిలకు తీరని అన్యాయం జరుగుతుందని జీవో 29 ని వెనుకలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో నాయకులు నేలపట్ల సత్యనారాయణ, కేశబోయన శంకర్ ముదిరాజ్, చిక్కుల రాములు,కాశయ్య గౌడ్ పాల్గొన్నారు.

## ఎస్‌ఎల్‌బిసి రెండు , డిండి లిఫ్ట్ మూడు సంవత్సరాల్లో పూర్తి

ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రాజెక్టు లను పూర్తి చేయడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించి కాలయాపన చేసిందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎస్ఎల్‌బిసి ని కేవలం 9 కిలో మీటర్లు మాత్రమే పూర్తి చేసారని, అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫౌండేషన్ వేసిన కాంగ్రెస్ మళ్లి ఎస్ఎల్‌బిసిని పూర్తి చేయనుందని అన్నారు. జిల్లాకు ఒక వైపు ఫ్లోరోసిస్ మరోక వైపు కరువు నుండి శాశ్వత పరి ష్కారం కోసం ఎస్ఎల్‌బిసి, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు లను 3 సంవత్సరాల లోపు పూర్తి చేస్తామని అందుకు ఎస్ఎ ల్‌బిసి కి 4643కోట్లుకు మంత్రి వర్గం ఆమోదం తో నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. డిసెంబర్ మొదటి వారంలో ఎస్ఎల్‌బిసి పనులు ప్రారంభం కానున్నాయని, డిండి లిఫ్ట్ ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గా ల్లోని 3.50లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుందని తెలి పారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాల్, దేవరకొండ మార్కెట్ కమిటి చైర్మన్లు నాయిని జమున, అలి వేలు, మాజీ జెడ్పిటిసి అరుణ, మాజీ ఎంపిపి జాన్‌యాదవ్, డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పేగు బంధం మరిచి... భూమి కోసం సొంత అన్ననే హత్య

నిందితుల అరెస్ట్

డిఎస్‌పి రాజశేఖర్‌రాజు వెల్లడి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేగు బంధం, మానవత్వం మరిచాడు. భూమి కోసం సొంత అన్ననే చంపాడు. ఈ సంఘటన మాడ్గులపల్లి మండలంలో చోటుచేసుకుంది. నిందితులను అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. బుధవారం మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిం చారు. మాడ్గులపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి నరసింహులుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కాకునూరి లింగయ్య, కాకునూరి కొండయ్య, కాకునూరి శ్రీనివాసులు ఉన్నారు. వీరిలో కాకునూరి లింగయ్య గత కొంతకాలం క్రితం మరణిం చారు. వీరికి తండ్రి ద్వారా సంక్రమించిన ఆరు ఎకరాల భూమిని పెద్ద అన్న చనిపోవడంతో వారి కుటుంబసభ్యులకు తెలియకుండా రెండో అన్నయ్య కొండయ్యకు సంబంధించిన భూమిని కూడా మొత్తంగా ఆరెకరాలను కాకునూరి శ్రీను తన పేరును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం ఇటీవల బయటపడడంతో కాకునూరి కొండయ్య శ్రీనును భూమిని తిరిగి తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని పట్టుబట్టడమే కాకుండా పెద్ద మనుషుల్లో పంచాయతీ పెట్టడం జరిగింది. కాకునూరి శ్రీను పెద్ద అన్నయ్య అయిన లిగ య్యకు సంబంధించిన భూమి రెండు ఎకరాలు, రెండో అన్నయ్య కొండయ్యకు సంబంధించిన రెండు ఎకరాల భూమిని తిరిగి ఇవ్వాలని మన సులో లేకపోవడంతో కొండయ్యపై కక్ష పెంచుకు న్నాడు. ఈనెల 16న కిరాయి మనుషులు వేముల నాగరాజు, పందిరి లింగస్వామిలతో కలిసి మధ్యాహ్నం కొండయ్య ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేసి కత్తితో పొడిచి ఆయనను ఆటోలో చీరాల సురేష్, జిట్టబోయిన వెంకన్న సహాయంతో ఎత్తుకపోతుండగా చుట్టుపక్కల వారు గమనించి వారిని అడ్డుకోవడంతో కొండ య్యను అక్కడ వదిలేసి పరారయ్యారు. చుట్టుప క్కల వారు కొండయ్యను చికిత్స నిమిత్తం తరలి స్తుండగా మార్గమధ్యలో కొండయ్య మృతిచెం దాడు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వారు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కాకునూరి శ్రీను, లింగస్వామి, నాగ రాజు, సురేష్, వెంకన్నలను అరెస్ట్ చేసి విచా రించి బుధవారం కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, మాడ్గులపల్లి ఎస్ఐ కృష్ణయ్యలు ఉన్నారు.

## అమరుల త్యాగాలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశ ప్రజల కోసం త్యాగం చేసిన పోలీసు అమరవీ రుల త్యాగాలు చిరస్మరణీయమని ఫెయిత్ బంజారా ఆశ్రమ ఛైర్మన్, పాస్టర్, సామాజికవేత్త ధీరావత్ హన్యానాయక్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మ రణ దినోత్సవాన్ని పురస్కరించుకోని బుధవారం ఆశ్రమ చిన్నారులతో కలిసి జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడటమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారని, దేశ సరిహద్దుల్లో సైనికులు దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై వెలుగు చూస్తున్న దాడులు, సమాజానికి తలవంపులు తెచ్చే విధంగా ఉన్నాయని వాపోయారు. మహిళల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలను అమలు జరిపినప్పుడే దోషులకు కఠిన శిక్షలు పడుతాయని చెప్పారు. ఆయన వెంట రమాబాయి, సుధారాణి, ఆశ్రమ చిన్నారులు ఉన్నారు.






## సిపిఐ సీనియర్ నాయకులు వెంకటరామనర్సయ్య మృతి

నివాళులర్పించిన పువ్వాడ నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్లు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు, హనుమంతు కృష్ణయ్య సహచరులు మేదరమట్ల వెంకటరాయనర్సయ్య(84) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ సీనియర్ నాయకులు, శాసనమండలి మాజీ సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, పాలేరునియోజకవర్గ నాయకులు లింగా వెంకటనారాయణ, నాయకులు బోజడ్ల సూర్యం, పిట్ల కృష్ణమూర్తి, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు పంట నష్టపరిహారం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



**ప్రజాపక్షం/బోనకల్ :** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను తప్పుడు పంట నష్ట సర్వే చేపట్టి, అర్హులైన రైతులను నష్టపరిచిన ఎఒ, ఎఇఒలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో అర్హులకు పంట నష్టపరిహారం అందని విషయమై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను సిపిఐ బృందం పరిశీలించిందన్నారు. పారదర్శకంగా వ్యవసాయ అధికారులు సమగ్ర పంట నష్ట సర్వే చేపట్టి, అర్హులైన రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. వ్యవసాయ అధికారులు కాసులకు కక్కుర్తి పడి తప్పుడు సర్వేలు చేపట్టి అర్హులైన రైతులను నష్టపరిచారన్నారు. ఉపముఖ్యమంత్రి ఇలాకాలోనే ఈ రకంగా రైతులు నష్టపోయారంటే ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. పంట వేయకపోయినా పరిహారం అందే రైతుల జాబితాను తొలగించి, అర్హులైన వారిని జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. మెరక భూములు కొట్టుకుపోయాయని, భూమి లేని వారికి పరిహారం అందించే వ్యవహారాన్ని నిలిపివేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పక్క ప్రజాపాలన ప్రభుత్వంగా చెప్పుకుంటుంటే, వ్యవసాయ అధికారులు దళారుల పాలనగా మార్చేందుకు కృషి చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల ధరలు తగ్గించండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** నిత్యావసర సరుకులు ధరలు రోజురోజుకు ఆకాశానంటుతున్నాయని, ధరలు తగ్గించి పేదలను ఆదుకోవాలని, అన్ని రకాల నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం ఎన్టీఆర్ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ పరిపాలన పేదలు సామాన్యుడని ఇబ్బంది పెడుతూ కార్పొరేట్ కంపెనీలకు అదాని, అంబానీలకు లక్షల కోట్ల రాయితీలుస్తూ దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ కాలనీలో సింగరేణి వారు చేస్తున్న పనులు నాసిరకంగా నడుస్తున్నాయని రేకుల స్థానంలో ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎన్టీఆర్ కాలనీ శాఖ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, ఎస్కె హమీద్, అజయ్, మహిళా సమైక్య డివిజన్ నాయకులు ఎస్.కె రంజాన్ బి, ఆయేషా, చెన్నమ్మ, మహేశ్వరి, నాగమణి, రమాదేవి, ఝాన్సీ లక్ష్మి, మాత లక్ష్మి, రజిని, శశిరేఖ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అండర్-14 జాతీయ క్రికెట్ జట్టుకు భద్రాద్రి కుర్రోడు రిత్విక్



**ప్రజాపక్షం/భద్రాచలం :** అండర్ 14 జాతీయ క్రికెట్ జట్టుకు భద్రాచలానికి చెందిన కుర్రోడు రిత్విక్ ఎంపికయ్యాడు. ఈ ఎంపికలు గద్వాల్ జిల్లా కేంద్రంలో జరిగాయి. ఇందుకోసం మొత్తం నాలుగు మ్యాచ్‌లు నిర్వహించగా రిత్విక్ బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సెలక్టర్లు మొదటి రౌండ్‌లోనే ఎంపిక చేశారు. క్రికెట్ మీద మక్కువ ఉన్న రిత్విక్ భద్రాచలంలోని బెస్ట్ క్రికెట్ అకాడమిలో సాయితేజ (తేజ), ఆనంద్ పాల్(బుజ్జి) ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. రిత్విక్ చిన్న నాటి నుండే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకోవడంతో తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. ఆటలతో పాటు చదవుల్లోనూ చురుగా ఉండే రిత్విక్ పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నాడు. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలానికి చెందిన రిత్విక్ అండర్14 జాతీయ జట్టులో చోటు సంపాదించడంపై తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, కుటుంబీకులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ ఎ.సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. డ్రైనేజి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వీధి లైట్లు, మంచినీరు, తదితర సమస్యలపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువు ఎలా అని, ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వం చేస్తున్న జాప్యం సరికాదని, గత మూడు విద్యా సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిల విడుదల లేక విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఇబ్బందులు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేటు డిగ్రీ, పిజి ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఫీజు బకాయి లు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసిన ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడం బాధాకరమన్నారు. గత ప్రభు త్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేస్తామ ని చెప్పిన ఆనాటి పిసిసి అధ్యక్షుడు నేడు కాంగ్రేస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఇప్పటికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యాశాఖ కూడా తన వద్దే పెట్టుకొని నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం సరికాదని, వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వరక అజిత్, షాహిద్, గుగులోతు వంశీ, పవన్‌సాయి, సృజన్, బానోతు శ్రీను, విజయ్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలపై కూనంనేని 'ప్రత్యేక దృష్టి'

నియోజకవర్గానికి మంజూరైన ఇఎస్ఐ ఆసుపత్రి

పాల్వంచ ఆసుపత్రి వంద పడకలకు 'అప్‌గ్రేడ్'

కొత్తగూడెం ఆసుపత్రికి మరో ఐదు డయాలసిస్ మిషన్‌లు



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలలపై ప్రత్యేక దృష్టి సారించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆసుపత్రుల్లో కావాల్సిన మౌలిక వసతులు వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ, భవనాలు వంటి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం చేస్తున్న కృషి ఫలితాన్ని ఇస్తుంది. ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం 50 పడకల ఆసుపత్రిగా కొనసాగుతుండగా రోగుల సంఖ్యకు అనుగుణంగా వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని పలుమార్లు సంబంధిత మంత్రులపై ఒత్తిడి తెచ్చి సంప్రదింపులు జరిపిన ఫలితంగా వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు అమనుతులు లభించాయి. అదేవిధంగా కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రిలో ఐదు డయాలసిస్ మిషన్‌లు అందుబాటులో ఉండగా మరో పది మిషన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరడంతో మొదటి విడతగా ఐదు మిషన్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో కొత్తగూడెం ఆసుపత్రిలో పది మిషన్లు డయాలసిస్ రోగులకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా, నియోజకవర్గ కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, పలుమార్లు సంబంధిత మంత్రులపై ఒత్తిడి తెచ్చిన ఫలితంగా ఈ ఆసుపత్రి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసిన ప్రభుత్వం అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఆసుపత్రుల్లో మందుల, వైద్య పరికరాల కొరతను గుర్తించి సంబంధిత ప్రతిపాదనలు, వైద్యశాఖకు సమర్పించడంతో వాటిని సమకూర్చేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి జరుగుఉతుందని, పేదలకు మెరుగైన ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. పాల్వంచ ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ కొత్తగూడెం ఆసుపత్రిలో దయాలసిస్ మిషన్లు పెంపు, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు తదితర అనుమతులు లభించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు.

## పంట నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలి : సిపిఐ



**ప్రజాపక్షం/ బోనకల్ :** నదీ పరీవాహక ప్రాంతంలో పంట నష్ట సమగ్ర సర్వే చేపట్టాలని సిపిఐ జిల్లా నాయకులు కొంగర రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో పంట నష్టపరిహారంపై జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరివాహక ప్రాంతమైన రాపల్లి, బ్రాహ్మణపల్లి, జానకిపురం, చిన్నబీరవల్లి, కలకోట గ్రామాల్లో వాగు సమీపంలో ముంపు గురై వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయన్నారు. గ్రామాల్లో ఎఈఓలు సక్రమంగా సమగ్ర పంట నష్ట సర్వే చేపట్టకపోవడంతో అర్హులైన రైతులు నష్టపోయారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరల పంట నష్టంపై సర్వే చేపట్టి అర్హులైన వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రామారావు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు ఏలూరి రమేష్, వంగా సురేష్, కొంగర కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులను, ప్రజాప్రతినిధులకు, నాయకులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించి కల్యాణలక్ష్మి చెక్కులు, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారుల ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యన్నపాలెం సీతాయకుడు గ్రామాల మధ్య ఎన్న ఎదుళ్లవాకపై బ్రిడ్జి నిర్మాణం త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, సమస్య తెలిసిన వెంటనే పరిష్కార చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అశోక్, ఆర్ఐ అక్బర్, నాయకులు గోవింద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బొజ్యానాయక్, సారేపల్లి శేఖర్, గాదె శివప్రసాద్, రసూల్, ఇస్లావత్ రుక్మిణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే పాయం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీపురం, నకిరిపేట, గ్రామ పంచాయితీల పరిధిలో సిసి రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్ష్మీపురం గ్రామంలో సిసి రోడ్లు ప్రారంభించిన అనంతరం గ్రామస్తులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పలు సిసి డ్రైన్లు, విద్యుత్ స్తంభాల కొరత వంటి విషయాలను ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణమే పంచాయితీరాజ్ అధికారి డి.వెంకటేశ్వరరావును సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్‌లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లక్ష్మీపురం పలు గ్రామాలకు ప్రధాన కూడలి అయినందున ఆర్టీసీ బస్సులు, ఎక్స్ప్రెస్ బస్సులు ఆగడం లేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భద్రాచలం డిపో మేనేజర్‌ను క్ష్మీపురంలో రిక్వెస్ట్ స్టాఫ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### టేకులచెరువు గ్రామం సమస్యలు పరిష్కరించండి

గ్రామంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా నాయకులు పాండవుల బిక్షం అన్నారు. బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటనలో భాగంగా ఆయనకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా గ్రామంలో సిసి రోడ్లు, విద్యుత్, గ్రావెల్ రోడ్లు, పుల్లమ్మ వాగుపై వంతెన నిర్మాణం, అంగన్వాడీ స్కూల్ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన పాయం సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు భూక్య శ్రీను, తొట్ల ప్రభాకర్, టిడిపి నాయకులు మీడిదొడ్ల వెంకటేశ్వర్లు, నాయకులు తోడేటి వేణు, పాండవుల ప్రభాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపరిహారం అందించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/బోనకల్ :** బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన అనేకమంది రైతులకు పంట నష్టపరిహారం అందించలేదని, తమకు పంట నష్టపరిహారం అందించాలని కోరుతూ రైతులు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. సర్వే అధికారుల నిర్లక్ష్యంగా సర్వే చేయటంతో అనేకమంది రైతులకు పంటనష్టపరిహారం రాలేదని, ఎఈఓ పక్షపాతంగా వ్యవహరించి పంట నష్టంజరిగిన అసలైన రైతులను విస్మరించి పంట సాగు చేయని వారికి నష్టపరిహారం అందించారన్నారు. విచారణ చేపట్టి పంట నష్టపోయి న రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సత్తుపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ సాధారణ 43వ సమావేశం బుధవారం సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సత్తుపల్లి మున్సిపాలిటీ 23 వార్డుల్లో శానిటరీవర్క్, పారిశుద్ధ్య నీటి సరఫరా విభాగాలపై చర్చించి చేపట్టబోయే ప్రణాళికలను వివరించారు. సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ఎం.రవిబాబు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ తోట సుజలారాణి, వార్డు కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, గ్రాండ్ మౌలాలి, ఎస్కే చాంద్ బాషా, గుండ్ర రఘు, నడ్డి జమలమ్మ, అమరవరపు విజయనిర్మల, కంటే నాగలక్ష్మి, సలీమా ఖాతూమ్, కోఆప్షన్ సభ్యురాలు చింతల రమాదేవి, మున్సిపల్ వార్డు ఇన్చార్జీలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను రక్షిద్దాం



**ప్రజాపక్షం/మధిర :** ఆడపిల్లల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త నంద్యాల హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దెందుకూరులోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల చిన్నారులతో ముచ్చట్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై, ఆడ పిల్లల రక్షణపై వివరించారు. ప్రతిఒక్కరూ ఆడపిల్లల పట్ల బాధ్యతయుతంగా ఉంటూ వారు చదువుకునేందుకు ప్రోత్సహించాలని, కార్యక్రమంలో మహాదేవపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఐశ్వర్య, హెచ్ఎం డి.శ్యామలరావు, బయాలజీ టీచర్ వివిఎల్పి కుమారి, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనలో యువత ముందుండాలి




**ప్రజాపక్షం/కూసుమంచి :** డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు యువత ముందుండాలని కూసుమంచి ఎస్ఐ నాగరాజు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జలగం వెంగళరావు జూనియర్ ప్రైవేట్ కళాశాలలో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం యువత భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు అన్నారు. మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయిలను సేవించవద్దని అవి సేవించినట్లయితే వ్యక్తిగత ఆరోగ్యాలకే కాకుండా భవిష్యత్తుకు ప్రమాదమేనని విద్యార్థులను చైతన్య పరిచారు. మత్తు పదార్థాలు సేవించిన వారి జీవితాలు ఎలా ఆగమైపోయాయో విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ ప్రమాదం గురించి తెలుసుకోవడానికి వివిధ రూపాల్లో సినిమాలలో ద్వారా కూడా చైతన్యం కావచ్చని విద్యార్థులకు సూచించారు. డ్రగ్ లాంటి మత్తు పదార్థాలు ఉత్పత్తి చేసిన, రవాణా చేసిన, వ్యాపారం చేసిన, సేవించిన ఉపేక్షించేది ఉండదని, ఏకంగా పది సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా డ్రగ్స్ వ్యాపారం చేసిన సేవించిన ఉత్పత్తి చేసిన తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, అధ్యాపకులు విజయ కుమారి, మంగీలాల్, భార్గవ్, బోటనీ, వీరభద్ర రావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో కోతుల బీభత్సం

ఇద్దరు బాలికలకు గాయాలు

**ప్రజాపక్షం/పెనుబల్లి :** కోతుల బీభత్సంతో ఇద్దరు విద్యార్థినులు గాయపడిన సంఘటన మండలంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలో గల మోడల్ పాఠశాలలో బుధవారం కోతుల మంద విద్యార్థినుల మీదకు రావటంతో బాలికలు భయపడి కోతుల నుండి తప్పించుకునేందుకు మెట్ల మీద నుండి కిందకు పరుగులు పెట్టారు. అయినా కోతులు విద్యార్థులపై దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరి విద్యార్థినిలకు గాయాలు కావటంతో పాఠశాల సిబ్బంది పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలలో వరుసగా పలు దేవాలయాలలో చోరీలకు పాల్పడుతూ వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దొంగతనానికి ప్రయత్నిస్తుండగా అనుమానంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం రాత్రి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించి విచారించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏసీపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపి అనిశెట్టి రఘు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామ మండలం పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ఎల్లబోయిన గోపి, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ, కిట్టు వీరితో పాటు బాల నేరస్తుడు, వీరంతా ముఠాగా ఏర్పడి, టూ వీలర్లపై తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసలై మధిర, బోనకల్లు , వత్సవాయి, పలుచోట్ల చోరీలకు పాల్పడుతూ, ఆగస్టు 18 న అచ్చంపేట లో సత్తెమ్మ తల్లి గుడిలో దొంగిలించిన సూత్రాలు, హుండీ లో నగదు, ఆగస్టు 28 వ తేదీ రాత్రి వేంసూరు మండలం వెంకటాపురం దేవాలయం తో పాటు పలు దేవాలయాల్లో దొంగిలించిన హుండీలో నగదు, వెండి వస్తువులు, కిరీటాలు, సూత్రాలు, కరిగించగా వచ్చిన నగదు 20 వేలు, హుండీలో దొంగిలించిన 1 లక్ష యాభై వేల రూపాయల నగదు, 3.3 కిలోల వెండి, దొంగతనానికి ఉపయోగించిన 220 పల్సర్ బైక్ లు 2 ను స్వాధీనం చేసుకొని నిందితులు ఆరుగురిని సత్తుపల్లి కోర్టులో హాజరపరిచి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. గతంలో వీరి పై పలు పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదైనట్లు ఏసిపి రఘు తెలిపారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా విచారణ జరిపి నిందితులను రిమాండ్ కు తరలించిన సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగయ్య, పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్ , వేంసూరు ఎస్సై వీరప్రసాద్, పోలీస్ సిబ్బందికి ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్‌దత్ సిబ్బందికి రివార్డు అందించి, అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో... నేడు గవర్నర్ పర్యటన

**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. తొలిసారిగా ఆయన పర్యటనను పురస్కరించుకుని ఇరు జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యపేట జిల్లా నుండి నేటి సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐటిసి పిఎస్‌పిడి అతిథి గృహానికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు శుక్రవారం ఉ.8.10 నిమిషాలకు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడె ంజిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఉ.9 గం నుండి 11 గం. వరకు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఎంపిక చేసిన 25 మంది ప్రముఖ రచయితలు, కళాకారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలతో భేటి అవుతారు. అక్కడి నుండి మధ్యాహ్నం 1 గం.కు ఖమ్మంలోని ఎన్ఎస్‌పి గెస్ట్‌హౌస్‌కు గవర్నర్ చేరుకుంటారు. అనంతరం మ.2 గం.లకు ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకుని గంటపాటు జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఎంపిక చేసిన 25 మంది ప్రముఖ రచయితలు, కళాకారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలతో గవర్నర్ సమావేశం కానున్నారు. గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పోలీసులు సైతం భారీ బందోబస్తు నిర్వహించున్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే కేసులు నమోదు చేయండి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : నేర ఆరోపణతో వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే కేసు నమోదు చేయాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పరకాల ఎసిపి కిశోర్, ఇన్స్‌స్పెక్టర్ సంతోష్ మొక్కను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసుల గౌరవ వందనం చేశారు. సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరుచేసిన కిట్ ఆర్టికల్స్‌ను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ ముందుగా రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగి కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు కోర్టులో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబంధించిన ధర్యాప్తు వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టరు సంతోష్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. పోలీస్‌కమిషనర్ చేతులమీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కను నాటారు. ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, పరకాల ఎసిపి కిషోర్ కుమార్, ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, ఎస్. ఐ పరమేశ్వర్ తో ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భువన్ యాప్ ద్వారా అసెస్‌మెంటు నమోదు వేగం పెంచండి

బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: భువన్ ఆప్ ద్వారా అసెస్‌మెంటు నమోదు వేగం పెంచాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నరు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ బుధవారం డిప్యూటీ కమిషనర్‌తో భువన్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నమోదు పరిశీలనపై సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భువన్ ఆప్ ద్వారా అసెస్‌మెంట్ల నమోదు తీరును ఆన్‌లైన్ ద్వారా పరిశీలించిన కమిషనర్ అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రతీ రోజు 150 దరఖాస్తులు భువన్ ఆప్ ద్వారా నమోదు చేసేలా చూడాలన్నారు. ప్రస్తుతం సుమారు 40 వేల దరఖాస్తులు నమోదు లక్ష్యంగా ఉన్నాని నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా డిప్యూటీ కమిషనర్లు నిత్యం పర్యవేక్షించి వేగంగా చర్యలు చేపట్టాలన్నరు. డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కళాకారుల జిల్లా కన్వీనర్‌గా గడ్డం స్వరూప ఎన్నిక



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ ఉద్యమ ఫోరం కళాకారుల విభాగం జిల్లా కన్వీనర్ గా గడ్డం స్వరూపను ఎన్నికున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ రావు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గడ్డం స్వరూప మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కారం కోసం కష్ట పడుతానని, ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. నా ఎన్నికకు సహకరించిన రాష్ట కార్యదర్శి సురేందర్ రెడ్డి, కన్వీనర్ యోల్ల పోశెట్టి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గడ్డం సుధాకర్ లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మట్టెవాడ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఐఎంఎ హాలులో ఎంజిఎం రక్తనిధి సహకారంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్టెవాడ, ఇంతెజార్ గంజ్, మిల్స్ కాలనీ పోలీసుస్టేషన్ల పరిధిలోని యువకులు, పోలీసులు ఉత్సాహంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి డిసిపి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పండ్లు, హెల్దీ డ్రింక్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎసిపి నందిరాంనాయక్, ఇన్స్పెక్టర్లు తుమ్మ గోపి, సుమార్, వెంకటరత్నం,ఎంజిఎం రక్తనిధి ఇన్‌ఛార్జి మేరీ, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు విజయోస్తు : కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: పదో తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఓరియెంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించడం జరిగింది. ఆ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విజయోస్తు కార్యక్రమాన్ని రూపకల్పన చేశామన్నారు. చదువుతోపాటు ప్రతి విద్యార్థికి మంచి పౌష్టికాహారం అందేలా ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలన్నారు. జాతీయ సాధన సర్వేలో అందరు విద్యార్థులు పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కె రాము, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కె రవికుమార్, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ జి చంద్రభాను, తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు క్రీడల్లో ప్రతిభను చాటాలి

హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం/ కమలాపూర్: బాలికలు వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభను చాటాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాలల అండర్ 17 బాలికల క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై ముందుగా మహాత్మా జ్యోతిభా పూలే, సావిత్రి బాయి పూలేల చిత్రపటాలకి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడాపోటీల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకోని జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ క్రీడాజ్యోతిని వెలిగించి జిల్లాస్థాయి క్రీడాపోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలకు చెందిన క్రీడాకారిణులు క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ. .ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 పాఠశాలలకు చెందిన 600కుపైగా మంది విద్యార్థినీలు పాల్గొనడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జిల్లా స్థాయి క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తుండడం అభినందనీయమని, క్రీడల్లో బాలికలు క్రీడా స్ఫూర్తిని చాటాలని పేర్కొన్నారు. గత నెలలో ఇదే పాఠశాలలు హాస్టల్‌లో నిద్ర చేసినప్పుడు విద్యార్థినీలు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం తాను గమనించానని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుతెచ్చుకున్న నిఖత్ జరీన్, దీప్తి జీవంజీలను బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. బాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వరంగల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు యోగసానాలను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వర్ధన్నపేట, తిమ్మాపూర్, గాంధీనగర్ పాఠశాలల విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపిడిఒ గుండె బాబు, మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ వెంకట ప్రసాద్, కమలాపూర్ పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, ఇతర పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఓదెల మల్లయ్య, ఉపాధ్యాయులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని విధాలా సదుపాయాలు కల్పిస్తాం

మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: నరకాసుర వధ ఉత్సవాలను ప్రజలు వీక్షించడానికి అన్ని విధాలసదుపాయాలు ఏర్పాటుచేయిస్తామని దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఉర్సు గుట్ట వద్ద ఈనెల 30న దీపావళి పండుగ సందర్భంగా నరక చతుర్దశి రోజున జరిగే నరకాసుర వధ ఉత్సవాలను అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బుధవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందచేశారు. నరకాసుర వధ కార్యక్రమానికి విద్యుత్ అలంకరణ చేపట్టాలని, శాంతి భద్రతల పరిరక్షించడానికి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయించాలని మంత్రిని కోరారు. మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా విచ్చేసి నరకాసుర వధ చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శతపతి శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, కార్యనిర్వహక కార్యదర్శి వనం కుమార్, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, అన్న కుమారస్వామి, మరుపల్ల శివ, తౌటం నర్సింహ, దాసరి రాజు ఉన్నారు.

## ప్రధానమంత్రి ఉపాధి కల్పనపై అవగాహన

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: కెవిఐబి, డిఐసి, ఎల్‌డిఎం అధికారుల సమక్షంలో ములుగు జిల్లాలోని ఎస్‌పి కార్పొరేషన్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్, రాష్ట్ర కార్యాలయం తెలంగాణ అధికారులు ప్రధానమంత్రి ఉపాధి కల్పనపై అవగాహనను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి కమిషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ మండలాలకు చెందిన అనేక మంది భావి పారిశ్రామికవేత్తలు, నిరుద్యోగ యువకులు, ఎస్‌హెచ్‌జిలు ప్రభు త్వం ద్వారా సబ్సిడీ రుణ పథకం గురించి అవగాహన, సమాచారంతో కూడిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. . ఈ కార్యక్రమం పథకంపై సమగ్ర అవగాహనను అందించడమే కాకుండా మన యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల భవిష్యత్తును రూపొందించడంలో ఈ పథ కం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేశారు. అవగాహన సదస్సులో ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్, రాష్ట్ర కార్యాలయం, తెలంగాణ కార్యాలయం నుండి అశిష్‌కుమార్ యాదవ్, వినయ్ బిట్ల, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:ఖరీఫ్ 2024–25 వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం 2024–25 ధాన్యం కొనుగోళ్లపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌ఏ గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 సన్న రకానికి అదనంగా రూ.500 చెల్లించడం జరుగుతుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల యందు సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రంలో సన్న ధాన్యం నింపు గోనే సంచులకు ఎర్రదారంతో కుట్టి వేయాలని, సన్న ధాన్యం దొడ్డు ధాన్యం వేర్వేరు లారీలలో నింపి రైస్ మిల్లులకు రవాణా చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహాకులు అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా వరి ధాన్యం సేకరణ జరగాలని అన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తిన రైతులు 9347416178 తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇన్‌చార్జి సంపత్‌రావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి సర్దార్‌సింగ్, డిసిఎస్ఓ షా ఫైజుల్ హుస్సేని, డిఎంసిఎస్ రాంపతి, ఎఫ్‌సిఐ డివిజనల్ మేనేజర్ ప్రకార్ వర్మ, జిల్లా వ్యవసాయాధికారి సురేష్‌కుమార్, ఎంవిఐ కిషోర్ బాబు, ఎల్డిం జయ ప్రకాష్, తహసీల్దార్లు, ఐకెపి జిసిసి లీగల్ మెట్రాలజీ కార్మికశాఖ రవాణా శాఖ రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్లు వివిధ సెంటర్‌ల ఇన్‌చార్జిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ మహిళా సంఘాల పనితీరు పరిశీలన



ప్రజాపక్షం/నెక్కొండ: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం, మహిళా సంఘాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించడం కోసం ఎం ఎల్ ఎమ్ టీం సభ్యులు జయప్రకాష్ బుధవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని, నెక్కొండ, గొల్లపల్లి, గుండ్లపల్లి, గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాలలో మహిళా సంఘాల సభ్యులు తెలంగాణ కు ప్రతీకైన బతుకమ్మలతో కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. మహిళా సంఘాల అభివృద్ధి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నెక్కొండ మహిళా సంఘాల సభ్యులు వారి అనుభవాలను వారు ఏ క్రమంలో అభివృద్ధి చెందాము కళ్లకు కట్టినట్టుగా కమిటీ సభ్యులు వివరించారు. మహిళా సంఘాల ఏర్పాటుకు ముందు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొనే చిన్న కుటుంబాలని ప్రైవేట్ వ్యక్తు వద్ద అప్పులు తెచ్చి తిప్పలు పడేవారమని, మేము పదిమంది సభ్యులు గ్రూప్గా ఏర్పడి 5వేల నుండి 10 వేలు పొందుచు,నేడు ఒక సభ్యురాలు లక్ష నుండి ఆపైన రుణాలు ఎత్తుకొని చెల్లిస్తున్నామని, బ్యాంకుల ఉనికి కోల్పోయే స్థితిలోకి వెళ్లే క్రమంలో మహిళా సంఘాల రుణాలు, పొదుపులు, లావాదేవీలు కోట్ల రూపాయలలో బ్యాంకులలో జరుగుతున్నాయని, దీంతో బ్యాంకులు నిత్యం కళకళలాడుతున్నాయని, అపూర్వమైన పరిస్థితి ఏర్పడిందని ఇందుకు మహిళా సంఘాలు బ్యాంకులలో చేస్తున్న లావాదేవీలే కారణమని, మహిళా సంఘాల ప్రతినిధులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు, వైకుంఠ దామాలు, కమిటీ సభ్యులు పరిశీలించారు. డిపియం బావని, ఎంపీడీవో ప్రవీణ్ కుమా ర్, ఏపిఎం శ్రీనివాస్, ఉపాధి హామీ ఎపిఓ జాకబ్,యం పిఓ సునిల్ కుమార్ , వెలుగు సిసిలు రవీందర్, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెం ట్లు మండల సమైక్య అధ్యక్షురాలు లావణ్య వివో లు లీడర్లు, సంఘ స భ్యులు, నెక్కొండ, గుంద్రపల్లి, గొల్లపల్లి, పంచాయతీ కార్యదర్శులు, సదానందం, పాల్గొన్నారు.

## సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాపక్షం/జనగామ టౌన్: అన్ని సామాజిక వర్గాల విశ్వేషణ సర్వే ను పకడ్బందీగా చేపట్టాలని బిసి కమిషన్ చైర్మన్ సి నిరంజన్ తెలిపారు. బుధవారం హై దరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయం నుండి బిసి కమిషనర్ సభ్య కార్యదర్శి బాలమాయ దేవి అధ్యక్షతన గూగుల్ జూమ్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది అన్ని వర్గాలకు చెందిన సర్వే అని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు సీఎం తెలిపినట్లు తెలిపారు. గ్రామాలలో సామాజిక ఆర్థిక రాజకీయ విశ్లేషణ సర్వేపై అవగాహన పరుచాలని కలెక్టర్లకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమాధికారి రవీందర్ పాల్గొన్నారు.

## ఐకెపి సెంటర్లు ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: జనగామ మార్కెట్‌లో పత్తి యార్డులో, ఎర్రకుంటా తండాలో ఐకెపి సెంటర్‌లలో ముఖ్య అతిథిగా విచ్చేసి జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. వారు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని తగు నాణ్యతను పాటిస్తూ ప్రభుత్వ మద్దతు ధరను పొందాల్సిందిగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ చెంచారపు బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ కొల్లూరి నరసింహులు, డైరక్టర్లు మోహన్, నరసింహరావు, శ్రీలతరెడ్డి, శ్రీనివాస్, బన్సీ, కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుపై అవగాహన

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాల యంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2024–25 వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా పౌర సరఫరాల సంస్థ, శాఖ ఆధ్వర్యంలో మార్కెటింగ్, సహకార, డిఆర్‌డిఒ, వ్యవసాయ, తూనికలు, కొలతలు శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సన్న మరియు దొడ్డు రకం ధాన్యాలను సకాలంలో, వేరువేరు కౌంటర్ల ద్వారా కొనుగోలు చేయడానికి కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనీ, రకాలను గుర్తు పట్టేందుకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తు చర్యలతో పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షణను మండల, జిల్లా అధికారులు పర్యవేక్షణకు నియమించనున్నట్లు తెలిపారు. రవాణాకు ఓపిఎంఎస్ ఎలాంటి తప్పులు లేకుండా నమోదులు చేయాలని పేర్కొన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం గుర్తించడానికి వీలుగా పరికరాలు ద్వారా పరిశీలన చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు నూతనంగా అందుబాటులోకి తెచ్చిన సాఫ్ట్ వేర్ ను డౌన్లోడ్ చేసుకొవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేసిన మిల్లులకు రవాణా చేయాలని ఆయన ఆదేశించారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా ఎతైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సన్న, దొడ్డు రకాలు గుర్తించడం, కొనుగోళ్లలో పాటించాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనుక శేఖర్, డిఆర్‌డిఓ అవినాష్, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, తూనికల కొలతలు శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

## బాణాసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి

డిసిపి రాజ మహేంద్రనాయక్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: దీపావళి పండుగ పురస్కరించుకుని ముందస్తు చర్యలలో భాగంగా వరంగల్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో బాణాసంచా దుకాణదారులు, రిటైల్ షాపుల ఓనర్లు, గోడౌన్ ఓనర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డిసిపి రాజ మహేంద్రనాయక్ మాట్లాడుతూ ఎవరైనా దుకాణదారులు బాణాసంచాలను అనుమతి లేకుండా విక్రయిస్తే వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోబడునన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపి పార్థసారథి, ఘనపూర్ ఎసిపి భీమ్ శర్మ, జిల్లా ఫైర్ ఆఫీసర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఘనపూర్, ఫైర్ సిబ్బంది, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట



ప్రజాపక్షం/గణపురం:ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధ్యానతా అని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్తన్న అన్నారు. బుధవారం సాయంత్రం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్ మరియు కళాశాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు. ముందుగా ఎమ్మెల్యేకు విద్యార్థులు, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతీ ఒక్క తరగతి గదిని పరిశీలిస్తూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గణపురం మోడల్ స్కూల్ కు ఎస్డీఎఫ్ నిధుల నుండి రూ.14 లక్షలు,అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల నుండి మరో రూ.10 లక్షలు కలుపుకుని మొత్తం రూ.24 లక్షలు వివిధ అభివృద్ధి పనుల కొరకు ఇచ్చినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కనబోయిన కుమార్ యాదవ్, గణపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, కో ఆప్షన్ మెంబర్ చోటే మియా, గ్రామ శాఖ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కాజీపేట : కాజీపేట ప్రాంత ప్రజల చిరకాలవాంఛ అయిన కాజీపేట డివిజన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. బుధవారం కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఎంపి కడియం కావ్య సందర్శించి రైల్వే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ పార్లమెంటు పరిధిలో కొనసాగతున్న రైల్వే పాజెక్టులు, రైల్వే లైన్ల అభవృద్ధి, కొత్తరైళ్ల ప్రతిపాదనలు, వ్యాగన్ వర్క్‌షాప్ నమూనాలు, నిర్మాణ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. మొదటి ప్లాట్‌ఫారంలోని ప్రయాణికుల విశ్రాంతి గదిని సందర్శించి పనులను పరిశీలించారు. అనంతరం రైల్వే స్టేషన్ ముందు విలెకరులతో మాట్లాడుతూ ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌లో రైళ్ల రద్దీ పెరుగుతొందని రైళ్ల హల్టింగ్, క్రాసింగ్‌లతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగడంతో ప్రయాణికులు ఇబ్బందుల పడుతున్నారని, ఈ సమస్యకు అదిగమించేందకు మరికొన్ని ప్లాట్‌ఫారంలను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేక విశ్రాంత గదులతో పాటు మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. డీజిల్ కాలనీలో తాగునీటి సమస్యను అరికట్టెందుకు రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మరో 6 నెలల్లో పనులను పూర్తి చేసి రైల్వే పరిశ్రమ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారని అన్నారు. కాజీపేటలో నిర్మిస్తున్న అదనపు వంతెనను ఫిబ్రవరిలో పూర్తి చేసి మార్చినెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం రైల్వే పాలీక్లినిక్‌ను సందర్శించారు రోగులకు మెరుగైన వైద్యం అందిచాని వైద్యులను కోరారు. స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవిందర్ యాదవ్, విజయశ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్‌లు అబూబక్కర్, గుంటి కు మారస్వామి, రైల్వే అధికారులు లక్ష్మీ నారయణ, డిఎల్ఎస్ సీనియర్ డిఎన్ వెంకట్, డిఎల్ఎస్ సిడిఎంఈ అనికేత్, ఎడిఎన్ నార్త్ రామరాజు, ఎస్ఎస్‌సి సత్యరావు, రైల్వేఅధికారులుతదితరులుపాల్గొన్నారు.



# లీగల్ నోటీసులకు భయపడబోం

## కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/హైదరాబాద్



రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేని మాజీ మంత్రి కెటిఆర్ తనను లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కెటిఆర్ తనకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూశానని, ఆయన లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు..తాటాకు చప్పళ్లకు భయపడబోమని, ముందుగా తనపై వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కెటిఆరే అని తెలిపారు. అందుకే బదులుగానే తాను మాట్లాడానని, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో కెటిఆర్ భాగోతమంతా ప్రజలకు తెలుసు అని అన్నారు. ఇప్పటి వరకు తను మాటకు మాటతోనే బదులిచ్చానని, ఇక మీదట లీగల్ నోటీసులకు నోటీసులతోనే జవాబు ఇస్తామని తెలిపారు. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులమని చట్టం, న్యాయం ప్రకారమే ముందుకు వెళ్లుతామని కేంద్ర మంత్రి వెల్లడించారు.

### లీగల్ నోటీసులు కెటిఆర్ రాజకీయ జీవితానికి సమాధి : బిజెపి నాయకులు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కెటిఆర్ లీగల్ నోటీసుల అంశంపై బిజెపి నాయకులు ధీటుగా స్పందించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, బిజెపి ఎస్‌సి మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌లు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాణి రుద్రమరెడ్డి మాట్లాడుతూ కెటిఆర్ .లీగల్ నోటీసులే నీ రాజకీయ జీవితానికి సమాధి అవుతుందన్నారు. జీవితమే పోరాటంగా, ప్రజాహక్కుల కోసం పోరాడుతూ రాజకీయం చేసేవారు బిజెపి నాయకులు కెటిఆర్ నోటీసులకు భయపడబోరని, ఇప్పటికైనా ఆయన తన నోరును అదుపులో పెట్టుకుని మంచిందని, తాము తలుచుకుంటే ఆయన భవిష్యత్ మొత్తం నోటీసులు చదువుకోవడానికే సరిపోతుందని హెచ్చరించారు. ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో నోటీసులే సమాధానమైతే ఆయన వంద నోటీసులు, ఆయన నాన్న కెసిఆర్‌కు వెయ్యి నోటీసులు పంపాల్సి ఉంటుందన్నారు. కెటిఆర్ ఆట మీరు మొదలుపెట్టారని, తాము ముగింపు ఇస్తామన్నారు. కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బండి సంజయ్ ను ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టారో ప్రజలందరికీ తెలుసు అని అన్నారు. సాక్షాత్తు ఎంపీ కార్యాలయంలో ఉండగా పోలీసులను పంపి ఆఫీస్ గేట్లు బద్దలు కొట్టించి బండి సంజయ్ ను ఈడ్చుకుపోయి అరెస్ట్ చేసి అవమానించిన దుర్మార్గాన్ని ప్రజలింకా మర్చిపోలేదని వీటన్నింటికి త్వరలోనే బదులు ఇస్తామన్నారు.

# కులమతాలు ఐచ్ఛికమే వెల్లడి : వ్యక్తుల అభీష్టమే ప్రభుత్వ ఆదేశాలు

## దీనిపై విడిగా ఉత్తర్వులు అవసరమే లేదు

## తీర్పు వెలువరించిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజ్యాంగం ప్రకారం కులం, మతం అన్నవి ఇచ్ఛికం. వాటిని బహిర్గం చేయాలని లేదు. వెల్లడించాలనే రూల్ లేదు. జనాభా లెక్కల సేకరణ సమయంలో వాటిని వెల్లడించే స్వేచ్ఛ భారతీయ జనాభా కమిషన్ ప్రజలకు ఇచ్చింది. కులం, మతం వెల్లడించాలో లే దో అనేది పిటిషనర్ల ఇష్టం. విద్యాపరమైన ప్రవేశాల సమయంలో వెల్లడించకపోతే వాళ్లను నిరాకరించరాదని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. కాబట్టి కులమతాల కాలమ్స్ లేకుండా అప్లికేషన్లను స్వీకరించడం లేదనే వారి వివరాలు లేవు కాబట్టి విద్య, ఉపాధి కల్పన దరఖాస్తులను వాటి ప్రస్తావన లేకుండా గైడ్లైన్స్ జారీ చేయాలనే పిల్లో జోక్యానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ప్రభుత్వ ఉత్తర్వుల్లోనే వాటి వెల్లడి ఐచ్ఛికమని స్పష్టంగా ఉంది.కులమతాల వివరాలు వెల్లడించకుండా విడిగా ఒక కాలమ్ ఉండేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలంటూ డీవీ రామకృష్ణానావు మరొకరు 2017లో వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణను మూసివేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.కుల, మతాల వివరాలను వెల్లడించడమన్నది ఆయా వక్తులు ఇష్టానుసారమే ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది. ఏ మతంపై విశ్వాసం లేని వ్యక్తి మతం గురించి చెప్పాల్సిన అవసరం లేదంది. కుల, మతాలను వెల్లడించలేదన్న కారణంగా పాఠశాలల్లో అడ్మిషన్లు నిరాకరించరాదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు స్పష్టం చేసిందని గుర్తు చేసింది. అందువల్ల కుల, మతాల ప్రస్తావన లేని దరఖాస్తుల రూపకల్పనపై ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం లేదంది. దీనికి సంబంధించిన ప్పి విచారణను ముగించింది.సెయింట్ ఆన్స్ పాఠశాల కులం, మతం వివరాలు లేకుండా పిల్లల అడ్మిషన్ దరఖాస్తును స్వీకరించకపోవడంతో పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు పొందారని పేర్కొంది. అనంతరం ఇదే అంశంపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారంది. కులం, మతం వివరాలు వెల్లడించకుండా అడ్మిషన్లు నిరాకరించారన్న వారి వివరాలను పిటిషనర్ సమర్పించలేదంది. టీసీ, అడ్మిషన్ దరఖాస్తుల్లో వాటి గురించి వెల్లడించడమన్నది వారి ఇష్టాన్నిబట్టి ఉంటుందని, ఇష్టం లేకపోతే 'నిల్' అని రాయవచ్చని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్వర్వులు జారీ చేసిందని, పదో తరగతి సర్టిఫికెట్లో కుల, మతాల ప్రస్తావన లేదని ప్రభుత్వం వెల్లడించిందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతోపాటు డాక్టర్ రంజీత్ సూర్యకాంత్ మోహితె కేసులో ఎవరికైనా ఏ మతంపైనా విశ్వాసం లేదని, ఏ మతాన్ని అనుసరించడంలేదని చెప్పే హక్కు ఉందని బాంబే హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. కుల, మతాల ప్రస్తావన అవసరంలేదన్న ప్రజల వివరాలు లేకుండా ఉత్తర్వులు ఇవ్వలేమంటూ పిటిష్ప విచారణను మూసివేసింది.

# పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం సరికాదు

## హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఎంఎల్ఎల పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం కాంగ్రెస్, రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఎంఎల్ఎలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నామని స్వయంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారన్నారు. ఇతర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చేందుకు రాజ్యాంగాన్ని కాపాడుతున్నానని చెప్పుకుంటూ, అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేయడం రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని హరీశ్ రావు బుధవారం పేర్కొన్నారు.

# హైకోర్టు నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సర్వే చేశాక అక్రమణలను గుర్తించాలని,ఆతర్వాత ఆక్రమణదారులకు గడువుతో కూడిన నోటీసులు ఇచ్చాకే ఆక్రమణలను గుర్తించి కూల్చివేత చర్యలు ఉండాలంటూ ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ వేసిన పిల్ను హైకోర్ట బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. పాల్ వాదిస్తూ, భవనాలను కూల్చివేయకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. బాధితులకు నోటీసులు జారీ చేయాలని, వారు ఇళ్లు ఖాళీ చేయడానికి లేదా కోర్టుల్లో కేసులు వేసేందుకు సమయంఉండేలా నోటీసులు ఉండాలని కోరారు. పేదలను గుర్తించి పునరావాసం క ల్పించాలని కోరారు. మూసీ రివర్బెడ్లో నిర్మాణాల కూల్చివేతలకు ముందు అధికారులు ఆ ఇళ్లకు మార్కింగ్‌చేశాక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, బాధితులకు పునరావాస చర్యలు తీసుకుంటున్నట్లు ప్ర భుత్వం తరపున అదనపు ఏజీఇచ్చిన హామీ ని హైకోర్టు రికార్డు చేసింది. ముందుగా నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం ప్రక్రియను పాటిస్తున్నారాఅనే ప్రశ్నకు చేస్తున్నామని ఏఏజీ చెప్పారు. పరిహారంపై సంప్రదిపులు చేశాకే అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపడుతున్నామన్నారు. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకే కూల్చివేతలు ఉంటాయని హైడ్రా లాయర్ చెప్పారు. వాదనల త ర్వాత హైకోర్టు ధర్మాసనం, స్టే వంటి మధ్య ంతర ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితులు లేవ ంది.తదుపరివిచారణను 3వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా కౌం టర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హైడ్రాను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.శ్రీనివాస్రావు డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.




# భూకేటాయింపు అక్రమాలపై అమోయ్ కుమార్‌ను ప్రశ్నించిన ఇడి

ప్రజాపక్షం/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో భూకేటాయింపులపై అక్రమాలు జరిగాయన్న కేసులో ఐఎఎస్ అధికారి అమోయ్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు బుధవారం విచారించారు. గతంలో అమోయ్ కుమార్ రం గారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఈ అక్రమ భూ కేటాయింపులు జరి గాయని ఇడి ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసందే. ఐదు రోజుల క్రితం విచారణకు హాజరుకాలని ఇడి నోటీసులు సైతం జారీ చేసింది. దీంతో ఆయన బుధవా రం ఉదయం 8 గంటలకు మీడియా కంటపడకుండా బషీర్‌బాగ్‌లోని ఇడి కార్యాలయానికి వచ్చారు. ఇడి అధికారులు ఆయనను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారించారు. వం దల కోట్ల రూపాయల విలువ చేసే 42 ఎకరాల భూమిని అక్రమంగా ఎలా బదిలి చేశారని ఇడి ప్రశ్నించినట్లుగా తెలుస్తోంది.



అమోయ్ కుమా ర్ గతంలో రంగారెడ్డి, మేడ్చల్ మ ల్కాజ్గిరి జిల్లాలకు కలెక్టర్‌గా పని చే శారు. అతని బ్యాంక్ అకౌంట్లపై కూడా విచారణ కొనసాగించారని సమాచా రం. వందల కోట్ల విలువైన భూ దాన భూములబదిలీ వెనుక పెద్ద మొత్తంలో డబ్బు లు చేతులు మారినట్లు ఇడి అధికారులకు పక్కా సమాచారం ఉంది. ఈ సమాచారం మేరకు అమోయ్‌ను విచారించినట్లు తెలిసింది.కొంత మంది రైతులు కూడా అమోయ్‌కుమార్ భూ భాగోతంపై ఇడి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com